Prajalakshyam Telugu Daily

# ప్రజాలక్ష్యం

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : గోలి సమ్మిరెడ్డి

సంపుటి : 16 | సంచిక : 242 | కరీంనగర్ | శనివారం 17 జనవరి 2026 | పేజీలు: 12 | వెల: 2.00


## తల్లి అంత్యక్రియల్లో పాల్గొననున్న ఇన్నయ్య తాత్కాలిక బెయిల్ మంజూరు చేసిన కోర్టు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జనగామ, జనవరి 16 : యూపీఏ చట్టం కింద ఎన్ఐఏ అధికారులు అరెస్ట్ చేసిన సామాజిక కార్యకర్త గాదె ఇన్నయ్యకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. శుక్రవారం ఆయనకు షరతులతో కూడిన 48 గంటల తాత్కాలిక బెయిల్‌ను కోర్టు మంజూరు చేసింది.గాదె ఇన్నయ్య తల్లి థెరీసా (93) గురువారం రాత్రి మరణించారు. ఈ నేపథ్యంలో ఆయనకు కోర్టు ఈ బెయిల్ మంజూరు చేసింది. శనివారం జనగామ జిల్లాలోని జాఫర్‌గఢ్ మండలం సాగరంలో ఆయన తల్లి (11వ పేజీలో)

## బెంగాల్లో నేటి నుంచి మోడీ రెండ్రోజుల పర్యటన

### పలు కార్యక్రమాల్లో పాల్గొననున్న ప్రధాని



(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)


కోల్‌కతా, జనవరి 16 : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈనెల 17,18 తేదీల్లో పశ్చిమబెంగాల్లో పర్యటించనున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు రాజకీయ ర్యాలీల్లోనూ పాల్గొంటారు. ఎన్నికల జాబితా ఎస్ఐఆర్ ప్రక్రియ, (11వ పేజీలో)



# పైరవీలు చేయను... పర్సనల్ ఎజెండా లేదు

## తెలంగాణ రాష్ట్ర అభివృద్ధియే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

- ఉమ్మడి జిల్లాకు యూనివర్సిటీ మంజూరు
- బాసర ఐఐటీలోన క్యాంపస్ ఏర్పాటు చేస్తాం
- నిర్మల్ జిల్లాకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ మంజూరు
- ఆదిలాబాద్ విమానాశ్రాయానికి ప్రధానితో శంకుస్థాపన
- పనుల కోసమే ప్రధాని మోదీతో భేటీ అవుతూనే ఉంటా
- తుమ్మడిహట్టి వద్ద ప్రాజెక్ట్ కట్టి తీరుతాం
- కెసిఆర్ అప్పులతో తెలంగాణ కుప్పయ్యింది
- అభివృద్ధికై ఆశీర్వదించండి... మున్సిపల్ ఎన్నికల్లోనూ ఆదరించండి
- నిర్మల్ బహిరంగ సభలో సిఎం రేవంత్ పిలుపు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, జనవరి16 : తెలంగాణ రాష్ట్ర అభివృద్ధియే ప్రజా ప్రభుత్వ ప్రధాన ధేయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేసారు. పాలమూరు జిల్లాతో సమానాంగా ఆదిలాబాద్ జిల్లాకు నిధులు మంజూరు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల అనంతరం నిర్మల్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు. నిర్మల్ ప్రజలు ఇచ్చిన భరోసా, మద్దతు వల్లే సీఎం అయ్యాను. ఆదిలాబాద్ జిల్లా పోరాటానికి, పౌరుషానికి గడ్డ అంటూ... జల్, జంగల్, జీమీన్ అంటూ కుమురం భీం కొట్లాడారని అన్నారు. ఈ జిల్లాలో జరగాల్సినంత అభివృద్ధి జరగలేదు. బాసర ట్రిపుల్ ఐటీలోనే యూనివర్సిటీ ఏర్పాటు చేస్తాం. జిల్లాలోని ప్రజాప్రతినిధులంతా ఇందుకు సహకరించాలి. పారిశ్రామికంగానూ ఆదిలాబాద్‌ను అభివృద్ధి చేస్తాం. జిల్లాకు ఎయిర్ బస్ తీసుకొస్తాం.ఎయిర్‌పోర్టు కోసం 10వేల ఎకరాల భూమిని సేకరించాల్సి ఉందన్నారు. విమానాశ్ర యం ప్రారంభోత్స వానికి ప్రధాని మోదీని ఆహ్వానిద్దాం. తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు కట్టాల్సిందే.. ఆదిలాబాద్ జిల్లాకు నీరు ఇవ్వాల్సిందే. ప్రతి 3 నెలలకు ఒకసారి ప్రధాని వద్దకు వెళ్తున్నాం. ఆయనకు ఇవ్వాల్సిన గౌరవం ఇచ్చి అడగాల్సిన ప్రాజెక్టులు అడుగుతున్నాం. (11వ పేజీలో...)




# లక్ష్యం మేరకు ఉద్యోగాల కల్పన



- ఇప్పటికే 70వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ
- గ్రూప్-3కి ఎంపికైన వారికి నియామక పత్రాలు
- నిరుద్యోగులతో ఆడుకున్న గత బిఆర్ఎస్ ప్రభుత్వం
- కేసులతో నియామకాలను అడ్డుకునే యత్నాలు
- వారి ఉద్యోగాలు పోవడంతోనే మీకు ఉద్యోగాలు
- నియామక పత్రాలు అందించిన సిఎం రేవంత్ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రంగారెడ్డి, జనవరి 16 : తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ప్రాణ త్యాగాలతో సాధించుకున్నామని.. కానీ బీఆర్ఎస్ పాలనలో నిరుద్యోగుల ఆశలు నెరవేరలేదని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. నిరుద్యోగుల జీవితాలతో బీఆర్ఎస్ పాలకులు ఆడుకున్నారని మండిపడ్డారు. పదేళ్ల పాలనలో వారు... వారి స్వప్రయోజనాలే చూసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాంతో ఓపిక నశించిన యువత.. కేసీఆర్‌ను ఇంటికే పరిమితం చేశారని పేర్కొన్నారు. శుక్రవారం శిల్పకళా వేదికలో కొలువుల పండగ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి.. గ్రూప్-3కి ఎంపికైన 1,370 మంది అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలకుల ఉద్యోగాలు పోతేనే మీకు ఉద్యోగాలు వచ్చాయన్నారు. పిల్లల భవిష్యత్ కోసం తల్లిదండ్రులు ఎంతో కష్టపడుతున్నారని చెప్పారు. ఉద్యోగాలు ఇవ్వకూడదని కోర్టుల్లో కేసులూ వేశారన్నారు. అన్ని అవరోధాలు అధిగమించి ఉద్యోగాలు ఇస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో గ్రూప్-1 నియమకాలు చేపట్టలేదన్నారు. గతంలో నియామక పరీక్షలు కూడా సరిగా నిర్వహించ లేదని గుర్తు చేశారు. నిరుద్యోగులు తమ విలువైన సమయం కోల్పోయే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము వచ్చాక తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రక్షాళన చేశామన్నారు. యూపీఎస్సీ తరహాలోనే టీజీపీఎస్సీని సంస్కరించామని తెలిపారు. ఇప్పటి వరకు 70 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని వివరించారు. గతంలో అర్హత లేనివారికి టీజీపీఎస్సీలో కీలక ఉద్యోగాలు ఇచ్చారంటూ బీఆర్ఎస్ పార్టీ నేతలపై సీఎం నిప్పులు చేశారు. (11వ పేజీలో)

## ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారం

# స్పీకర్‌కు మరో రెండు వారాల గడువు



### విచారణ సందర్భంగా సుప్రీం వెల్లడి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

న్యూఢిల్లీ, జనవరి 16 : బీఆర్ఎస్ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసుపై సుప్రీం కోర్టులో విచారణ వాయిదా పడింది. రెండు వారాల తరువాత ముగ్గురు ఎమ్మెల్యేల అనర్హతపై తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చేపట్టిన పక్రియపై అఫిడవిట్ దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశించింది. అయితే నాలుగు వారాల సమయం కావాలని స్పీకర్ తరఫు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ న్యాయస్థానాన్ని కోరారు. ఈ కేసులో పురోగతిని పరిశీలించి అవసరమైతే మరో రెండు వారాల గడువు పెంచుతామని ధర్మాసనం స్పష్టం చేసింది. శుక్రవారం ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసుపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టిన్ జార్జ్‌ల ధర్మాసనం ముందు ఈ కేసు విచారణకు వచ్చింది. బీఆర్ఎస్ నుంచి ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేలలో ఇప్పటికే ఏడుగురు ఎమ్మెల్యేల అనర్హతపై తెలంగాణ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారని.. మిగతా ముగ్గురు ఎమ్మెల్యేలపై నిర్ణయానికి కొంత సమయం కావాలని స్పీకర్ తరఫు న్యాయవాది కోరారు. స్పీకర్‌కు కంటి శస్త్ర చికిత్స జరగడంతో ఆస్పత్రిలో ఉన్నారని, కొత్త అసెంబ్లీ సెక్రటరీ జనరల్ వచ్చినందున పక్రియ ఆలస్యమైందని న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ కోర్టుకు నివేదించారు. ఇప్పటివరకు స్పీకర్ తీసుకున్న నిర్ణయాలను నివేదిక రూపంలో ఆయన కోర్టుకు సమర్పించారు. మిగతా ముగ్గురు సభ్యులపై నిర్ణయం తీసుకునేందుకు నాలుగు వారాల సమయం కావాలని ధర్మాసనానికి స్పీకర్ తరఫు న్యాయవాది విజ్ఞప్తి చేశారు. గత ఏడాదిగా ఇదే చెబుతున్నారని బీఆర్ఎస్ తరఫు న్యాయవాది (11వ పేజీలో...)

# రైతుల పంటలకు గిట్టుబాటు ధరల



### వానాకాలం సీజన్‌లో కందుల కొనుగోళ్లు
### లాభదాయక ధర కల్పించడమే తమ లక్ష్యం
### వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, జనవరి 16 : రైతులకు గిట్టుబాటు ధరఇవ్వడం కోసం తమ ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. వానాకాలం 2025-2026 సీజన్‌లో కందుల కొనుగోళ్లు (11వ పేజీలో...)

# వేములవాడ అభివృద్ధికి శ్రీకారం



- నిధులు కేటాయించి పనులు ప్రారంభం
- విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి
- రాజన్న ఆలయం సందర్శన
- గత కెసిఆర్ ప్రభుత్వం
- వేములవాడను విస్మరించింది
- రాజన్న ఆలయ సందర్శనలో మంత్రి సీతక్క

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వేములవాడ, జనవరి 16 : వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టారని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. రాజన్న అనుబంధ భీమేశ్వర ఆల యంలో స్వామి వారిని మంత్రి శుక్రవారం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి మీడియాతో మంత్రి మాట్లాడారు. వేములవాడలో భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. ఆలయాల అభివృద్ధి.. భావోద్వేగాలు, ఆచారాలతో ముడి పడి ఉంది. ఈనెల 18న మేడారంలో క్యాబినెట్ భేటీ జరుగుతుంది. 19న మేడారంఆలయాన్ని సీఎం పునఃప్రారంభిస్తారు. పుష్కరాల దృష్ట్యా గోదావరి పరివాహక ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని సీతక్క తెలిపారు. (11 పేజీలో)

# జైపాల్ రెడ్డికి సిఎం రేవంత్ నివాళి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, జనవరి16 : దివంగత మాజీ కేంద్ర మంత్రి జైపాల్ రెడ్డి 84వ జయంతి సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి తదితరులు ఘనంగా నివాళి అర్పించారు. నెక్లెస్ రోడ్‌లోని జైపాల్ సమాధి స్ఫూర్తి స్థల్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. రాష్ట్రానికి, దేశానికి జైపాల్ రెడ్డి చేసిన సేవలను కొనియా డారు. కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, మాజీమంత్రి చిన్నారెడ్డి, పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.



### పదేళ్ల పాలనలో

# అప్పులు తప్ప అభివృద్ధి లేదు



- ఫామ్ హౌజ్‌లో ఉంటూ రాజకీయాలతో తెలంగాణకు నష్టం
- రాక్షసుల్లా అభివృద్ధికి అడ్డుపడుతున్నారు
- మండిపడ్డ సిఎం రేవంత్

(ప్రజాలక్ష్యంప్రతినిధి)

నిర్మల్, జనవరి 16 : ఆదిలాబాద్ జిల్లా అంటే తనకు ప్రత్యేకమైన అభిమానం ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. అత్యంత వెనుకబడిన ఈ జిల్లాకు ఆశించిన న్యాయం జరగలేదని పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో శక్రవారం పర్యటించిన సిఎం రూ.386.46 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. హాతిఘాట్‌లో చనాకా-కొరాట బ్యారేజ్ పంప్‌హౌస్ ప్రారంభించారు. సదర్మట్ బ్యారేజ్‌ను జాతికి అంకితం చేశారు. యాసంగి పంటకు నీరు విడుదల చేశారు. పొన్కల్ దగ్గర గోదావరి నదిపై సదర్మట్ బ్యారేజ్ నిర్మాణాన్ని ప్రారంభించారు. రూ.676 కోట్లతో ప్రభుత్వం సదర్మట్ బ్యారేజ్ నిర్మాణం చేపట్టిందని సీఎం ప్రసం గించారు. ఈ బ్యారేజ్ ద్వారా 18 వేల ఎకరాలకు సాగునీరును ప్రభుత్వం అందిం చనుంద న్నారు. కేసీఆర్ హయాంలో చిత్తశుద్ధిగా పనిచేసి ఉంటే చనాక- కొరాట ప్రాజెక్టు ఎప్పుడో పూర్తయ్యేదని తెలిపారు. (11 పేజీలో)

# మెట్రో రెండోదశకు కేంద్ర సుముఖం

### ఎల్&టి నుంచి టేకోవర్ లావాదేవీలు పూర్తి చేయండి
### రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి ఇద్దరేసి సభ్యులతో కమిటీ
### సిఎం రేవంత్‌కు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లేఖ



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, జనవరి16 : హైదరాబాద్ మెట్రో రెండో దశ కోసం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ని కలిసి చర్చించానని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వివరించారు.ముందుగా మెట్రో మొదటి దశను ఎల్ అండ్ టీ నుంచి (11 పేజీలో)

# 18న పాలేరుకు సీఎం రేవంత్ రెడ్డి

### రూ.362 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం
### చారిత్రక ఘట్టం.. మేడారంలో రాష్ట్ర క్యాబినెట్ భేటీ
### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, జనవరి 16 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉమ్మడి ఉమ్మడి ఖమ్మం జిల్లాల పర్యటనలో భాగంగా ఈ నెల 18న ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పాలేరు నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. (11 పేజీలో)





# రైతు అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

(ప్రజాలక్ష్యం బ్యూరో)

ఆదిలాబాద్, జనవరి 16 : రైతు అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం భోరజ్ మండలం హాతిగట్ గ్రామంలోని చనాక-కోరాట పంప్ హౌస్ హౌస్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డిలతో కలిసి బటన్ నొక్కి ప్రారంభించి, లోయర్ పెన్ గంగ ప్రాజెక్టు ప్రధాన కాలువకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందని, రైతు అభివృద్ధి దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఆదిలాబాద్ అడవుల జిల్లా వర్షాధార వ్యవసాయ సాగు చేస్తుందని, ప్రజల త్రాగునీరు, సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. సంవత్సరాలుగా పెండింగ్ ఉన్న ప్రజల సుదీర్ఘ స్వప్నం పెన్ గంగ ప్రాజెక్టును సాకారం చేసిందని తెలిపారు. ప్రభుత్వం 1 వేయి 891 కోట్ల రూపాయల వ్యయంతో పరిపాలన అనుమతులు మంజూరు చేయగా 5.12 టిఎంసిల నీటిని వినియో గించుకునే విధంగా చనాక కొరాటా బ్యారేజీతో పాటు పెన్ గంగ ప్రాజెక్టు రూపకల్పన చేయబడిందని, ఈ ప్రాజెక్టు ద్వారా ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్ రూరల్, బీంపూర్, జైనథ్, బేల మండలాలలోని 89 గ్రామాలలో 51 వేల ఎకరాలకు సాగునీరు, ఈ ప్రాంతాల ప్రజలకు త్రాగునీరు అందించే విధంగా ప్రణాళిక రూపొందించడం జరిగిందని తెలిపారు. ఈ క్రమంలో ఆయకట్టుకు నీటిని అందించేందుకు డి14 నుండి డి19 గల ఉప కాలువల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, ప్రాజెక్టులు భాగంగా నీటిని నిల్వ చేసేందుకు పిప్పలకోటి బ్యాలెన్సింగ్ జలాశయం నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. చనాక కొరాట్‌బ్యారేజ్ కు అనుబంధంగా ప్రధాన కాలువ, మోటార్లతో పంపు హౌస్ పనులు కొనసాగుతున్నాయని, తాంసి, భీంపూర్ మండలాలలోని 15 గ్రామాలలో గల 13 వేల 500 ఎకరాల నూతన ఆయకట్టును వృద్ధిలోకి తీసుకువచ్చేందుకు 368 కోట్ల రూపాయలతో పరిపాలన అనుమతులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. లోయర్ పెన్ గంగ ప్రాజెక్టుకు అనుబంధంగా ప్రధాన కాలువ 47 కి.మీ. నుండి 89.90 వరకు, డిస్ట్రిబ్యూటరీ కాలువలు డి14 నుండి డి26 వరకు, పిప్పల్ కోటి నిల్వ జలాశయం నిర్మాణం ద్వారా తాంసి, బీంపూర్, ఆదిలాబాద్, జైనథ్, బేల మండలాలలో గల 75 గ్రామాలలో 51 వేల నూతన ఆయకట్టును వృద్ధిలోకి తీసుకురావడం కొరకు 1 వేయి 227 కోటి రూపాయలు పరిపాలనాపరమైన అనుమతులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. అభివృద్ధి పనులకు గాను 3 వేల 313 ఎకరాల భూ సేకరణ అవసరం ఉండగా ఇప్పటివరకు 1 వేయి 545 ఎకరాల భూమి సేకరించి 117 కోట్ల రూపాయలు వెచ్చించడం జరిగిందని తెలిపారు. ప్రధాన కాలువ నిర్మాణంలో భాగంగా 138 కట్టడాలు చేపట్టడం జరిగిందని, సాత్నాల నదిపై 1.675 కిలోమీటర్ల మేర నిర్మించిన ప్రీకాస్ట్ పోస్ట్ టెన్షన్డ్ వయాడక్ట్ కొరకు 259.81 కోట్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఉపకాలవల నిర్మాణం చేపట్టి నూతన ఆయకట్టు విస్తీర్ణాన్ని పెంపొందించడంతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన రైతు సంక్షేమ కార్యక్రమాల ద్వారా రాష్ట్రంలో వ్యవసాయ సాగు విస్తీర్ణాన్ని పెంపొందించి రైతు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు కృషి చేస్తుందని తెలిపారు. అంతకుముందు హెలిప్యాడ్‌కు వద్ద జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఎంపీ గోడం నగేష్, స్థానిక ఎమ్మెల్యే పాయల శంకర్, బోథ్ శాసన సభ్యులు అనిల్ జాదవ్, అధికారులు, ప్రజాప్రతినిధులు, పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం పంపు హౌస్ వద్ద పోలీసు గౌరవ వందనం స్వీకరించి, ఫోటో స్టాల్ ను సందర్శించారు. నీటి విడుదలకు సంబంధించిన వివరాలను కలెక్టర్, నీటిపారుదల శాఖ అధికారులు ముఖ్యమంత్రికి, మంత్రులకు తెలియజేశారు. తదుపరి నాగోబా ఆలయ కమిటి సభ్యులు జాతరకు రావాలని ముఖ్యమంత్రి, మంత్రులను కలెక్టర్, ఎస్పీ లతో కలిసి ఆహ్వాన పత్రిక అందజేసి ఆహ్వానించి నాగోబా ప్రతిమ గల మెమోంటో ను కలెక్టర్, ఎస్పీ అందజేశారు. ఈ కార్యక్రమాలలో అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి, రాజేశ్వర్, ఐటిడిఏ పీఓ యువరాజ్ మర్మాట్, ఆర్డీఓ స్రవంతి, ఎమ్మెల్సీ దండే విఠల్, జిసిసి చైర్మన్ తిరుపతి, గ్రంథాలయ చైర్మన్ నర్సయ్య, నీటిపారుదల శాఖ ఎస్ఈ విశ్వ కళ్యాణ్, విద్యుత్, ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు..

# బిఆర్ఎస్ నాయకులను కార్పొరేటర్లుగా గెలిపించాలి..!




### భవిష్యత్తులో రానున్నది కేసీఆర్ ప్రభుత్వం..!
### బిఆర్ఎస్ హాయంలోనే అనందంగా ఉన్న ప్రజలు..!
### మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటి (గోదావరిఖని), జనవరి 16 : పది సంవత్సరాల బిఅర్ఎస్ పాలనలోనే తెలంగాణ ప్రజలంతా అనందంగా ఉన్నారని,రానున్నది కెసిఅర్ పాలనే అని రామగుండం మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి బిఅర్ఎస్ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్ అన్నారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో బిఆర్ఎస్ నాయకులను కార్పొరేటర్‌గా గెలిపించాలని ఆయన కోరారు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనతో తెలంగాణ రాష్ట్రం మళ్లీ అభివృద్ధికి దూరమవుతుం దన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం కేసీఆర్ పదేళ్ల కాలం పాలనలో అభివృద్ధిలో పరుగులు తీసిందన్నారు. మకర సంక్రాంతి పండుగ సందర్భంగా గురువారం గోదావరిఖని చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే చందర్ బిఅర్ఎస్ నాయకులతో కలిసి గాలి పటా లను ఎగురవేస్తూ కైట్ ఫెస్టివల్ ను ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి గాలిపటాలను గాల్లోకి ఎగురవేస్తూ సంబరాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనతో తెలంగాణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.సంక్రాంతి పర్వదినాన ఉత్తరాయణం లోకి సూర్యుడు ప్రవేశిస్తారని, ఆ సూర్యుడి కిరణాలు మనపై పడితే ఆరోగ్యవంతులు అవుతామని అన్నారు. సంక్రాంతి పర్వదినాన పిల్లలు, పెద్దలు అంతా గాలి పాటలను ఎగురవేస్తూ సంతోషంగా సంబరాలను జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు. గత 10 సంవత్సరాల కేసీఆర్ పాలనలో ప్రజలంతా సంక్షేమ పథకాలను పొందుతూ సంతోషంగా ఉన్నారని అన్నారు. నేడు కాంగ్రెస్ పాలనలో రామగుండం ప్రజలు భయంతో బతుకుతున్నారని తెలిపారు. ఇక రానున్నది మళ్ళీ బిఆర్ఎస్ పాలనేనని ప్రజలకు మంచి రోజులు వస్తాయని అన్నారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజలంతా కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి వచ్చేలా బిఆర్ఎస్ కార్పొరేటర్లను గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు జిమ్మిబాబు, బుర్రి వెంకటేష్,నూతి తిరుపతి, కిరణ్, మెతుకు దేవరాజు,సట్టు శ్రీనివాస్, తిమోతి, పిల్లి రమేష్, నిమ్మరాజుల సాగర్ అర్శనపల్లి శ్రీనివాస్ ఇరుగురాళ్ల శ్రావన్, చింటూ, కొడి రామకృష్ణ, భానుచందర్, ఆవునూరి వెంకటేష్, కనకరాజ్, పవన్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు

# సదర్మాట్ బ్యారేజీ ద్వారా వేల ఎకరాలకు సాగునీరు




### రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్ జిల్లాజనవరి 16 : నిర్మల్ జిల్లా మామడ మండలం పొన్కల్ గ్రామ సమీపంలో నిర్మించిన సదర్మాట్ బ్యారేజీని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, సదర్మాట్ బ్యారేజీ ద్వారా వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందని తెలిపారు, 2016 అక్టోబర్‌లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టును 676.592 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించగా, ఇందుకోసం 1,176 ఎకరాల భూమిని సేకరించారని పేర్కొన్నారు,ఈ బ్యారేజీ ద్వారా నిర్మల్ జిల్లా కడెం, ఖానాపూర్ మండలాల్లో 12 వేల ఎకరాలు, జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ ప్రాంతాల్లో 5 వేల ఎకరాలు కలిపి మొత్తం 18,016 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందని తెలిపారు, ప్రాజెక్టు పరిధిలో కడెం, ఖానాపూర్, కోరుట్ల మండలాల్లోని 34 గ్రామాల వ్యవసాయ భూములకు సాగునీరు అందనుందని వివరించారు, పాత సదర్మాట్ అనికట్, గంగానాలా ఆయకట్టు స్థిరీకరణకు 1.58 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో నీటిని సాగు అవసరాలకు అనుగుణంగా విడుదల చేస్తామని తెలిపారు, రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, రైతుబంధు, రైతు భరోసా, రుణమాఫీ వంటి పథకాలతో పాటు, పంట ఉత్పత్తులను కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, శాసనమండలి సభ్యులు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్‌పీ జానకి షర్మిల, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అరైవ్ - అలైవ్ ముఖ్య లక్ష్యం..!



### సురక్షిత ప్రయాణం చేయడానికి..!
### ప్రమాదాల నివారణకు శాఖల సమన్వయం..!
### పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కోల్ సిటి (గోదావరిఖని), జనవరి 16 : అరైవ్ - అలైవ్ ముఖ్య లక్ష్యం..! సురక్షిత ప్రయాణం చేయడానికి గాను ఉద్దేశించిన ఒక ముఖ్య కార్యక్రమం అని రామగుండం సిపీ అంబర్ కిషోర్ ఝా అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వ శాఖలతో పోలీస్ శాఖ సమన్వయంతో పనిచేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణ, ప్రజల వాహనదారుల ప్రాణాల రక్షణే ముఖ్య ఉద్దేశ్యంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన అరైవ్ - అలైవ్ కార్యక్రమంలో భాగంగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మార్గదర్శకత్వంలో, డీసీపీ బి. రామ్ రెడ్డి, రామగుండం ట్రాఫిక్, గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ ఆధ్వర్యంలో రామగుండం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్, విద్య, రోడ్డు రవాణా, ఆరోగ్య, ఆర్ అండ్ బి శాఖ, తదితర శాఖల అధికారులు, ఉద్యో గులకు రోడ్డు భద్రత నియమాల ప్రాముఖ్యతపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామగుండం పోలీస్ కమిషనర్, అడిషనల్ కలెక్టర్, పెద్దపల్లి డీసీపీ ముఖ్య అతిథులుగాహాజరయ్యారు.

ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ అరైవ్-అలైవ్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం ప్రతి వ్యక్తి సురక్షితంగా తన గమ్యస్థానానికి చేరుకోవడమేనని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులతో సమన్వయం చేస్తున్నామని సీపీ అన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఏడాది 30 శాతం ప్రమాదాల నివారణ కోసం చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. అందులో భాగంగా మున్సిపల్, విద్య, ఆరోగ్య, రోడ్డు రవాణా, ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులతో కలిసి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగులు ట్రాఫిక్ పై అవగాహన కల్పించేలా చొరవ చూపాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు సమన్వయము తో అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.ఇందుకోసం ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా రోడ్డు భద్రత నియమాలను పాటించాలని సూచించారు.ట్రాఫిక్ రూల్స్‌ను తప్పక పాటిస్తూ వాహనాలు నడపడం, సేఫ్ అండ్ డిఫెన్సివ్ డ్రైవింగ్ పద్ధతులు అనుసరించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని వివరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్లు , ఇతర ఫోర్ వీలర్ లు నడిపే వాహనదారులు సీట్ బెల్ట్ వినియోగం తప్పనిసరి అని స్పష్టం చేశారు.అలాగే ప్రతి వాహనదా రుడి వద్ద డ్రైవింగ్ లైసెన్స్, వాహన ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్ వంటి వాహన ధ్రువపత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు.ఇవి చట్టపరంగానే కాకుండా ప్రమాద సమయంలో ఆర్థిక భద్రతను కూడా కల్పిస్తాయని సీపీ వివరించారు. ప్రభుత్వ ఉద్యోగులు ముందుగా రోడ్డు భద్రత నియమాలను పాటించి ప్రజలకు ఆదర్శంగా నిలవాలని, వారి బాధ్యతాయుత ప్రవర్తనతో సమాజంలో మార్పు తీసుకురావచ్చని సీపీ అంబర్ కిషోర్ ఝా పిలుపు నిచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులకు సిపి హెల్మెట్‌లను పంపిణీ చేశారు.ఈ అవగా హన కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ, పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి, పెద్దపల్లి ఏసీపీ జి. కృష్ణ, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్ పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, రామగుండం ట్రాఫిక్ ఇన్స్ పెక్టర్ రాజేశ్వరరావు, రామగుండం ఎంఇఓ జింక మల్లేష్, సివిల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. కృపా భాయ్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్ పెక్టర్ ప్రదీప్ సాగర్, రోడ్లు అండ్ భవనాల శాఖ డిఈ జాఫర్, ఆర్టీసీ ఎడిఎం రామగుండం, ఎస్ఐ రమేష్, అనూష, ట్రాఫిక్ ఎస్ఐలు హరిశేఖర్, రామరాజు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# చనాకా-కొరాటా పంప్‌హౌస్‌ను ప్రారంభించిన సిఎం

### నల్లమల సాగర్‌కు తాము వ్యతిరేకమన్న ఉత్తమ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, జనవరి 16 : ఆదిలాబాద్ జిల్లాలో సిఎం రేవంత్ రెడ్డి శుక్రవారం పర్యటించిన సందర్భంగా భోరాజ్ మండలం హతిఘాట్‌లో చనాకా-కొరాటా పంప్‌హౌస్‌ను ప్రారంభించి ప్రధాన కాలువకు నీటిని విడుదల చేశారు. జిల్లా పర్యటనలో భాగంగా రూ.386.46 కోట్లతో పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసారు. ఈ కార్యక్రమంలో సిఎంతోపాటు మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, పలువురు ఎమ్మెల్యేలు ఉన్నారు. అనంతరం నిర్మల్ జిల్లాలో సిఎం పర్యటించారు. పొంకల్ గ్రామంలో సదర్మట్ బ్యారేజీని ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ చేపట్టిన నల్లమల సాగర్ కు తాము వ్యతిరేకమని ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిస్పష్టం చేశారు. సుప్రీంకోర్టులో దీనిపై పోరాటం చేస్తున్నామని తెలిపారు. గోదావరి జలాల్లో చుక్క నీరు కూడా వదులుకునేది లేదని అన్నారు. నిర్మల్ లో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడిన మంత్రి.. తుమ్మిడిహట్టి నుంచి గ్రావిటి ద్వారా సుందిళ్ల ప్రాజెక్టుకు తరలిస్తామని చెప్పారు. సుందిళ్ల నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టుకు నీటిని తరలిస్తామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో చెనాక కోరాట బ్యారేజి కోసం మరో వంద కోట్ల నిధులు విడుదల చేయనున్నట్లు తెలిపారు. మంత్రి ఉత్తమ్. చెనాక కోరాట బ్యారేజికి మాజీ మంత్రి రామచంద్రా రెడ్డి పేరు , సదర్ మర్‌కు పి.నర్సారెడ్డి పేర్లు పెడుతున్నట్లు చెప్పారు. పీపీ ప్రాజెక్టు, మత్తడి, కుప్టి ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. 27 ప్యాకేజీలకు రూ.97 కోట్లతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో లక్ష ఎకరాలకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు.

# సీఎంను కలిసి సమస్యలను వివరించిన కోరుట్ల ఎమ్మెల్యే



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, జనవరి 16 : సదర్మాట్ బ్యారేజ్ ప్రారంభోత్సవం సందర్భంగా నిర్మల్ జిల్లా మామడ మండలం పొన్కల్ గ్రామానికి విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి పలు కీలక అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చి, నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. సాగునీటి అంశాలు, గంగనాల ప్రాజెక్ట్‌లోకి ప్రత్యేక తూము ద్వారా నీరు అందించాలని కోరారు. దీని ద్వారా నియోజకవర్గంలోని 8 గ్రామాల్లో (వేములకుర్తి, ఫకీర్ కొండాపూర్, యమాపూర్, మొగిలి పేట, సంగెం శ్రీరాంపూర్, కొత్త పాత ధామ్రాజ్ పల్లి, ఓబులాపూర్ గ్రామాలకు సుమారుగా 8,000 ఎకరాలకు సాగునీటి లబ్ధి చేకూరుతుందని వివరించారు. నియోజకవర్గంలోని చివరి ఆయకట్టు వరకు నీరు అందించాలని విజ్ఞప్తి చేశారు. మల్లాపూర్ మండలంలోని గొర్రెపెల్లి చెరువు పునరుద్ధరణ, రేగుంట మాటూ కాలువ, మాదాపూర్ చెక్ డ్యామ్‌తో పాటు ఇతర ఇరిగేషన్ పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. మెట్పల్లి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి భవనాన్ని పూర్తి చేయాలని కోరారు. కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు, అవసరమైన వైద్య పరికరాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. కోరుట్ల ఆసుపత్రిలో ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరారు. మెట్పల్లి పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు. ఉర్దూ మీడియం పాఠశాల భవన నిర్మాణం పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. నియోజకవర్గంలోని పలు రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. కల్లూరు బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కోరుట్ల, మెట్పల్లి పట్టణాలకు గతంలో మంజూరు చేసిన టీయూ ఎఫ్ఐడీసీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ తెలిపారు.

# భక్తులకు అసౌకర్యాలు కలగకుండా చూడాలి

## సమ్మక్క- సారలమ్మ జాతర ఏర్పాట్ల పరిశీలన
## కార్యకర్తలతో కలిసి పతంగుల ఎగరవేత
## రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటి (గోదావరిఖని), జనవరి 16 : గోదావరినది తీరాన జనగామ శివార్లలో కోల్ బెల్ట్ బ్రిడ్జి సమీపంలో జనవరి 28 నుండి 31 వరకు శ్రీ సమ్మక్క-సారలమ్మ జాతర నునిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సమ్మక్క-సారలమ్మ గద్దె లను పునః ప్రతిష్టించారు. ఇటీవల ఆ తల్లుల గద్దెలను ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ ప్రారంభించారు. జాతరను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలనే సంకల్పంతో ఎమ్మెల్యే మరోసారి స్వయంగా ఏర్పాట్లను పరిశీలించారు.శ్రీ సమ్మక్క-సారాలమ్మ జాతరకు రానున్న భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పక్కాగా ఏర్పాట్లు చేయాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎమ్మెల్యే సింగరేణి ఆర్జీవన్ ఏరియా జీఎం. లలిత్ కుమార్ తో కలిసి జాతర మైదానాన్ని, జరుగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జాతర ప్రాంగణంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూ లైన్లు, తాగునీరు, విద్యుత్ దీపాలు, పారిశుద్ధ్య పనులపై ఎమ్మెల్యే ప్రత్యేకంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రం నలుమూలల నుండి వచ్చే భక్తులకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా అన్ని మౌలిక వసతులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. సింగరేణి యాజమాన్యం, స్థానిక యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని కోరారు.అనంతరం, సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన వేడుకల్లో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పాల్గొన్నారు. కార్యకర్తలు, నాయకులతో కలిసి సరదాగా గాలిపటాలు ఎగురవేసి సందడి చేశారు. పండుగ పూట ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ పార్టీ శతాబ్ది వేడుకల ముగింపు భారీ బహిరంగ సభ

## సభకు సింగరేణి కార్మికులను ఆహ్వానించిన ఏఐటియుసి నేత మిరియాల రంగయ్య



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, జనవరి 16 : ఈ నెల 18న ఖమ్మంలో జరిగే సిపిఐ పార్టీ శతాబ్ది వేడుకల ముగింపు భారీ బహిరంగ సభకు సింగరేణి కార్మికులు, అసంఘటిత కార్మికులందరూ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య కోరారు. సింగరేణి భద్రాద్రి- కొత్తగూడెం జిల్లా సింగరేణి కొత్తగూడెం సెంట్రల్ వర్క్ షాప్, మెయిన్ వర్క్ షాప్ లో శుక్రవారం ఉదయం గుర్తింపు కార్మిక సంఘం ఏఐటియుసి ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎఐటియుసి ఎన్నికైనప్పటినుండి ఇప్పటివరకు కార్మికుల సమస్యలపై పోరాడుతూనే ఉందని అన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు సొంత ఇంటి పథకం అమలుచేయాలని, పెర్క్స్ మీద ఇన్కమ్ టాక్స్ యాజమాన్యం చెల్లించాలని, మారుపేర్ల సమస్య పరిష్కరించాలని, అదేవిధంగా మెడికల్ బోర్డు పెట్టకుండా యాజమాన్యం కాలయాపన చేస్తుందని మండిపడ్డారు. సి ఎండి స్థాయి స్ట్రక్చర్ కమిటీ సమావేశంలో ఒప్పుకున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఫిబ్రవరి 12న నాలుగు లేబర్ కోడ్స్ కు వ్యతిరేకంగా జరిగే దేశవ్యాప్త సమ్మెకు అన్ని మైన్స్, డిపార్ట్మెంట్స్ లలో కార్మికులు పాల్గొని ఈ సమ్మెను విజయవంతం చెయ్యాలని కోరారు. ఏఐటియుసి గుర్తింపు సంఘంగా గెలిచిన దగ్గరనుండి కార్మికుల పక్షాన నిలబడి అనేక కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ముందుందని అన్నారు. శీతాకాలం అసెంబ్లీ సమావేశంలో ఏఐటీయూసీ యూనియన్ గౌరవ అధ్యక్షులు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కార్మిక సమస్యలపై మాట్లాడడం వలన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి,బట్టి విక్రమార్క సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమీక్ష నిర్వహించారని గుర్తు చేశారు. భవిష్యత్తులో కూడా కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సెంట్రల్ సెక్రెటరీ వంగ వెంకట్, కార్పొరేట్ కార్యదర్శి ఎస్.వి.రమణ మూర్తి, సహాయ కార్యదర్శి రాము, కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ క్రిస్టోఫర్, సెంట్రల్ వర్క్ షాప్ పిట్ సెక్రటరీ నరేష్, అడ్వైజర్ రాజేశ్వరరావు, బి.రవీందర్, శ్యామ్, నరసింహ రామ్మోహన్, మెయిన్ వర్క్‌షాప్ పిట్ సహాయ సెక్రెటరీ దినేష్, సత్యనారాయణ, మల్లయ్య, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ప్రయాణం సురక్షితంగా ఉండాలి..!

## రోడ్డు భద్రత నియమాలు పాటించాలి..!
## పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పెద్దపల్లి, జనవరి 16 : ప్రతి ఒక్కరి ప్రయాణం సురక్షితంగా ఉండాలి అంటే తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలను పాటించాలని పెద్దపల్లి డిసిపీ బి.రామ్ రెడ్డి అన్నారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వుల మేరకు, పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం పెద్దపల్లి పురపాలక సంఘంలోని ఉద్యోగులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనేనని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు, కార్లు, ఇతర నాలుగు చక్రాల వాహనాల్లో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ఉపయోగించాలని సూచించారు. ఇవి చిన్న నియమాలుగా కనిపించినప్పటికీ, ప్రమాద సమయంలో ప్రాణాలను కాపాడే కీలక భద్రతా చర్యలని డీసీపీ వివరించారు. అధిక వేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, మొబైల్ ఫోన్ వినియోగిస్తూ డ్రైవింగ్ చేయడం వంటి ప్రమాదకర అలవాట్లను పూర్తిగా నివారించాలని కోరారు. ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్డు సిగ్నల్స్ పాటిస్తూ వాహనాలు నడపడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు. ఈ అరైవ్, అలైవ్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం ప్రతి వ్యక్తి సురక్షితంగా తన గమ్యస్థానానికి చేరుకోవడమేనన్నారు.ఇందుకోసం ప్రభుత్వ ఉద్యోగులు ముందుగా రోడ్డు భద్రత నియమాలను పాటించి ప్రజలకు ఆదర్శంగా నిలవాలని డీసీపీపిలుపునిచ్చారు.ఈ అవగాహన కార్యక్రమంలో పెద్దపల్లి ఏసీపీ, జి. కృష్ణ, పెద్దపల్లి మునిసిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ పెద్దపల్లి సీఐ, కె. ప్రవీణ్ కుమార్, ట్రాఫిక్ సీఐ, బి. అనిల్ కుమార్, పెద్దపల్లి టౌన్ ఎస్ఐ, జె.లక్ష్మణ్ రావులు పురపాలక సంఘం అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మైనారిటీ గురుకుల విద్యా సంస్థలలో ప్రవేశాల పోస్టర్ ఆవిష్కరణ



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంనగర్, జనవరి 16 : తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో 2026--27 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాలు ప్రారంభమైనట్లు అదనపు కలెక్టర్ డా. అశ్విని తానాజీ వాకడే తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కరీంనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె అడ్మిషన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 5వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం (అన్ని గ్రూపులు)లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని తెలిపారు. అలాగే 6వ, 7వ, 8వ తరగతుల్లో మైనార్టీ మిగులు సీట్లు కూడా అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అర్హత గల మైనార్టీ విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. మైనార్టీ గురుకుల కేంద్రాలలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ద్వారా ఐఐటీ, నీట్, ఈఏపీసెట్‌కు ప్రత్యేక కోచింగ్ కూడా అందించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయాల్సి ఉండగా, [www.tgmreistelangan.cgg.gov.in](http://www.tgmreistelangan.cgg.gov.in) వెబ్‌సైట్‌లో జనవరి 16 నుంచి ఫిబ్రవరి 28లోపు అప్లై చేసుకోవాలని తెలిపారు. కరీంనగర్ జిల్లాలో మొత్తం 9 మైనార్టీ గురుకుల విద్యా సంస్థలు ఉండగా, అందులో 5 బాలురకు, 4 బాలికల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడ్డాయని అధికారులు వివరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో రీజినల్ లెవల్ కో ఆర్డినేటర్ విమల, విజిలెన్స్ అధికారులు అక్రమ్ పాషా, ఇంతియాజ్, ప్రిన్సిపాళ్లు వీర్ల మహేష్, పోరండ్ల చంద్రమోహన్, పిడిశెట్టి సంపత్, కనిపర్తి సురేష్, మౌనిక సోని, వార్డెన్లు సైఫుద్దీన్, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీ గురుకులాల్లో ఆన్‌లైన్ అడ్మిషన్లు ప్రారంభం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, జనవరి16:తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీ గురుకులాల అడ్మిషన్లు 2026-27 విద్యా సంవత్సరానికిగాను ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ కలెక్టరేట్ ఐడీఓసీ లోని క్యాంప్ ఆఫీస్‌లో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ, ముస్లిం మైనారిటీలు తమ పిల్లలను మైనార్టీ గురుకుల పాఠశాల ఐదవ తరగతి మరియు కళాశాల ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో చేర్పించాలని కోరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెంలో బాలికలకు, బాలురకు, బూర్గంపాడు బాలికలకు, భద్రాచలం బాలురకు, అశ్వారావుపేట బాలికలకు, ఇల్లందు బాలికలకు విడివిడిగా ఐదవ తరగతి , ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో ముస్లిం మైనారిటీ పిల్లలను తెలంగాణ ప్రభుత్వ మైనార్టీ గురుకులాల్లో చేర్పించాలని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మైనారిటీల విద్యావకాశాల కోసం ఏర్పాటు చేసిన గురుకులాల విద్యావకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అడ్మిషన్లు ఆన్‌లైన్ ప్రారంభం కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అభివృద్ధి అధికారి కే.సంజీవరావు, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆర్.ఎల్.సి ఎం.జే.అరుణ కుమారి, ఉమ్మడి ఖమ్మం జిల్లా విజిలెన్స్ అధికారులు కే.సీతారాములు, ఎం.ఏ. రవూఫ్, జిల్లాలోని మైనారిటీ గురుకులాల పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. మైనారిటీ గురుకులాల నాణ్యమైన ఉచిత విద్యావకాశాలపై అవగాహన కల్పించుటకు సీతారాములు అడ్మిషన్ల ప్రచార సాధనంగా రచించిన ఆడియో, వీడియో పాటలను జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కే.సంజీవరావు కార్యాలయంలో ప్రారంభించారు. తమ పిల్లలను చేర్పించడానికి పూర్తి వివరాల కోసం సంబంధిత పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాళ్లను సంప్రదించాలని వారు కోరారు.

# ఖమ్మం బహిరంగ సభను విజయవంతం చేయండి

## సీపీఐ జిల్లా కార్యదర్శి ఖలేక్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, జనవరి 16 : ఈ నెల 18న నిర్వహించ తలపెట్టిన ఖమ్మం బహిరంగ సభ విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఖలేఖ్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేద ప్రజలకు సిపిఐ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందనీ,10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీదేనన్నారు. టీఎన్జీవో భవన్‌లో బహిరంగ సభకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మంలో 5 లక్షల మందితో భారీ బహిరంగ సభ చేసినట్లు చెప్పారు.ఈ కార్యక్రమానికి సీఎంతో పాటు 40 దేశాల నుంచి కమ్యూనిస్టుల ప్రతినిధులు హాజరవుతున్నారని, సీపీఐ కార్యకర్తలు,కార్మికులు, రైతులు హాజరై భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాజగౌడ్, దినకర్ రాజు,ఎర్రదాస్, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.


# సీఎం రేవంత్ రెడ్డి కి స్వాగతం పలికిన ఆత్రం సుగుణ



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, జనవరి 16 : ఆదిలాబాద్ జిల్లాలోని చనాక-కొరాటా పంప్ హౌస్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హెలిప్యాడ్ వద్ద టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, కుమురం భీం ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. అనంతరం హెలిప్యాడ్ నుంచి కాన్వాయ్‌లో ముఖ్యమంత్రి వెంట కలిసి పంప్ హౌస్ వరకు వెళ్లారు.సీఎం రేవంత్ రెడ్డి,మంత్రులు జూపల్లి కృష్ణారావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులు, అధికారులతో కలిసి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# బిఎస్‌పిలో చేరిన జిల్లా టీపీసీసీ ఎస్సీ సెల్ కన్వీనర్ వల్లమల్ల ప్రవీణ్ కుమార్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మేడ్చల్ మల్కాజ్గిరి/పోచారం, జనవరి 16: మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. జిల్లా టీపీసీసీ ఎస్సీ సెల్ కన్వీనర్ వల్ల మల్ల ప్రవీణ్ కుమార్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి, బహుజన సమాజ్ వాది (బిఎస్‌పి) పార్టీలో చేరారు. శుక్రవారం షాద్‌నగర్‌లో బీఎస్పీ అధినేత్రి మాయావతి జన్మదిన వేడుకల సందర్భంగా నిర్వహించిన భారీ బహిరంగ సభలో, సుమారు 6వేల మంది అనుచరులతో భారీ ర్యాలీగా తరలివెళ్లి బి.ఎస్.పి.తీర్థం పుచ్చుకున్నారు. తెలంగాణ రాష్ట్ర బీఎస్పీ అధ్యక్షుడు ఇబ్రహీం శేఖర్ ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వల్లమల్ల ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీలో బడుగు, బలహీన వర్గాలకు సరైన గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేసినా, చివరకు కుల వివక్షతో తక్కువ చేసి చూస్తున్నారని మండిపడ్డారు. తన గోడును హైకమాండ్ దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోకపోవడంతోనే మనస్తాపం చెంది పార్టీని వీడినట్లు స్పష్టం చేశారు. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మాయావతి ఆశయాలకు అనుగుణంగా, అణగారిన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా బీఎస్పీలో కొనసాగుతానని, బలహీన వర్గాలను ఆదరించే నిజమైన పార్టీ బీఎస్పీ మాత్రమేనని నమ్మి ఈ నిర్ణయం తీసుకున్నాని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోచారం మున్సిపాలిటీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజాలక్ష్యం
సంపాదకీయం

# రాష్ట్రాల పురోగతి లక్ష్యంగా బడ్జెట్ కేటాయింపులు !

మరో పక్షం రోజుల్లో కేంద్ర బడ్జెట్ ప్రకటించనున్నారు. ఆర్థికమంత్రి నిర్మలా సీతరామన్ మరోమారు బడ్జెట్ కసరత్తులో బిజీగా ఉన్నారు. ఇటీవల ఆయా రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో చర్చించారు. ఆయా రాష్ట్రాల మంత్రులు వారివారి రాష్ట్రాల్లో ఉన్న అవసరాలను, నిధుల కేటాయింపులపై వినతిపత్రాలు సమర్పించారు. తెలుగు రాష్ట్రాల నుంచి భట్టి విక్రమార్క, పయ్యావుల కేశవుఉల హాజరై తమ అసవరాలను, ఆకాంక్షలను వెల్లడంచారు. అయితే ఏటా కేటాయింపులు చేస్తున్నా..ఇప్పటి వరకు ప్రకటించిన కేటాయింపులు, ఖర్చులపై స్పష్టత లేదు. ఏ పథకానికి ఎంత ఖర్చు చేశారో తెలియదు. అలాగే అన్ని రాష్ట్రాలను సమానంగా చూస్తూ కేటాయింపులు ఉండాలి. బడ్జెట్ అంటే అభివృద్ధి దివఘా చర్యలు ఉండాలి. అనుకూల రాష్ట్రాలకు ఒక రకంగా, తమ పార్టీ పాలనలో లేని రాష్ట్రాలను మరో రకంగా చూసే విధానాలకు పాతరేయాలి. బడ్జెట్ అందరికి సమాన హక్కుగా ఉండాలి. అది దేశ ప్రగతిని ప్రతిఫలించాలి. తమకు మద్దు ఇస్తున్న పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు ఒక రకంగా, మిగతా రాష్ట్రాలను మరో రకంగా చూసు విధానం సరికాదు. మరికొద్ది రోజుల్లో పార్లమెంటు బ్జడెట్ సమావేశాలు జరగనుండగా, దానికి సన్నాహంగా ఇటీవల నిర్వహించిన ప్రీ బడ్జెట్ సమావేశంలో రాష్ట్రాల ఈ దైన్య స్థితి స్పష్టంగా వెలుగులోకి వచ్చింది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కేంద్రంలో ఎన్‌డిఎ కూటమికి చెందిన పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలు సైతం నిధుల కోసం గళం విప్పాల్సి రావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. తమ తమ రాష్టాల్లో నెలకొన్న దుర్బర పరిస్థితులను వివరిస్తూ అదనపు నిధులు కావాలని, జిఎస్‌టి పరిహారం కొనసాగించాలని సమావేశంలోనే ఆ రాష్ట్ర ప్రభుత్వాలూ విజ్ఞప్తులు చేశాయి. పన్నుల వసూళ్లలో రాష్ట్రాల వాటా తగ్గిస్తూ, గ్రాంట్లు ఆలస్యం చేస్తూ, అప్పుల పరిమితులను కట్టడి చేస్తూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరే రాష్ట్రాల ఈ దుస్థితికి కారణం. సిపిఎం నేతృత్వంలో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం అధికారంలో ఉన్న కేరళ రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం మరింత కక్ష పూరితంగా వ్యవహరిస్తోంది. ఆర్థికంగా దిగ్బంధించడం ద్వారా వామపక్ష ప్రజాతంత్ర సంఘటన ప్రభుత్వ ప్రతిష్టను ప్రజల్లో దిగజార్చే కుటిల వ్యూహానికి బిజెపి తెగబడుతోంది. ఇలా దాదాపు లక్ష కోట్ల రూపాయల మేర ఆ రాష్ట్రానికి రావాల్సిన నిధులను కేంద్రం మంజూరు చేయడానికి నిరాకరిస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. గత ఐదేళ్లలోనే 57వేల కోట్ల రూపాయలకు కోత పెట్టింది. పన్నుల వాటాను 3.89 శాతం నుండి 1.92 శాతానికి తగ్గించింది. ఈ చర్య వల్ల 2024-25 ఆర్థిక సంవత్సరంలోనే కేరళ ప్రజలు 27 వేల కోట్ల రూపాయలు నష్టపోయారు. జిఎస్‌టి సంస్కరణల ద్వారా మనో 9వేల కోట్లను ఆ రాష్ట్రం కోల్పోయింది. త్వరలో ఎన్నికలు జరగనున్న ఈ రాష్ట్రంలో ఈ తరహా రాజకీయ కక్ష సాధింపు చర్యలు పతాకస్థాయికి చేరడంతో కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ సత్యాగ్రహం చేయాల్సి వచ్చింది. ఇకపోతే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ ఆర్థిక దిగ్బంధనంపై కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ పెదవి విప్పక పోవడం పచ్చి అవకాశవాద రాజకీయం తప్ప మరోటి కాదు. ఏమైనప్పటికీ ఈ తరహా ఏకపక్ష విధానాలను నరేంద్రమోడీ ప్రభుత్వం ఇప్పటికైనా విడనాడాలి. రాజ్యాంగ బద్ధమైన రాష్ట్రాల హక్కులను గౌరవించాలి. లేని పక్షంలో ఈ తరహా ఆందోళనలు మరిన్ని రాష్ట్రాల్లో చోటుచేసుకునే అవకాశం ఉంది. బలమైన రాష్ట్రాలే కేంద్రాన్ని బలంగా నిలబెడతాయి. స్థిరమైన ఆర్థిక వనరులతోనే బలంగా నిలుస్తాయి. సమాఖ్య వ్యవస్థ పురోగతికి అత్యంత కీలకమైన ఈ అంశం పైనే నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర బిజెపి ప్రభుత్వం దాడి చేస్తోంది. ఆర్థిక హక్కులను క్రమేణా హరిస్తోంది. ఫలితంగా రాష్ట్రాలు ప్రతి చిన్న అవసరానికి కేంద్రం దయా దాక్షిణ్యాలపై ఆదారపడాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.ప్రీ బడ్జెట్ సమావేశంలో రాష్ట్రం తరపున పాల్గొన్న తెలంగాణ ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క అనేక విషయాలను నిర్మలా సీతారామన్ ముందుంచారు. ఫ్యూచర్ సిటీ, నవోదయలు, మూసీ సుందరీకరణ, రోడ్ల విస్తరణ, ఎస్సీఆరెస్పీకి జాతీయ హోదా, ట్రిపుల్ ఆర్ వంటి అనేక అంశాలను, నిధుల కేటాయింపులను ప్రస్తావించారు. వీటికి కేంద్రం బ్డజెట్‌లో ఏ రకమైన స్పందన చూపిస్తుందో చూడాలి. అలాగే ఎపికి చెందిన మంత్రి పయ్యావుల కేశవ్ కూడా కోరికల చిట్టా విప్పారు. రాష్ట్ర రాజధాని అమరావతి నగర నిర్మాణ పనులకు సాయాన్ని కొనసాగించాలని ఆయన కోరారు. విభజన హామీల్లో భాగమైన పోలవరం ప్రాజెక్టుకు పూర్తి నిధులు ఇవ్వాలని, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే విశాఖపట్నం, రాయలసీమ ప్రాంతాల మౌలిక సదుపాయాల కోసం అదనపు కేటాయింపులు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు.రాష్ట్ర ప్రభుత్వం ఈ కోరికలు కోరడం ఇదే మొదటి సారికాదు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఢిల్లీ పర్యటనకు వెళ్లిన ప్రతిసారీ దాదాపుగా ఇవే అంశాలను ప్రధాన మంత్రి నుండి మంత్రుల వరకు వ్యక్తిగతంగా కలిసి ఈ మేరకు విజ్ఞప్తులు చేస్తూనే ఉన్నారు. ఢిల్లీలో ఉన్న రాష్ట్ర ఎంపీలు, పర్యటనలకు వెళ్లే మంత్రులూ ఇదే పనిమీద ఉంటున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయినా, కేంద్రం నుండి నిధులు రావడం లేదు. మన రాష్ట్రమే కాదు, ఎన్‌డిఎలో మరో భాగస్వామిగాఉన్న బీహార్ ప్రభుత్వం నుండి కూడా ఇటువంటి విజ్ఞప్తులే అందాయి. పలు బిజెపి పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు కూడా జిఎస్‌టి నష్టపరిహారం, గ్రాంట్ల పెంపు, ప్రత్యేక ప్యాకేజీల కోసం కేంద్రాన్ని కోరినట్లు వార్తలు వచ్చాయి. నిధుల కేటాయింపుల్లో సమతుల్యత పాటించాలి. విభేదాలు పక్కన పెట్టాలి. అప్పుడే కేంద్ర, రాష్ట్రాల మధ్య సయోధ్య సాధ్యం అవుతుంది.

## స్థానిక ప్రజాస్వామ్య పరీక్ష మున్సిపల్ ఎన్నికల్లో రిజర్వేషన్ల పాత్ర

# కుర్చీల కేటాయింపుతో కదిలిన రాజకీయాలు



రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

పట్టణ రాజకీయాల్లో కీలక మలుపుగా నిలిచే మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ మరో నిర్ణాయక దశను దాటింది. ఓటరు జాబితా తుదిరూపు దాల్చిన తర్వాత తాజాగా మున్సిపల్ శాఖ రిజర్వేషన్లను పూర్తిగా ఖరారు చేయడంతో రాష్ట్రవ్యాప్తంగా పట్టణ స్థానిక సంస్థలు ఎన్నికల వాతావరణం లోకి ప్రవేశించాయి. రాష్ట్రంలో ఉన్న 131 పట్టణ స్థానిక సంస్థలు10 మున్సిపల్ కార్పొరేషన్లు, 121 మున్సిపాలిటీలు అన్నింటికీ మేయర్, చైర్పర్సన్, కార్పొరేటర్, కౌన్సిలర్ స్థాయిల్లో రిజర్వేషన్లు ఖరారయ్యాయి. ఈ నిర్ణయాలు కేవలం ఎన్నికల నిర్వహణకు సంబంధించిన పరిపాలనా ప్రక్రియగానే కాకుండా, రాబోయే రాజకీయ సమీకరణలకు దిశానిర్దేశం చేసే అంశంగా మారాయి. ముఖ్యంగా బీసీలకు 31 శాతం రిజర్వేషన్ అమలు, మహిళలకు పెద్ద ఎత్తున చైర్పర్సన్, మేయర్ స్థానాల కేటాయింపు, 'డెడికేటెడ్ కమిషన్ల నివేదిక ఆధారంగా సంఖ్యల నిర్ణయం ఈ మూడు అంశాలు ఈ ఎన్నికలను అత్యంత ప్రాధాన్యత కలిగినవిగా మార్చాయి.

మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో గత అనుభవాలను పరిశీలిస్తే, రిజర్వేషన్ల అంశమే అత్యంత వివాదాస్పదంగా మారిన సందర్భాలు అనేకం. ముఖ్యంగా బీసీ రిజర్వేషన్లపై న్యాయస్థానాల జోక్యం కారణంగా గతంలో ఎన్నికలు వాయిదా పడిన పరిస్థితులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈసారి ప్రభుత్వం ప్రత్యేకంగా 'డెడికేటెడ్ కమిషన్ను ఏర్పాటు చేసి, జనాభా గణాంకాలు, సామాజిక- ఆర్థిక పరిస్థితులు, పట్టణ ప్రాంతాల్లో వర్గాల ప్రాతినిధ్యం వంటి అంశాలను శాస్త్రీయంగా అధ్యయనం చేయించింది. ఆ నివేదిక ఆధారంగా బీసీలకు 31 శాతం రిజర్వేషన్ ఖరారు చేయడం ద్వారా ప్రభుత్వం ఒకవైపు సామాజిక న్యాయాన్ని ప్రతిపాదిస్తూనే, మరోవైపు న్యాయపరమైన అడ్డంకులకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నట్టు స్పష్టమవుతోంది. పట్టణ ప్రాంతాల్లో బీసీల జనాభా గణనీయంగా ఉన్నప్పటికీ, రాజకీయ ప్రాతినిధ్యం తక్కువగా ఉందన్న విమర్శలు చాలా కాలంగా ఉన్నాయి. ఈ నిర్ణయం ఆ అసమతుల్యతను సరిచేసే దిశగా కీలక అడుగుగా భావించ బడుతోంది.

మహిళలకు ఇచ్చిన ప్రాధాన్యత కూడా ఈ ఎన్నికల ప్రత్యేకతగా నిలుస్తోంది. మొత్తం మున్సిపాలిటీల్లో 60 చైర్పర్సన్ స్థానాలు, కార్పొరేషన్లలో 5 మేయర్ స్థానాలు మహిళలకు కేటాయించ బడటం పట్టణ పాలనలో మహిళా నాయకత్వాన్ని బలోపేతం చేసే ప్రయత్నంగా చూడాలి. ఇప్పటికే గ్రామీణ స్థాయిలో పంచాయతీ రాజ్ వ్యవస్థలో మహిళా రిజర్వేషన్లు విస్తృత ప్రభావం చూపిన నేపథ్యం ఉంది. అదే తరహాలో పట్టణ ప్రాంతాల్లోనూ మహిళా ప్రాతినిధ్యం పెరగడం వల్ల పాలనలో కొత్త దృక్పథం, ప్రజా సంబంధాలపై ఎక్కువ శ్రద్ధ, సామాజిక సమస్యల పట్ల సున్నితత్వం పెరుగుతుందన్న అంచనాలు ఉన్నాయి. అయితే, మరోవైపు కుటుంబ రాజకీయాలు, ప్రత్యక్షంగా కాకుండా పరోక్షంగా అధికారాన్ని వినియోగించే పరిస్థితులు కొనసాగుతాయన్న విమర్శలూ వినిపిస్తున్నాయి. అయినప్పటికీ, దీర్ఘకాలికంగా చూస్తే మహిళల రాజకీయ భాగస్వామ్యం పెరగడం ప్రజాస్వామ్యానికి మేలు చేస్తుందన్న వాదనకు ఈ నిర్ణయాలు బలాన్ని చేకూరుస్తున్నాయి.

జీహెచ్ఎంసీ సహా అన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు రిజర్వేషన్లు ఫైనల్ కావడం వల్ల ఇప్పుడు రాజకీయ దృష్టి పూర్తిగా అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహాలపైకి మళ్లింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు ఎప్పుడూ రాష్ట్ర రాజకీయాలకు దిక్సూచిగా భావించ బడతాయి. హైదరాబాద్ నగరం రాష్ట్ర ఆర్థిక, రాజకీయ, సామాజిక కేంద్రంగా ఉండటం వల్ల ఇక్కడి ఫలితాలు మిగతా ప్రాంతాలపై ప్రభావం చూపుతాయి. గత ఎన్నికల్లో జీహెచ్ఎంసీ ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో పెద్ద చర్చకు దారితీశాయి. ఈసారి కూడా అదే స్థాయిలో ఆసక్తి నెలకొంది. గ్రేటర్ వరంగల్, ఖమ్మం, సిద్దిపేట వంటి కార్పొరేషన్ల లోనూ పట్టణ మధ్యతరగతి, ఉద్యోగ వర్గాలు, యువత ఓటింగ్ తీరు కీలకంగా మారనుంది.

ప్రభుత్వం ఆరు గెజిట్ నోటిఫికేషన్లు విడుదల చేసి రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించడం ద్వారా ఎన్నికల నిర్వహణపై తన సంకల్పాన్ని స్పష్టంగా చాటింది. వార్డుల వారీగా రిజర్వేషన్ల వివరాలు కలెక్టర్లకు, మున్సిపల్ అధికారులకు పంపించడంతో క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు వేగవంత మయ్యాయి. కేబినెట్ భేటీ అనంతరం ఎవరికీ ఏ స్థానం అన్న స్పష్టత రావడంతో ఆశావహుల్లో కదలిక మొదలైంది. ఒకే పార్టీ టికెట్ కోసం పలువురు పోటీ పడుతున్న పరిస్థితి అనేక చోట్ల కనిపిస్తోంది. ముఖ్యంగా బీసీ, మహిళా రిజర్వేషన్ వచ్చిన స్థానాల్లో పోటీ తీవ్రంగా మారే సూచనలు ఉన్నాయి. ఇది పార్టీలకు అంతర్గత అసంతృప్తులను ఎదుర్కొనే పరిస్థితిని కూడా తెచ్చిపెట్టవచ్చు.

ప్రభుత్వ వ్యూహాన్ని గమనిస్తే, ఈ ఎన్నికలను ఒక రకంగా ప్రజాభిప్రాయ సేకరణగా మలచు కోవాలన్న ఆలోచన స్పష్టంగా కనిపిస్తోంది. పట్టణ అభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలను ప్రధానంగా ప్రచారంలోకి తెచ్చే ప్రయత్నం జరుగుతోంది. బీసీ రిజర్వేషన్ ద్వారా సామాజిక న్యాయాన్ని, మహిళా రిజర్వేషన్ల ద్వారా ప్రగతిశీల పాలనను ప్రతిబింబించేలా ప్రభుత్వం తన వాదనను నిర్మిస్తోంది. పట్టణ ప్రాంతాల్లో అమలు చేసిన అభివృద్ధి పనులు, రహదారులు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, పారిశుధ్య కార్యక్రమాలు ఓటర్లను ఎంతవరకు ఆకర్షిస్తాయన్నది ఫలితాల్లో తేలనుంది.

మరో వైపు ప్రతిపక్షాలు ఈ ఎన్నికలను ప్రభుత్వంపై అసంతృప్తిని వ్యక్తం చేసే అవకాశంగా చూస్తున్నాయి. పట్టణాల్లో పెరిగిన జీవన వ్యయం, ఇంధన ధరలు, ఆస్తి పన్నులు, ట్రాఫిక్ సమస్యలు, నిరుద్యోగం వంటి అంశాలను ప్రతిపక్షాలు ప్రధాన అస్త్రాలుగా చేసుకోవాలని భావిస్తున్నాయి. రిజర్వేషన్ల ప్రక్రియలో కొన్ని చోట్ల అసమతుల్యత ఉందన్న ఆరోపణలు, వార్డు పునర్విభజనలో రాజకీయ లాభనష్టాల కోణం ఉందన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా మధ్యతరగతి ఓటర్లు అభివృద్ధి, పారదర్శకత, స్థానిక సమస్యల పరిష్కారాన్ని ప్రాధాన్యంగా చూస్తారని ప్రతిపక్షాలు అంచనా వేస్తున్నాయి.



గణాంకాల పరంగా చూస్తే, 121 మున్సిపాలిటీల్లో బీసీలకు 31 శాతం రిజర్వేషన్ అమలవడం వల్ల వేలాది మంది కొత్త నాయకులు రాజకీయ రంగ ప్రవేశం చేసే అవకాశం ఏర్పడింది. ఎస్సీ, ఎస్టీ, మహిళా రిజర్వేషన్లతో కలిపి మొత్తం పట్టణ స్థానిక సంస్థల పాలనలో విస్తృత సామాజిక ప్రాతినిధ్యం కనిపించనుంది. ఇది స్థానిక సమస్యల పరిష్కారంలో విభిన్న వర్గాల స్వరాలు వినిపించే అవకాశాన్ని పెంచుతుంది. అయితే, అదే సమయంలో అనుభవం లేని నాయకత్వం వల్ల పరిపాలనా సామర్థ్యం తగ్గుతుందన్న ఆందోళనలూ వ్యక్తమవుతున్నాయి. దీనికి సమాధానం ఎన్నికల అనంతరం పాలనలోనే తేలనుంది.

వచ్చే నెల రెండో వారంలోపే ఎన్నికలు పూర్తి చేయాలన్న లక్ష్యంతో షెడ్యూల్ ఖరారు కావడంతో ప్రచారం మరింత ఉధృతం కానుంది. తక్కువ సమయంలో ఓటర్లను చేరుకోవడానికి పార్టీలన్నీ సామాజిక మాధ్యమాలు, డిజిటల్ ప్రచారం, వార్డు స్థాయి సమావేశాలపై ఎక్కువగా ఆధారపడ నున్నాయి. యువత ఓటింగ్ శాతం పెరిగే అవకాశముండటంతో వారి సమస్యలు, ఆశలు కూడా ప్రచారంలో ప్రధాన అంశాలుగా మారతాయి. పట్టణ ఓటర్లు కేవలం పార్టీ అనుబంధంతో కాకుండా, అభ్యర్థి వ్యక్తిత్వం, స్థానిక సమస్యలపై అవగాహన, అందుబాటులో ఉండే స్వభావం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకునే పరిస్థితి పెరుగుతోంది.

మొత్తంగా మున్సిపల్ ఎన్నికల్లో రిజర్వేషన్ల ఖరారు రాష్ట్ర రాజకీయాల్లో ఒక కీలక మైలురాయిగా నిలిచింది. ఇది సామాజిక న్యాయం, మహిళా సాధికారత, పట్టణ పాలనలో సమగ్రత అనే మూడు మూల స్తంభాలపై ఆధారపడి ముందుకు సాగుతున్న ప్రక్రియగా చూడాలి. ఈ ఎన్నికల ఫలితాలు కేవలం మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పాలనకే పరిమితం కాకుండా, రాబోయే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలపై కూడా ప్రభావం చూపే సూచనలు ఉన్నాయి. పట్టణ ఓటర్లు ఇచ్చే తీర్పు రాష్ట్ర రాజకీయ దిశను ఎంతవరకు మార్చగలదన్నది త్వరలో తేలనుంది. ప్రజాస్వామ్యంలో స్థానిక సంస్థలే పునాది అన్న భావనను మరోసారి గుర్తుచేస్తూ, ఈ మున్సిపల్ ఎన్నికలు ఒక కీలక అధ్యాయంగా చరిత్రలో నమోదు కానున్నాయి.

**వ్యాసకర్త : సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్.**

# పరిపాలనా సంస్కరణా, రాజకీయ వ్యూహమా?

## జీహెచ్ఎంసీ పునర్విభజనపై భిన్న స్వరాలు, విస్తృత చర్చలు

హైదరాబాద్ నగరం భారతదేశ పట్టణ వికాస చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. రాజ్యాంగానంతర కాలంలో ఒక ప్రాంతీయ రాజధానిగా ప్రారంభమైన ఈ నగరం, కాలక్రమేణా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన మెట్రోపాలిటన్ నగరంగా రూపాంతరం చెందింది. జనాభా విస్తరణ, వలసల పెరుగుదల, సమాచార సాంకేతిక రంగ విప్లవం, రియల్ ఎస్టేట్ అభివృద్ధి వంటి అంశాలు హైదరాబాద్ రూపురేఖలను పూర్తిగా మార్చేశాయి. ఈ విస్తరణతో పాటు నగర పాలన ఎదుర్కొంటున్న సవాళ్లు కూడా తీవ్రమయ్యాయి. ఈ నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పునర్విభజన లేదా డీలిమిటేషన్ అంశం కేవలం పరిపాలనా చర్యగా కాకుండా, ప్రజాస్వామ్య వ్యవస్థ నాణ్యతను నిర్ణయించే కీలక అంశంగా మారింది.

హైదరాబాద్ మున్సిపల్ పాలన చరిత్రను పరిశీలిస్తే, 1955లో మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ హైదరాబాద్‌గా ఏర్పడినప్పటి నుంచి నగరం అనేక దశల్లో విస్తరించింది. అప్పట్లో నగర విస్తీర్ణం సుమారు 175 చదరపు కిలోమీటర్లు కాగా, జనాభా 12 నుంచి 15 లక్షల మధ్యే ఉండేది. పరిమిత పరిధిలో పరిపాలన సాగిన ఆ దశలో ప్రజా ప్రతినిధులకు, అధికారులకు నగర సమస్యలపై పట్టు ఉండేది. కానీ 1990ల తరువాత హైదరాబాద్ ఐటీ హబ్‌గా ఎదగడం ప్రారంభమైనప్పటి నుంచి నగర ముఖచిత్రం వేగంగా మారింది. హైటెక్ సిటీ, గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్ వంటి ప్రాంతాలు ప్రపంచ స్థాయి కార్పొరేట్ కేంద్రాలుగా అభివృద్ధి చెందాయి.

ఈ వేగవంతమైన విస్తరణకు పరిపాలనా రూపం కల్పించాల్సిన అవసరంతో 2007లో అప్పటి ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను చుట్టుపక్కల ఉన్న 12 మున్సిపాలిటీలు, 8 గ్రామ పంచాయతీలతో విలీనం చేసి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేసింది. ఈ విలీనంతో నగర విస్తీర్ణం సుమారు 650 చదరపు కిలోమీటర్లకు పెరిగింది. అప్పటి అంచనాల ప్రకారం జనాభా 75 లక్షలకు పైగా చేరింది. పట్టణ ప్రణాళికను సమగ్రంగా అమలు చేయడం, మౌలిక వసతుల అభివృద్ధిని ఒకే పాలనా పరిధిలో సమన్వయం చేయడం ఈ విలీనానికి ప్రధాన ఉద్దేశంగా ప్రకటించారు.

అయితే, విస్తీర్ణం పెరిగిన కొద్దీ పరిపాలనా అసమానతలు కూడా స్పష్టమయ్యాయి. కొన్ని ప్రాంతాలు అత్యంత వేగంగా అభివృద్ధి చెందగా, మరికొన్ని ప్రాంతాలు మౌలిక వసతుల కొరతతోనే కొనసాగాయి. ఈ నేపథ్యంలో 2016లో జీహెచ్ఎంసీలో మరోసారి డీలిమిటేషన్ చేపట్టి, అప్పటివరకు ఉన్న 72 డివిజన్లను 150 వార్డులుగా విభజించారు. ఒక్కో వార్డుకు సగటున 40 నుంచి 50 వేల జనాభా ఉండేలా ప్రణాళిక రూపొందించారు. ఆ సమయంలో ఈ నిర్ణయం పరిపాలనా సమర్థతకు దోహదపడుతుందని భావించారు.

కానీ గణాంకాలు చెబుతున్న వాస్తవం మరోలా ఉంది. 2011 జనగణన ప్రకారం గ్రేటర్ హైదరాబాద్ జనాభా సుమారు 77 లక్షలు. అయితే పట్టణాభివృద్ధి శాఖ, నగర ప్రణాళిక సంస్థల తాజా అంచనాల ప్రకారం 2024-25 నాటికి ఈ సంఖ్య కోటిన్నరకు చేరింది. కొన్ని అంచనాల ప్రకారం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రోజుకు సగటున 800 నుంచి 1000 మంది వలస దారులు స్థిరపడు తున్నారు. ఐటీ, నిర్మాణ రంగాల్లో ఉద్యోగావకాశాలే ఇందుకు ప్రధాన కారణం. ఈ వలసల ప్రభావంతో కొన్ని వార్డుల్లో జనాభా లక్ష నుంచి లక్షన్నర దాటింది. జనసాంద్రత చదరపు కిలోమీటరుకు 30 వేల నుంచి 35 వేల వరకు ఉన్న ప్రాంతాలు కూడా ఉన్నాయి.

ఈ పరిస్థితుల్లో 2016 డీలిమిటేషన్ లక్ష్యాలు చాలావరకు నిర్వీర్య మయ్యాయి. ఒక్కో కార్పొరేటర్ పరిధిలో జనాభా విపరీతంగా పెరగడంతో ప్రజా సమస్యలపై సమర్థవంతమైన పర్యవేక్షణ కష్టమైంది. పారిశుధ్యం, డ్రైనేజీ, తాగునీరు, రహదారులు, వీధి దీపాలు వంటి మౌలిక అంశాలపై ఫిర్యాదులు పెరిగినా, వాటిని సమయానికి పరిష్కరించే సామర్థ్యం పరిమితమైంది. ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధి ప్రజలకు అందుబాటులో ఉండాలన్న మౌలిక సూత్రమే ప్రశ్నార్థకంగా మారింది.

ఈ నేపథ్యంలోనే జీహెచ్ఎంసీ పునర్విభజన లేదా తాజా డీలిమిటేషన్ అవసరం తెరపైకి వచ్చింది. డీలిమిటేషన్ అంటే కేవలం వార్డుల సంఖ్య పెంచడం కాదు. జనాభా సమతుల్యత, భౌగోళిక సౌలభ్యం, సామాజిక అనుసంధానం, రహదారి నెట్‌వర్క్, సహజ హద్దులు వంటి అంశాల ఆధారంగా పరిపాలనా సరిహద్దులను పునః రూపకల్పన చేయడం. దీని ప్రధాన ఉద్దేశం ప్రజలకు పాలనను మరింత దగ్గర చేయడం.

డీలిమిటేషన్ ప్రయోజనాలు అనేకం. చిన్న వార్డులు ఏర్పడితే ప్రజా ప్రతినిధికి తన పరిధిలోని సమస్యలపై స్పష్టమైన అవగాహన ఉంటుంది. ప్రజలు తమ సమస్యలను నేరుగా చెప్పగలుగుతారు. అధికార యంత్రాంగానికి కూడా పనిభారం సమంగా పంచబడుతుంది. వార్డు స్థాయి కమిటీలు సమర్థంగా పనిచేసే అవకాశం ఉంటుంది. బడ్జెట్ కేటాయింపులు కూడా అవసరాల ఆధారంగా సముచితంగా జరిగే వీలుంటుంది. ముఖ్యంగా పట్టణ పేదలు నివసించే ప్రాంతాల్లో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టే అవకాశం పెరుగుతుంది. అయితే డీలిమిటేషన్‌కు లోపాలు కూడా ఉన్నాయి. హద్దుల పునర్విభజన రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా జరిగితే ప్రజాస్వామ్య స్ఫూర్తి దెబ్బతింటుంది. కొన్ని కాలనీలు సామాజికంగా ఒకటిగా ఉన్నప్పటికీ వేర్వేరు వార్డుల్లోకి చీలిపోవడం వల్ల సమస్యలు తలెత్తుతాయి. ప్రజలకు తమ కార్పొరేటర్ ఎవరో తెలియని పరిస్థితి కూడా ఏర్పడుతుంది. అదనంగా, కొత్త వార్డుల ఏర్పాటుతో పరిపాలనా వ్యయాలు పెరుగుతాయి. సిబ్బంది నియామకాలు, కార్యాలయాలు, మౌలిక వసతుల ఏర్పాటు కోసం అదనపు ఖర్చు అవసరం అవుతుంది.

ఈ అంశంపై రాజకీయ పార్టీల అభిప్రాయాలు భిన్నంగా ఉన్నాయి. అధికార పార్టీల నేతలు డీలిమిటేషన్‌ను పరిపాలనా అవసరంగా చిత్రీకరిస్తూ, నగర అభివృద్ధికి ఇది తప్పనిసరి అంటున్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పరిపాలనా యూనిట్లు మారాల్సిందేనని వారు వాదిస్తున్నారు. మరోవైపు ప్రతిపక్ష పార్టీలు డీలిమిటేషన్ వెనుక రాజకీయ లెక్కలున్నాయంటూ ఆరోపిస్తున్నాయి. వార్డుల హద్దుల మార్పుతో ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయాలన్న ప్రయత్నమే దీనికి కారణమని వారు విమర్శిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో తమ బలాన్ని తగ్గించేలా హద్దులు మార్చుతున్నారన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది.

నగరానికి చెందిన కొంతమంది సీనియర్ రాజకీయ నేతలు మాత్రం డీలిమిటేషన్ అవసరమేనని అంగీకరిస్తూనే, దాన్ని పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలని సూచిస్తున్నారు. జనాభా గణాంకాలు, భౌగోళిక అంశాలు, ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా జరిగే పునర్విభజన నగర పాలనను మరింత గందరగోళానికి గురి చేస్తుందని వారు హెచ్చరిస్తున్నారు. ప్రజలతో సంప్రదింపులు, అభ్యంతరాల స్వీకరణ, నిపుణుల సూచనలు వంటి ప్రక్రియలు లేకుండా డీలిమిటేషన్ చేస్తే న్యాయపరమైన వివాదాలు తప్పవని అభిప్రాయ పడుతున్నారు.

జీహెచ్ఎంసీ పునర్విభజన అంశాన్ని విస్తృతంగా పరిశీలిస్తే, ఇది కేవలం స్థానిక సంస్థల ఎన్నికల వరకే పరిమితం కాదని స్పష్టమవుతుంది. నగర ప్రణాళిక, మౌలిక వసతుల అభివృద్ధి, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య బలోపేతం వంటి అంశాలతో ఇది ముడిపడి ఉంది. ప్రపంచంలోని ఇతర మెట్రో నగరాల అనుభవాలు చూస్తే, పరిపాలనా యూనిట్లను కాలానుగుణంగా సవరించుకుంటూ వెళ్లిన నగరాలే స్థిరమైన అభివృద్ధిని సాధించాయి.

హైదరాబాద్ లాంటి వేగంగా విస్తరిస్తున్న నగరానికి డీలిమిటేషన్ ఒక అవసరం. కానీ అది ప్రజా హితం కేంద్రంగా, పారదర్శకంగా, శాస్త్రీయంగా జరగాలి. కేవలం సంఖ్యల మార్పుతో కాకుండా, డిజిటల్ గవర్నెన్స్, జియో-మ్యాపింగ్ ఆధారిత సేవలు, ప్రజల భాగస్వామ్యం వంటి సంస్కరణలతో అనుసంధానించి నప్పుడే పునర్విభజనకు అర్థం ఉంటుంది. లేకపోతే, హద్దులు మారినా సమస్యలు అదే స్థాయిలో కొనసాగుతాయి.

మొత్తంగా చెప్పాలంటే, జీహెచ్ఎంసీ పునర్విభజన హైదరాబాద్ నగర భవిష్యత్తును నిర్దేశించే కీలక మలుపు. ఇది పరిపాలనా సమర్థతకు దోహద పడాలంటే రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా, ప్రజాస్వామ్య విలువలకు అనుగుణంగా అమలు కావాలి. పెరుగుతున్న జనాభా, విస్తరిస్తున్న నగరానికి తగిన పరిపాలనా రూపాన్ని ఇవ్వడమే ఈ ప్రక్రియ యొక్క నిజమైన లక్ష్యంగా ఉండాలి. అప్పుడు మాత్రమే జీహెచ్ఎంసీ డీలిమిటేషన్ నగరాభివృద్ధికి బలమైన పునాది అవుతుంది.


**రామ కిష్టయ్య సంగన భట్ల, 9440595494,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్.**

# "మున్నేరు జల దోపిడి ఆపాలి"



విశ్వ జంపాల
7793968907

అత్యంత కీలకమైన మున్నేరు పరీవాహక ప్రాంత రైతాంగ ప్రయోజనాలను ప్రక్కన బెట్టి, 5వ షెడ్యూల్ ప్రాంతాల హక్కులు, పెసా (PESA) చట్టం ఉల్లంఘిస్తూ 10 టీఎంసీల మున్నేరు జలాలను "మున్నేరు-పాలేరు లింక్ కెనాలు ద్వారా రెండు పంటలు పుష్కలంగా పండుతూ నాగార్జున సాగర్ ఆయకట్టుగా వున్న పాలేరు చెరువుకు తరలించడం అన్యాయం, అక్రమం. మున్నేరు నీరు ఆ ప్రాంత ప్రజల జీవనాధారం. చట్టబద్ధమైన హక్కులను కాలరాస్తూ ప్రాజెక్టులు చేపడితే అది రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుంది. మహబూబాబాద్ జిల్లా, గార్ల మండలం నుండి ప్రవహిస్తూన్న మున్నేరుపై దుబ్బగూడెం-మద్దివంచ గ్రామాల మధ్య ఉన్న చెక్ డ్యామ్ నుండి మున్నేరు-పాలేరు లింక్ కెనాల్ (గ్రావిటీ కాలువ) ప్రారంభించబడి గార్ల మండలంలోని బుద్ధారం సమీపంలో సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కాల్వకు అనుసంధానం చేయడం ద్వారా పాలేరు చెరువుకు 10 టీఎంసీల నీటిని తరలించనున్నారు. మే 17, 2025న మున్నేరు-పాలేరు లింక్ కెనాల్ నిర్మాణానికి 162.54 కోట్ల రూపాయల నిధులు మంజూరి చేస్తూ జీవో నెంబర్ 98ని ఖమ్మం జిల్లా మంత్రుల ప్రమేయంతో కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసింది. మున్నేరు-పాలేరు లింకు కెనాల్ నిర్మాణం కోసం గార్ల మండలంలో 9.5 కిలోమీటర్ల పొడవున భారీ కాలువ తవనున్నారు. ఈ కాలువ క్రింద చిన్న సన్న కారు పెద గిరిజ రైతులు 350 ఎకరాల వ్యవసాయ సాగు భూములను కోల్పోనున్నారు. ఒక చుక్క నీరు కూడా మున్నేరు పరివాహక ప్రాంత రైతాంగానికి ఇవ్వడం లేదు. ఇల్లందు, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం నియోజిక వర్గాలలో 60 వేల ఎకరాలకు సాగు నీరు, ప్రజలకు త్రాగునీరు అందించాల్సిన మున్నేరు పప్రాజెక్ట్ ను 60 సంవత్సరాలుగా ప్రభుత్వాలు చారిత్రక నిర్లక్ష్యం చేస్తూన్నాయి. వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం మున్నేరు ప్రాజెక్టు నిర్మాణానికి 131.67 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేస్తూ తేది 24.06.2009న జీవో నెంబర్ 1076 ను విడుదల చేసింది, కానీ మున్నేరు ప్రాజెక్ట్ నిర్మాణానికి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక మున్నేరు ప్రాజెక్టు ఆయకట్టు ప్రాంతాన్ని సీతారామ ప్రాజెక్ట్ ఆయకట్టులో కలుపుతూ కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. స్వార్ధ పూరిత రాజకీయ ప్రయోజనాలకు సీత రామ ప్రాజెక్ట్ బాలిపశువుగా మారి మున్నేరు ప్రాజెక్టు ఆయకట్టు ప్రాంతానికి సీతారామ జలాలు రాకుండా పోయాయి. సీత రామ ప్రాజెక్ట్ విషయంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం రీ డిజైన్ పేరుతో చేసిన తప్పిదాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం




సరిదిద్దాల్సి వుండగా అదే తప్పిదాన్నియాదాతథంగా కొనసాగించడం ప్రస్తుత ప్రభుత్వ నిర్లక్ష్యానికి, తెలితక్కువ తనానిన్ని తేటతెల్లం చేస్తుంది. మహబూబాబాద్ జిల్లా, గార్ల మండలంలో నిర్మించనున్న "మున్నేరు-పాలేరు లింక్ కెనాలు నిర్మాణ పనులకు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఖమ్మం జిల్లా పాలేరులో వర్చువల్ గా శంకుస్థాపన చేయనున్నట్లు తెలిసింది. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్, మున్నేరు ప్రాజెక్టు, "మున్నేరు - పాలేరు లింక్ కెనాలు, తదితర నీటి ప్రాజెక్ట్ ల విషయంలో ఆయా ప్రాంతాల నీటి అవసరాలను,చారిత్రక , భౌతిక, వాస్తవిక అంశాలను వెల్లడించకుండా ఖమ్మం జిల్లా మంత్రులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తప్పుదారి పట్టిస్తున్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు ఈ ప్రాజెక్ట్ ల పట్ల ఖమ్మం జిల్లా మంత్రుల వైఖరిని తీవ్రంగా పరిగణిస్తున్నారు.

### లింకు కెనాల్ ప్రధాన అభ్యంతరాలు

ఐదవ షెడ్యూల్ పరిధిలోకి వచ్చే గార్ల మండల ఏజెన్సీ ప్రాంతాల్లో గ్రామసభల (PESA) అనుమతి లేకుండా "మున్నేరు-పాలేరు లింక్ కెనాలు, నిర్మాణం చేపట్టడం రాజ్యాంగ విరుద్ధం. రాజ్యాంగ మరియు చట్టపరమైన ఉల్లంఘన క్రిందకు వస్తుంది. 5వ షెడ్యూల్ ప్రాంతాల్లోూజుూూ చట్టం ప్రకారం గ్రామసభల ముందస్తు అనుమతి తప్పనిసరి. దీనిని ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది

మున్నేరు పరివాహక ప్రాంత రైతాంగానికి సాగు, తాగునీరు అందించకుండా, 10 టీఎంసీల నీటిని తరలించడం సహజ న్యాయ సూత్రాలకు వ్యతిరేకం. స్థానిక హక్కుల నిరాకరణగా పరిగణించబడుతుంది.

9.5 కి.మీ "మున్నేరు - పాలేరు లింక్ కెనాలు నిర్మాణం వల్ల సుమారు 350 ఎకరాల సారవంతమైన గిరిజన రైతుల భూములు కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. లి పర్యావరణ మరియు సామాజిక ప్రభావం: 350 ఎకరాల సారవంతమైన గిరిజన భూములు కోల్పోవడంపై సరైన సామాజిక, పర్యావరణ ప్రభావ అంచనా (Social and Environmental Impact Assessment) జరగలేదు. భూమి కోల్పోవడమే గాక సాగు త్రాగు నీటి అవసరాలు తీర్చకపోవడం తీవ్ర అభ్యంతరకరం.

2009లో వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ఇచ్చిన జీవో1076 ఇప్పటికీ అమలుకు నోచుకోకపోవడం, మున్నేరు ప్రాజెక్టు కేవలం రాజకీయ వాగ్దానంగానే మిగిలిపోవడం, ఈ ప్రాంత ప్రజల పట్ల పాలకుల వివక్షకు అద్దం పడుతోంది. ఇది ప్రభుత్వాల చారిత్రక నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతుంది.

ఇప్పటికే నాగార్జున సాగర్, భక్త రామదాసు మరియు సీతారామ ప్రాజెక్టుల ద్వారా నీరు అందుతున్న పాలేరు చెరువుకు అదనంగా మున్నేరు నీటిని తరలించడం ప్రాంతీయ అసమానతలకు దారితీస్తుంది. ఈ విధంగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అసమాన నీటి పంపిణీకి అవకాశం కల్పిస్తుంది.

నీటి హక్కులు: అప్పర్ స్ట్రీమ్ (ఎగువ ప్రాంతం) ప్రజల అవసరాలు తీర్చకుండా లోయర్ స్ట్రీమ్ (దిగువ ప్రాంతం) కు నీటిని తరలించడం అంతర్-ప్రాంతీయ జల సూత్రాలకు విరుద్ధం.

### మున్నేరు ప్రాజెక్టు నిర్మాణమే ఆ ప్రాంత సుస్థిర అభివృద్ధికి ఏకైక మార్గం

ఇన్ని వ్యతిరేకతలు, అభ్యంతరాలు ఉన్నప్పటికి "మున్నేరు - పాలేరు లింక్ కెనాలు, నిర్మాణం చేపట్టడం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి మేలు కంటే కీడే ఎక్కువ చేస్తుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జనవరి 18న "మున్నేరు - పాలేరు లింక్ కెనాలు, శంకుస్థాపన చేయడానికి సిద్ధమవుతుండటం స్థానికులలో తీవ్ర ఆగ్రహాన్ని కలిగిస్తోంది. మున్నేరు నదిపై మున్నేరు ప్రాజెక్ట్ (మున్నేరు రిజర్వాయర్) కడితే గార్ల, బయ్యారం మండలాల్లోని వేల ఎకరాలకు నీరు అందుతుంది, కానీ ఆ పనులు పక్కన పెట్టి కేవలం తరలింపు కెనాల్‌పై దృష్టి పెట్టడం వెనుక ఉన్న రాజకీయ ప్రయోజనాలను ఎండగాడుతూ స్తానిక ప్రజలు తీవ్రంగా చర్చించుకుంటున్నారు. మున్నేరు పరీవాహక ప్రాంత ప్రజాబిష్టం మేరకు "మున్నేరు-పాలేరు లింక్ కెనాలు, ను విరమించుకుంటూ "మున్నేరు - పాలేరు లింక్ కెనాలు, నిర్మాణం కొరకు ఇచ్చిన జీవోను రద్దు చేసి ప్రభుత్వం తన విజ్ఞతను చాటాలి. మున్నేరు నీటిపై ఆ ప్రాంత ప్రజలకు ఉన్న సహజ సిద్ధమైన హక్కులను కాపాడుకోవడానికి న్యాయ పోరాటంతో పాటు ప్రజా పోరాటం చాలా అవసరం. మున్నేరు-పాలేరు లింక్ కెనాల్ కంటే మున్నేరు ప్రాజెక్టు నిర్మాణమే ఆ ప్రాంత సుస్థిర అభివృద్ధికి ఏకైక మార్గం.

**వ్యాసకర్త : న్యాయవాది, రాష్ట్ర ఉపాధ్యక్షులు తెలంగాణ విద్యావంతుల వేదిక**

# పీఆర్సీని వెంటనే ప్రకటించాలి

## మృతి చెందిన, పదవి విరమణ పొందిన ఉపాధ్యాయుల డబ్బులు ఇవ్వాలి

## యుటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చావా దుర్గ భవాని

## రమేష్ కుటుంబానికి ఆరు లక్షల రూపాయలు అందచేసిన తెలంగాణ ఉపాధ్యాయ సంఘం





(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

టేకులపల్లి, జనవరి 16 : ఒక సామాజిక స్పృహ కలిగిన సంఘంగా తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ సంఘం కొనసాగుతుందని టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చావా దుర్గ భవాని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా శాఖ ఆధ్వర్యంలో టేకులపల్లిలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు, గుగులోతు రమేష్ సంస్మరణ సభ శుక్రవారం భద్రాద్రి జిల్లా టేకులపల్లిలో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, యుటిఎఫ్ కుటుంబ సంక్షేమ సొసైటీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 6000 మంది ఉపాధ్యాయుల నుండి వంద రూపాయల చొప్పున సేకరించిన ఆరు లక్షల రూపాయలను చెక్కు రూపంలో టేకులపల్లి ఎంఈఓ., జగన్ చేతుల మీదుగా ఇటీవల మరణించిన రమేష్, భార్య రోజాకు అందజేసినట్లు ఆమె తెలిపారు. ఈ సంస్మరణ సభకు జిల్లా కుటుంబ సంక్షేమ నిధి సొసైటీ కన్వీనర్ డి.దాసు అధ్యక్షత వహించడం జరిగింది.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, టీఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా మరణించిన టీఎస్ యుటిఎఫ్ కుటుంబ సంక్షేమ సొసైటీ సభ్య లకు మూడు కోట్లకు పైగా సంఘీభావ విరాళాలు అందజేయడం జరిగిందని తెలిపారు. తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఈ పథకమును అత్యంత పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఒక్కరి కోసం అందరం- అందరికోసం ఒక్కరు అనే నినాదంతో ఈ పథకం ప్రారంభించి రెండున్నర సంవత్సరాలు పూర్తయిందని అయన తెలిపారు. అనుకోని సంఘటనల వలన మరణించిన ఉపాధ్యాయ కుటుంబాలకు ఆరు లక్షల రూపాయలు అందజేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం నుండి రావలసిన ఆర్థిక సహాయం వచ్చేవరకు వారి కుటుంబ పోషణకు ఎంతగానో ఈ డబ్బులు ఉపయోగపడుతున్నాయని అయన తెలిపారు. ప్రస్తుతం ఆకస్మికంగా చనిపోయిన, పదవి విరమణ పొందిన ఉపాధ్యాయుల ఉద్యోగులకు రావలసిన ప్రభుత్వ సహాయం వెంటనే రాని సందర్భం ఉన్నదని తెలిపారు. అదేవిధంగా ప్రస్తుతం ఉపాధ్యాయ ఉద్యోగులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న పీఆర్సీని 2023 నుండి, మంచి ఫిట్‌మెంట్‌తో వెంటనే ప్రకటించాలని, పెండింగ్ లో ఉన్నటువంటి ఐదు డిఏలను వెంటనే ప్రకటించాలని, ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు వెంటనే వారి ఖాతాలలో జమ చేయాలని, పదవి విరమణ చెందిన వారి బకాయిలు వెంటనే చెల్లించాలని, ఉపాధ్యాయులకు సంబంధించిన జిపిఎఫ్,టీఎస్జిఎల్ఐ, జిఐఎస్ వంటి వంటివి గత రెండు సంవత్సరాల కాలంగా పెండింగులో ఉన్నాయని వెంటనే జమ చేయాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఉండే విధంగా తగు చర్యలు తీసుకొని అభివృద్ధి పరచాలని కోరారు. నూతన విద్యా విధానం 2020 ని ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మార్పులు చేయాలని కోరారు. 2010కి ముందు నియామకమైన వారిని ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ నుండి మినహాయించాలని కోరారు. ఈ సంస్మరణ సభలో టేకులపల్లి మండల విద్యాశాఖ అధికారి ఏ.జగన్, రాష్ట్ర కార్యదర్శి బి.రాజు, జిల్లా అధ్యక్షులు బి.మురళీమోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లంపాటి వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు వి.వరలక్ష్మి, ఎం.రాజయ్య, జిల్లా కోశాధికారి ఎస్.వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఎఫ్.డబ్ల్యూ.ఎస్. జాయింట్ సెక్రెటరీ ఎన్.కృష్ణ, జిల్లా కార్యదర్శిలు హాథిరాం, పి.జయరాజు, ఎం.పద్మారాణి, ఎస్.కే.పాషా, డి.తావూరియా, రాష్ట్ర కమిటీ సభ్యులు బి.కిషోర్ సింగ్, టేకులపల్లి మండల బాధ్యులు డి.హరి, టి.లక్ష్మణ్ ,ఇల్లెందు మండల బాధ్యులు ఈ.రాంబాబు, కే.వెంకటేశ్వర్లు, ఎఫ్.డబ్ల్యూ.ఎఫ్. కన్వీనర్ బి.రామచందర్, జిల్లా సోషల్ మీడియా సభ్యులు బి.మంగీలాల్, జిల్లా కమిటీ సభ్యులు ఏ.వీరన్న , గుండాల మండల బాధ్యులు రూప్ సింగ్, సభ్యులు భానుప్రియ, గుగులోత్ రమేష్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# చంద్రుతండాలో శ్రీ శ్రీ శ్రీ సమ్మక్క-సారలమ్మ జాతర

## ముఖ్య అతిథిగా పాల్గొన్న గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హాథిరామ్ నాయక్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

టేకులపల్లి, జనవరి 16: భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం గొల్లపల్లి పంచాయతీ చంద్రుతండ గ్రామంలో శుక్రవారం శ్రీ శ్రీ శ్రీ సమ్మక్క- సారక్క జాతర ఘనంగా ప్రారంభం అయ్యింది. గద్దెల పూజారి గూగులోత్ పుష్ప సురేష్ ఆధ్వర్యంలో మొట్ట మొదటి జాతర గిరిజన పూజారుల సమక్షంలో అంగరంగా వైభవంగా మేళ తాళాలతో అంగరంగా వైభవంగా నిర్వహించిన జాతరలో గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హథిరామ్ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విశిష్ట అతిథిగా చంద్రుతండా సర్పంచ్ బానోతు సంతోష కిషన్ నాయక్ హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. చుట్టూ ప్రక్కల తండా ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని పూజ కార్యక్రమంను విజయవంతం చేశారు. అన్న దాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గూగులోత్ అనిత, సర్దార్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి భూక్యా రాంజీ, గ్రామ పెద్దలు డబిల్య నాయక్, భూక్యా బద్రూ, సాములు, భట్టు వినోద్, రాంబాబు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# పొంగులేటి ఆఫీస్ ఇంచార్జి దయాకర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన మల్లిబాబు యాదవ్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఇల్లెందు, జనవరి 16 :తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ శాఖ మాత్యులు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంప్ ఆఫీస్ ఇన్ ఛార్జ్ తుంబురు దయాకర్ రెడ్డిని కార్యాలయంలో మాజీ జెడ్పిటిసి డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాలలో ప్రశాంత వాతావరణం తో, ప్రతి ఒక్కరూ ముఖ్యంగా రైతన్నలు సంక్రాంతి పండుగతో సహా ప్రతి ఒక్క ఉత్సవాలను ఆనందంతో గడుపుకోవాలని ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి తెలిపారు. అంతకుముందు మల్లి బాబు యాదవ్ దంపతులు పండితాపురం గ్రామంలోని స్వగృహంలో అభిమానులు కార్యకర్తలు, కుటుంబ సభ్యుల సమక్షంలో సంక్రాంతి పండుగ సంబరాలు, గంగిరెద్దు ఆటలు జరుపుకున్నారు. రైతులకు సాంప్రదాయకరమైన ఈ సంక్రాంతి పండుగను పాడిపంటలతో, కుటుంబంతో, గంగిరెద్దుల ఆటలతో హరిదాసుల సంకీర్తనలతో పండుగను సంతోషంగా జరుపుకోవాలని, ఈ పండుగ నుండి సూర్యుడు మకర రాశిలోకి, ఉత్తరాయణం నుండి దక్షిణాయనమునకు ప్రవేశించే సందర్భమున జరిగే సంక్రాంతి పండుగ అందరి జీవితాలలో సంతోషం ఉండాలని మల్లి బాబు యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు రైతుబంధు ద్వారా డబ్బులు ఎకౌంట్లోకి జమ జరుగుతుందని, బీసీ ఎస్సీ ఎస్టీలకు కొత్తగా పథకాలు ప్రవేశపెట్టే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొమ్మనేపల్లి గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ మేకల మల్లికార్జునరావు, శీలం పుల్లయ్య, జక్కంపూడి వెంకటేశ్వర్లు, మేకల అన్నపూర్ణ, మేకల మహేష్ బాబు, లీలా, కవిత, మేకల లక్ష్మీనారాయణ, ఎస్.కే. రబ్బానీ పాషా, దేరంగుల తిరపయ్య, రాధాకృష్ణ, ఉస్మాన్, తదితరులు పాల్గొన్నారు.

# కెటికే 5 గనిలో మూసివేసిన పని స్థలాల కార్మికులకు తాత్కాలిక సర్దుబాటు

## నెల రోజుల్లో పర్మిషన్ తేవడానికి యాజమాన్య హామీ

(ప్రజాలక్ష్యం ప్రత్యేక ప్రతినిధి)

భూపాలపల్లి, జనవరి 16 : మైనింగ్ ఇన్స్ పెక్టర్ ఇటీవల మునివేసిన కేటీకే 5గని ఫైవ్ బి సెక్షన్ లో భాగమైన ఎస్ఎస్-16 ప్యానెలుకు నెల రోజుల్లో మళ్ళీ పర్మిషన్ తెచ్చేందుకు యాజమాన్యం హామీ ఇచ్చినట్లు ఐఎన్టీయుసి నాయకులు తెలిపారు. ఈ పనిస్థలాలను ఇటీవల మైనింగ్ ఇన్స్పెక్టర్ సందర్శించి పర్మిషన్ లేదని తాత్కాలికంగా బందు చేయించారని వారు పేర్కొన్నారు. దీంతో యాజమాన్యం కేటికే.5 గని నుండి కేటీకే.8 ఇంక్లైన్ కు అన్ని డిసిగ్నేషన్లకు సంబంధించిన 100 మంది ఉద్యోగులను బదిలీ చేస్తున్నామని నోటీసు బోర్డుల ద్వారా తెలియజేసిందని వారు తెలిపారు. దీంతో వెనువెంటనే స్పందించిన తాము సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ ఆధ్వర్యంలో కేటీకే ఫైవ్ ఇంక్లైన్ కార్మికులకు, బందు చేసినటువంటి పని స్థలాలకు పర్మిషన్ తీసుకురావాలని, అప్పటివరకు కార్మికులకు తాత్కాలికంగా కేటికే.5 గనిలోనే పని కల్పించాలని యాజమాన్యానికి మెమోరాణం సమర్పించామని వారు పేర్కొన్నారు. అందుకు స్పందించిన భూపాలపల్లి జనరల్ మేనేజర్, ఒక్క నెలలో పని స్థలాలకు పర్మిషన్ తీసుకువచ్చి కార్మికులకు



పని కల్పిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని వారు చెప్పారు. ఐఎన్టియుసి సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ ఆదేశానుసారం, బ్రాంచ్ సెక్రటరీలు షేక్ హుస్సేన్, బొడ్డు అశోక్ ల ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం భూపాలపల్లి జనరల్ మేనేజర్ కు ఈ మెమోరాండం సమర్పించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జనరల్ సెక్రెటరీ పసునూటి రాజేందర్, బ్రాంచ్ సెక్రటరీ కుడుదుల శంకర్, రవి కిరణ్, బీసీ-ఓబిసి సెక్రటరీ నవీన్, మండల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# మున్సిపాలిటీలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తాం...

## రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మంచిర్యాల, జనవరి 16 : జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. శుక్రవారం జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ రాజు, మందమర్రి మండల తహసిల్దార్ సతీష్, డి.సి.సి. అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డి లతో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని, చెన్నూర్ నియోజకవర్గంలో ప్రతి గ్రామాన్ని అనుసంధానం చేస్తూ అంతర్గత రహదారులు నిర్మించడంతో పాటు పారిశుధ్య నిర్వహణలో భాగంగా మురుగు కాలువల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హులైన నిరుపేదలకు పథకం ఫలాలు అందించేందుకు అధికార యంత్రాంగం సమన్వయంతో చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. అమృత్ పథకంలో ఇంటింటికీ నల్లా కనెక్షన్ ద్వారా నిరంతరం శుద్ధమైన త్రాగునీటిని అందించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలోని 1వ వార్డు అల్లూరినగర్‌లో 73 లక్షల 46 వేల రూపాయలు, 2వ వార్డు తిలక్‌నగర్‌లో 72 లక్షల 56 వేల రూపాయలు, 7వ వార్డులో 72 లక్షల 56 వేల రూపాయలు, 8వ వార్డు చైతన్య కాలనీలో 1 కోటి 89 లక్షల రూపాయలు, 9వ వార్డు ఆర్.ఆర్. నగర్‌లో 46 లక్షల రూపాయలు, న్యూ తిమ్మాపూర్‌లో 52 లక్షలు 50 వేల రూపాయలు, ఓల్డ్ తిమ్మాపూర్‌లో 44 లక్షల 50 వేల రూపాయలు, 12వ వార్డు గాంధీనగర్ ప్రాంతంలో 6 లక్షలు 17 వేల రూపాయలు, 13వ వార్డు ఆమ్‌నగర్ ప్రాంతంలో 6 లక్షల 17 వేల రూపాయలు, 14వ వార్డు మల్లికార్జున నగర్ ప్రాంతంలో 27 లక్షల 22 వేల రూపాయలు, 16వ వార్డు గంగా కాలనీలో 34 లక్షల 64 వేల రూపాయల అంచనా వ్యయంతో టి.యు.ఎఫ్.ఐ.డి.సి., డి.ఎం.ఎఫ్.టి., సి.ఎస్.ఆర్., నగర అభివృద్ధి నిధులతో పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని చెన్నూర్ నియోజకవర్గ పరిధిలో గల ప్రతి ప్రాంతాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో మంజూరైన అభివృద్ధి పనులకు సంబంధించిన నిధులను ప్రణాళికబద్ధంగా వినియోగించి పనులను త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వచ్చే వేసవిలో ప్రతి ఇంటికి నిరంతరం త్రాగునీటిని అందించేందుకు అమృత్ పథకం క్రింద నీటి ట్యాంకులు, ఇతర అనుబంధ పనులను చేపట్టి కొనసాగించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలకు కనీస అవసరాలను తీర్చేందుకు అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఘనంగా పతంగుల పండగ



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, జనవరి 16 : వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పతంగుల పండగను ఘనంగా నిర్వహించారు. ఆసిఫాబాద్ పట్టణంలోని స్థానిక హెూలీట్రినిటీ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి పండగను పురస్కరించుకొని పతంగుల పండగను నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షాకార్యదర్శులు ఉదయబాబు, శ్రీనివాస్ లు కలిసి 100 మంది చిన్నారులకు పంతంగులు, దారం రీళ్ళు అందజేశారు. దీంతో పాఠశాల ప్రాంగణం పండగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో వాసవిక్లబ్ అంతర్జాతీయ సభ్యులు ఏకిరాల శ్రీనివాస్, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చిలువేరు వెంకటేశ్వర్లు, వాసవి ఆలయ కమిటి అధ్యక్షుడు రావుల శంకర్, క్లబ్ కోశాధికారి శ్రీధర్, మాజీ క్లబ్ అధ్యక్షులు శ్రీనివాస్, శంకర్, వేణుగోపాల్, సభ్యులు రవీందర్, ప్రశాంత్, కృపాల్, జగదీష్, నితిన్, శ్రీనివాస్,నీలేష్, అమూల్, అమిత్ తదితరులు పాల్గొన్నారు.

# శబరికి బయలుదేరిన అయ్యప్ప స్వాములు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, జనవరి 16 : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో 41 రోజుల మండల దీక్ష అనంతరం పట్టణానికి చెందిన పలువురు అయ్యప్ప స్వాములు శబరిమలకు బయలుదేరారు. అంతకుముందు ఆసిఫాబాద్ పట్టణం పెద్ద వాగు సమీపంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో రెబ్బెనకు చెందిన గురుస్వామి సూర్య భాస్కర శర్మ ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు నాగేశ్వర్ ప్రత్యేక పూజలు నిర్వహించి స్వాములకు ఇరుముడి కట్టారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మాజీ మార్కెట్ కమిటి చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు గాదెవేణి మల్లేష్ ఆధ్వర్యంలో స్వాములు, భక్తులకు బిక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిసి అధ్యక్షుడు విశ్వప్రసాద్, స్వాములు వెంకట్ గౌడ్, చంద్రమోహన్, శ్రవణ్, శ్రీనివాస్, తిరుపతి, ఆలయ కమిటీ అధ్యక్షుడు వేణుగోపాల్, భక్తులు వినాయక్, శ్రీకాంత్, సంతోష్, శ్యామ్, నరేష్ తో పాటు మహిళా భక్తులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ ఎన్నికలకు సిద్ధం కావాలి

## జనసేన పార్టీ ఆదిలాబాద్ కోఆర్డినేటర్ మంతెన సంపత్ కుమార్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, జనవరి 16 : రాబోయే మున్సిపాలిటీ ఎన్నికలకు జనసేన పార్టీ సైనికులు సిద్ధం కావాలని ఆ పార్టీ ఆదిలాబాద్ జిల్లా కోఆర్డినేటర్ మంతెన సంపత్ కుమార్ ,రాష్ట్ర యువజన విభాగం సభ్యుడు మరియాల వినీత్ లు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ "రాజకీయాలు వారసత్వంగా దక్కే ఆస్తులు కావు అని ప్రజల సమస్యలపై పోరాడే ధైర్యం, సేవాభావం, నిజాయితీ ఉన్న యువత చేతుల్లోకి రావాల్సిన బాధ్యత రాజకీయాలది అని అన్నారు. మార్పు కోరుకునే యువత ప్రశ్నించే స్థాయి నుంచి నిర్ణయాలు తీసుకునే స్థాయికి రావాల్సిన సమయం ఆసన్నమైంది" అని పేర్కొన్నారు. నేటి యువత చదువుకున్నప్పటికీ ఉద్యోగాలు లేవని, ఉద్యోగాలు ఉన్నా గౌరవం లేదని, అదే సమయంలో ప్రజా సమస్యలు ప్రతి వీధిలో స్పష్టంగా కనిపిస్తున్నాయని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. "ఈ పరిస్థితులు మారాలంటే సోషల్ మీడియా పోస్టులు, వాట్సాప్ ఫార్వర్డ్స్ మాత్రమే సరిపోవు. మునిసిపాలిటీ ఎన్నికల్లో పోటీ చేసి, వ్యవస్థలోకి వెళ్లి నిజమైన మార్పుకు శ్రీకారం చుట్టాలి" అని యువతకు పిలుపునిచ్చారు. జనసేన పార్టీ అనేది పదవుల కోసం కాకుండా ఆశయాల కోసం నిలిచిన పార్టీ అని స్పష్టం చేశారు. "నిజాయితీ, ధైర్యం, సేవాభావం ఉన్న యువకులు, యువతులకు జనసేనలో పూర్తి స్థాయిలో అవకాశాలు ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లా మొత్తం నుంచి యువత రాజకీయాల్లోకి రావాలని పార్టీ స్పష్టంగా నిర్ణయించింది" అని తెలిపారు. పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆశయాలను గుర్తు చేస్తూ నాయకులు మాట్లాడుతూ "యువత రాజకీయాలకు దూరంగా ఉంటే, రాజకీయాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తాయి. అందుకే పవన్ కళ్యాణ్ యువత ముందుకు రావాలని పిలుపునిస్తున్నారు. ఆ పిలుపును క్షేత్రస్థాయిలో అమలు చేయడమే జనసేన లక్ష్యం" అని పేర్కొన్నారు. మునిసిపాలిటీ స్థాయిలోనే అసలైన నాయకత్వం తయారవుతుందని, వీధి సమస్య నుంచి రాష్ట్ర రాజకీయాల దాకా ప్రయాణం ఇక్కడినుంచే మొదలవుతుందని నాయకులు అభిప్రాయపడ్డారు. "ఈ ఎన్నికలు కేవలం ఓటు వేసే బాధ్యత మాత్రమే కాదౌ నాయకుడిగా నిలబడే అవకాశం. ఆదిలాబాద్ జిల్లా యువత చరిత్ర రాయాల్సిన సమయం ఇది" అని స్పష్టం చేశారు. జనసేన పార్టీ నాయకులు సమిష్టిగా "భయపడితే రాజకీయాలు మారవు. ముందుకు వస్తే చరిత్ర మారుతుంది. జనసేనతో కలిసి యువత రాజకీయాల్లోకి వస్తే, రేపటి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా దిశే మారిపోతుంది" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగం హడ్ హాక్ కమిటీ మెంబెర్ మాయ రమేష్ , కొమరం భీమ్ జిల్లా జనసేన నాయకులు, హడ్ హాక్ రాష్ట్ర యువజన విభాగం హడ్ హాక్ మెంబెర్ మరియాల వినీత్, జనసేనపార్టీ కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జనసేన నాయకులు వైరాగడే వైరాగడే కృష్ణ, కార్తీక్, రమేష్, కావాల్కర్ శ్రీకాంత్, గుండా అఖిల్, నితిన్, తిరుపతి, ప్రేమ్ సాగర్ ,వసంత్, రవి, రాహుల్ ,తిరుపతి, నవీన్, జెశ్వంత్, హర్షిత్, సాత్విక్, శ్రీనివాస్, వంశీ, తిరియాని మండల్ నాయకులు జెడ సంతోష్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు పలువురు యువత జనసేన పార్టీలో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

# డిఫెన్సివ్ డ్రైవింగ్‌పై అవగాహన కల్పించిన కోరుట్ల ఎస్సై



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, జనవరి 16 : జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు అరైవ్.. అలైవ్ కార్యక్రమంలో భాగంగా డిఫెన్సివ్ డ్రైవింగ్ అనే అంశంపై కోరుట్ల ఎస్సై చిరంజీవి ఆధ్వర్యంలో శుక్రవారం కోరుట్ల మండలంలోని మాదాపూర్, కల్లూరు, సర్ప రాజు పల్లి గ్రామాలలో యువత అందరికీ ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. డిఫెన్సివ్ డ్రైవింగ్ లో భాగంగా ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి మోటార్ సైకిల్ మీద ప్రయాణించాలని, కారులో వెళ్ళేటప్పుడు తప్పక సీట్ బెల్ట్ ధరించాలని, వాహనాలను ఓవర్ స్పీడ్ తో కాకుండా నార్మల్ స్పీడ్ తో వెళ్లాలని సూచించారు. మద్యం తాగి వాహనాలను నడపొద్దని తెలియజేస్తూ ప్రతి ఒక్కరు కూడా వారి యొక్క ప్రయాణాన్ని ప్రారంభించే ముందు వాళ్ళ కుటుంబ సభ్యులు, భార్యా పిల్లలను గుర్తు చేసుకొని వారి ప్రయాణాన్ని కొనసాగించాలని కోరారు. ఈ 2026 సంవత్సరంలో ఆయా గ్రామాల్లో ఒక్కరు కూడా రోడ్డు ప్రమాదాల్లో నష్టం జరగకుండా చూస్తామని, తమ గ్రామాలను యాక్సిడెంట్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుదామని నూతనంగా గెలిచిన సర్పంచులు హామీ ఇచ్చారు

# అద్భుతంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పార్క్‌ను నిర్మిస్తాం

## సింగరేణి మున్సిపల్ కార్పొరేషన్‌గా పేరు మార్చేందుకు ప్రయత్నం

## రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్





(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్‌సిటి (గోదావరిఖని), జనవరి 16 : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పార్కును అత్యంత అద్భుతంగా నిర్మిస్తామని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ అన్నారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పేరును సింగరేణి మున్సిపల్ కార్పొరేషన్ గా మార్చడానికి ప్రయత్నిస్తానని అన్నారు. గోదావరి తీరాన ఎన్నో శైవ క్షేత్రాలు ఉన్నాయనిగుడుల జనగామను గోదావరిఖనిగా మార్చుకున్నామని, పవిత్రమైన జ్ఞాన కేంద్రంగా ఈ ప్రాంతాన్ని తీర్చిదిద్దుతానన్నారు.రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ సమీపంలో ని పెట్రోల్ బంక్ కు ఎదురుగామెడికల్ కాలేజీ కి వెళ్లే రహదారి పక్కన సింగరేణికి సంబంధించిన 4.50 ఎకరాల ఖాళీ స్థలంలో నూతనంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పార్క్ నిర్మాణ పనుల ను రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ శుక్రవారంప్రారంభించారు.ముందుగా అర్జీవన్ ఏరియా జి.ఎం. డి.లలిత్ కుమార్ తో కలిసి కొబ్బరి కాయ కొట్టి అంబేద్కర్ పార్క్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఇక్కడ ఉన్న ఖాళి స్థలంలో మట్టి నింపే కార్యక్రమం పార్క్ కు ప్రహరి గోడ నిర్మాణానికి ఎమ్మెల్యే పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సింగరేణికి సంబంధించిన 4.50 ఎకరాల ఖాళీ స్థలంలో రూ.86 లక్షల రూపాయల వ్యయం తో నూతన పార్క్ కు భూమి పూజ చేయడం సంతోషంగా ఉందన్నారు. ఇక్కడ ఉన్న ఖాళీ స్థలములో ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావడానికి ఇందులో దూర ప్రాంత ప్రజలకు పరిసర ప్రాంత ప్రజలకు ఈ పార్కు తొందరలోనే పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొని వస్తామన్నారు. గోదావరిఖని ప్రాంతానికి రాగానే కనిపించే ఈ స్థలంచెత్తతో ఒక డస్ట్ బిన్ గా ఉండేదని అన్నారు. అలాంటిది ఈ ప్రదేశంలోప్రజలకు ఒక మంచి పార్కు నిర్మించలానే ఉద్దేశ్యంతో ఈ పార్క్ ను సింగరేణి సంస్థ సహకారం ఏర్పాటు చేస్తూ ఉన్నామన్నారు. అదేవిధంగా ఈ ప్రాంతంలో భారీ ఫంక్షన్ హాల్ లో నిర్మించడానికీ కూడా సన్నాహాలు ప్రారంభించామన్నారు.ఆలాగే గత రెండు సంవత్సరాల కాల వ్యవధిలో రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో రాష్ట్రాన్ని రైసింగ్ తెలంగాణ గా ముందుకు వెళ్తున్నారని ఎమ్మెల్యే అన్నారు.తెలంగాణ రాష్ట్రాన్ని భారతదేశం లో ఉన్న రాష్ట్రాలతో కాకుండా హైదరాబాద్ నగరాన్ని ఇతర దేశాలతో సమానంగా సింగపూర్ యూరోప్ లాంటి కంట్రీ లో ఉన్న దేశాలకు సమానంగా చెయ్యాలి అని సంకల్పంతో సిఎం ముందుగా సాగుతున్నారని అన్నారు.ఈ రాష్ట్రంలో ఉన్నటువంటి రైతులు చిరు న వ్వుతో చూడాలని సంకల్పం, కార్మిక క్షేత్రంలో కార్మికులను వారికీ ఏ కష్టం రాకుండా ఈ రాష్ట్రం లో ఉన్నటువంటి ప్రభుత్వ రంగ సంస్థలో పని చేస్తున్న వారికి సహకరిస్తూ అదే మాదిరిగా తెలంగాణ మొత్తం కూడా ఎక్కడికి అయినా రెండు మూడు గంటల్లో చేరే విధంగా రోడ్ మ్యాప్ చేస్తూ అన్ని నగరాలను అభివృద్ధి చెయ్యాలనే సంకల్పం లో ముందుకు వెళ్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమములో ఆర్జివన్ ఏరియా జి. ఎం. లలిత్ కుమార్, ఇంచార్జ్ యస్.ఓ.టుజి.ఎం.యల్ రమేష్, ఎఐటియుసి యూనియన్ నాయకురాలు పద్మ, కాంగ్రేస్ నాయకులు మహంకాళి స్వామీ, దీటి బాలరాజు, బొంతల రాజెష్, ఎజియం వర్క్ షాఫ్ జితేందర్ సింగ్, డిజియం సివిల్ వర ప్రసాద్, , పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, సింగరేణి శ్రీను (పొలసాని శ్రీనివాస్), కమ్యునికేషన్ సెల్ అధికారి హనుమంతరావు, కాంగ్రెస్ నాయకులు ముస్తఫా, సింగరేణి అధికారులు కుమార స్వామీ, సాంబశివరావు, వీరారెడ్డి సెక్యురిటి సిబ్బంది అధిక సంఖ్యలో ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సూర్యాపేట, జనవరి 16 : కోదాడ, మండల పరధిలోని నల్లబండ గూడెం గ్రామానికి చెందిన గోపి(13), పదమూడు సంవత్సరాల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో పూర్తిగా మంచానికే పరిమితమై ఏమి చెయ్య లేని స్థితి. బాబు చికిత్సకు డబ్బులు లేక, కుటుంబ పోషణే కష్టంగా ఉన్న ఆ కుటుంబానికి నకిరేకల్ కి చెందిన లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ వారు కిరాయికి ఉంటున్న ఇంటికి వెళ్లి శుక్రవారం ఉదయం రూ. 15,200 సాయం అందించి మానవత్వం చాటుకున్నారు. సహాయం పొందిన కుటుంబం లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ ప్రతినిధి కర్నాటి నరేష్, రమావత్ సక్రూ, సుధాకర్ పాల్గొన్నారు.

# రామగుండం పట్టణ అభివృద్ధి పనుల భూమి పూజకు తరలిరండి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రామగుండం, జనవరి 16 : రామగుండం పట్టణ మజీద్ కార్నర్ వద్ద శనివారం నిర్వహించ తలపెట్టిన 20 కోట్ల అభివృద్ధి పనుల భూమి పూజ కార్యక్రమ సభకు అన్ని వర్గాల ప్రజలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు అయోధ్య సింగ్ ఠాకూర్ కార్పొరేషన్ మాజీ ఫ్లోర్ లీడర్ మహంకాళి స్వామి కోరారు. శుక్రవారం నిర్వహించే స్థలాన్ని పరిశీలించి మాట్లాడారు. 20 కోట్ల నిధులతో పట్టణంలో నిర్మించబోయే అభివృద్ధి పనులకు భూమి పూజ చేసేందుకు పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ ఠాకూర్ హాజరవుతున్నారని, కాంగ్రెస్ అనుబంధ సంఘల నాయకులు కార్యకర్తలు అన్ని కార్పొరేషన్ డివిజన్ పరిధి నుంచి ప్రజలను తరలించి విజయవంతం చేయాలని అయోధ్య సింగ్ ఠాకూర్ మహంకాళి స్వామి కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఈదునూరి ప్రసాద్, మాజీ కౌన్సిలర్ ఇసంపల్లి అంజలు, మహమ్మద్ ఉస్మాన్ షరీఫ్, కన్నూరి సతీష్ కుమార్,కాంగ్రెస్ నాయకులు మందారపు బుగ్గ రాములు గౌడ్, బల్విందర్ సింగ్, పల్లికొండ రాజేశ్వర్, ములుగు వెంకటరాజం, కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు

# రోడ్డు భద్రత ప్రమాణాలను విధిగా పాటించాలి

## జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి





(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మేడ్చల్ మల్కాజిగిరి, జనవరి 16 : రోడ్డు ప్రమాదాల నివారణలో తెలంగాణ ప్రభుత్వం పది రోజుల పాటు నిర్వహించే అరైవ్ ఆలైవ్ 2026లో భాగంగా, రెండవ రోజు మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రోడ్డు భద్రత ప్రమాణాలను విధిగా పాటించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ఆకాంక్షించారు. జిల్లా డిఆర్వో, ఏసిపి, ట్రాఫిక్ ఎస్ఐ లతో కలిసి జిల్లా అదనపు కలెక్టర్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, వాహనం కలిగియున్న ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్సు, ఫిట్నెస్ పర్మిట్, పొల్యుషన్ చెక్, ఇన్సూరెన్స్ పత్రాలు కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసిపి వెంకట రెడ్డి మాట్లాడుతూ, పౌరుల పరివర్తన పౌర సమాజ అవగాహన రోడ్డు భద్రతలో కీలకమని అన్నారు. భారత దేశంలో కేవలం 2025 సంవత్సరానికి గాను ఐదు లక్షల పైన రోడ్డు ప్రమాదాలు జరిగాయని, అందులో 2 లక్షల వరకు మరణాలు ఉన్నాయి అన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన సందేహాలను ఉద్యోగులకు నివృత్తి పరిచారు "రహదారి భద్రత ప్రతిజ్ఞ" ను ఉద్యోగులచే చేయించారు. అలాగే, షామీర్పేట్ సిఐ శ్రీనాథ్ మాట్లాడుతూ, మనం చేసే చిన్న చిన్న నిర్లక్ష్యాలు హెల్మెట్ స్ట్రాప్ ఫిక్స్ చేసుకోకపోవడం, సీట్ బెల్ట్ పెట్టుకోకపోవడం వలన మన కుటుంబాలకి తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తాయని అన్నారు. సెల్ ఫోన్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, రాంగ్ లేన్ డ్రైవింగ్ చేయడం వల్ల జరిగే నష్టాలను వివరించారు. ట్రాఫిక్ ఎస్ఐ నవీన్ రెడ్డి మాట్లాడుతూ, స్పీడ్ సేఫ్టీ ప్రమాణాలు అందరూ తెల్సుకొని మన చుట్టూ ఉన్న అందరికీ తెలియచెప్పడం ప్రభుత్వ ఉద్యోగులుగా మన బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వివిధ శాఖల అధికారులు కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించాలి

## చిట్యాల ఎమ్మార్వోకు బీసీ సంఘాల వినతి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నల్గొండ, జనవరి 16 : మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఎన్నికలకు వెళ్లాలని బీసీ సంఘాలు కోరాయి. ఈ మేరకు శుక్రవారం చిట్యాల ఎమ్మార్వోకు బీసీ సంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్, బీసీ యువజన సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎడ్ల మహాలింగం మాట్లాడుతూ, ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీల ప్రకారం కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేసి ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదికన విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లతో పాటు స్థానిక సంస్థలు, మున్సిపాలిటీల్లో బీసీలకు శాశ్వత పరిష్కారం దిశగా రాజ్యాంగ సవరణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర జనాభాలో బీసీలు అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ రాజకీయంగా కేవలం 14 శాతం ప్రాతినిధ్యమే ఉండటం వారి వెనుకబాటుతనానికి నిదర్శనమని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243-డి(6) ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని, ఇప్పటికే అసెంబ్లీలో చట్టం చేసిన నేపథ్యంలో వెంటనే జీవో జారీ చేసి ఎన్నికలకు వెళ్లాలని కోరారు. సుప్రీంకోర్టు 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల సందర్భంగా 50 శాతం పరిమితిని సడలించిన విషయాన్ని గుర్తు చేస్తూ, ఇందిరా సహానీ కేసులో ఎంపిరికల్ డేటా ఉంటే 50 శాతం మించవచ్చని సుప్రీంకోర్టు స్పష్టంగా పేర్కొందని తెలిపారు. ప్రస్తుతం అన్ని చట్టపర, న్యాయపర, రాజ్యాంగపర అంశాలు బీసీ రిజర్వేషన్లకు అనుకూలంగా ఉన్నాయని, కేసు బలంగా ఉందన్నారు. ఈ సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్, బీసీ యువజన సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎడ్ల మహాలింగం, మనీల్, రాజారాం పాల్గొన్నారు.

# మున్సిపాలిటీపై కాషాయ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా పనిచేయాలి

## మున్సిపల్ ఏర్పడి ఆరు సంవత్సరాలు గడుస్తున్నా ఆశించిన అభివృద్ధి జరగలేదు

## బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ భోగ శ్రావణి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, జనవరి 16 : రాయికల్ మున్సిపాలిటీపై కాషాయ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని బిజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ భోగ శ్రావని పిలుపునిచ్చారు. స్థానిక విఎస్ గార్డెన్స్‌లో ఆమె శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బోగ శ్రావణి మాట్లాడుతూ....ఎరాయికల్ మున్సిపల్ ఏర్పడి ఆరు సంవత్సరాలు గడుస్తున్నా ఆశించిన అభివృద్ధి జరగలేదు. ప్రజలకు కనీస అవసరాలైన వీధి దీపాలు, తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ అందించడంలో కూడా ప్రస్తుత పాలకులు విఫలమయ్యారు. గత ప్రభుత్వ వైఫల్యాల వల్ల మనకు రావలసిన అగ్నిమాపక కేంద్రని వేరే నియోజకవర్గానికి తరలించినప్పుడు ఇక్కడి నాయకులు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. అలాగే 'పెద్ద చెరువు' సుందరీకరణ పనులు నేటికీ పూర్తి కాకపోవడం విచారకరం అన్నారు. మాదిగ కుంట దుర్వాసన వల్ల దోమల ఉధృతి పెరిగి, ప్రతి ఏటా రాయకల్ ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్న నాయకులు పట్టించుకోవడం లేదని, డబల్ బెడ్ రూమ్ ఇల్లు శిథిలావస్థకు చేరుకున్నాయి వాటిని ఇప్పటివరకు పూర్తి చేయలేదన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను మీ రాజకీయ లబ్ధి కోసం ఓటు బ్యాంక్ గా మాత్రమే వాడుకుంటున్నారన్నారు. పట్టణంలో డిగ్రీ కాలేజీ బిల్డింగ్ ఉన్నప్పటికీ, తగినంత స్టాఫ్ (బోధన సిబ్బంది) లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే విద్యా సౌకర్యాలను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. రాయికల్ పట్టణంలో వైకుంఠధామంలో డంపింగ్ యార్డ్ నిర్వహించడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పట్టణంలోని వైకుంఠధామాలను సకల సౌకర్యాలతో అభివృద్ధి చేయాలని కోరారు. రాయకల్ పట్టణ ప్రజలు చాలా చైతన్యవంతులని, వారు అన్ని అంశాలను గమనిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో జరిగిన ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికల్లో సాధించిన మెజారిటీని స్ఫూర్తిగా తీసుకుని, ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల్లో కూడా బిజెపి చైర్మన్ పీఠాన్ని దక్కించుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రచారం చేసి, రాయకల్ మున్సిపాలిటీపై బిజెపి జెండా ఎగరవేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాయికల్ పట్టణ అధ్యక్షులు కుర్మా మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి భాగ్యలక్ష్మి, కునారపు భూమేష్, కడార్ల శ్రీనివాస్, మచ్చ నారాయణ, వాసం రామ, బన్న సంజీవ్, సమల్ల సతీష్, అల్లె నర్సయ్య, బొడుగం శ్రీకాంత్, పట్టణ పదాధికారులు, ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సంక్రాంతి సందర్భంగా ముత్తయికోటలో ముగ్గుల పోటీలు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, జనవరి 16 : సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని మెదక్ మండలంలోని ముత్తయి కోటలో హవేలీఘనపూర్ మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షురాలు ముత్తయి కోట గ్రామ సర్పంచ్ గుండారం శ్వేత కిరణ్ గౌడ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. 100 మందికిపైగా ఈపోటీలో పాల్గొన్నారు. పోటీలో పాల్గొన్న వారికి మొదటి బహుమతి ఉమ్మెంతలా రోజా,రెండవ బహుమతి పొద్చన్ పల్లి నవనీత - శివరాజ్ గౌడ్,తృతీయ బహుమతి ఎల్లబోయిన విజయం గెలుచుకున్నారు. నాల్గవ బహుమతి అల్లం దివ్య ఐదవ బహుమతి ఎల్లబోయిన లక్కీ మడబోయిన మౌనిక కాన్సలేటెడ్ బహుమతులుగా మాడ బోయిన కృతిక పార్తీ గల్ల అమ్ములు రాజ్య మనోజ్ఞ అలేఖ్య కొత్తపల్లి హర్షిత గెలుచుకున్నారు. ఈ బహుమతి ప్రధానంలో గ్రామ సర్పంచ్ శ్వేతా కిరణ్ గౌడ్ వార్డ్ మెంబెర్స్ గ్రామస్థులు పాల్గొన్నారు. ఈసందర్భంగా సర్పంచ్ శ్వేత కిరణ్ గౌడ్ మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా గ్రామంలో ముగ్గుల పోటీలు నిర్వహించామని మంచి స్పందన వచ్చిందని ఆమె తెలిపారు. పోటీలలో గెలుపు ఓటమేలు సహజమని ఓటమి చెందిన వాళ్లు కృంగిపోవద్దని సూచించారు. వచ్చే సంక్రాంతికి ముగ్గుల ఫోటోలు కాకుండా క్రీడలు కూడా నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులలో న్యాయం చేయాలి

## నీరుగార్చే ప్రయత్నంచేస్తున్న పోలీస్ లు

## సిపిని కలిసిన ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్‌సిటి (గోదావరిఖని), జనవరి 16 : రామగుండం, పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రధానంగా పెద్దపల్లి జిల్లాలో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల నమోదు అరెస్టుల విషయంలో కిందిస్థాయి పోలీసు అధికారులు అతి ఉత్సాహంతో నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని, బాధితులకు న్యాయం చేయాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర నాయకులు కోరారు. శుక్రవారం అంబేద్కర్ సంఘం నాయకులు సీపీ కి వినతిపత్రం అందజేశారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి జిల్లాలో అనేక మండలాలలో పెద్దపల్లి,గోదావరిఖని , 8 ఇంక్లైన్ కాలనీ,సుల్తానాబాద్, లాంటి ప్రధాన పోలీస్ స్టేషన్ ల పరిధిలో, ఇతర కులాల వారు ఎస్సీ ఎస్టీలను కులం పేరుతో దూషించి కొట్టిన తిట్టిన, ఆయా స్టేషన్లో బాధితులు ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడంలేదని కాలయాపన చేస్తున్నారని అన్నారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా దృష్టికి నాయకులు తీసుకువచ్చారు. ఎస్సీ ఎస్టీలు తమకు న్యాయం చేయాలని ఆయా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదులు చేస్తే మూడు నాలుగు రోజుల తర్వాత కేసు ఫైల్ చేస్తూ, ఎవరిపై అయితే ఫిర్యాదు చేశారో కులం పేరుతో తిట్టి కొట్టి దూషించిన వారికి కొంతమంది పోలీసు అధికారులు బాధించే వారికి అండగా ఉంటూ, వారి తోటి పోలీసులే కౌంటర్ కేసులు వేయిస్తున్నారని సీపీకి వివరించారు. పెద్దపల్లి జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లో నమోదైన ఎస్సీ ఎస్టీ కేసుల విషయంలో తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని, సీపీకి విజ్ఞప్తి చేశారు చట్ట ప్రకారం, బాధితులకు న్యాయం జరగాలని, బాధించే వారి పట్ల పోలీసు అధికారులు చూపిస్తున్న ఉదాసీనతపై చర్యలు తీసుకోవాలని కోరారు,, రామగుండం పోలీస్ కమిషనర్ ను కలిసిన వారిలో అంబేద్కర్ సంఘంనాయకులు మామిడిపల్లి బాపయ్య, బొంకూరి మధు, కొంకటి లక్ష్మణ్, మైస రాజేష్, లింగమల్ల శంకరయ్య, బచ్చలి రాజయ్య, అరికిల్ల రామలక్ష్మి, బహుజన్ సమాజ్ పార్టీ పెద్దపల్లి పట్టణ అధ్యక్షురాలు రామిళ్ళ శారద, ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు కనకం గణేష్, దళిత నాయకులు విష్ణు తదితరులు ఉన్నారు

## రామగుండం కార్పొరేషన్ రిజర్వేషన్‌లో

# గిరిజనులకు అన్యాయం వద్దు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రామగుండం, జనవరి 16 : రామగుండం కార్పొరేషన్ పరిధిలో రిజర్వేషన్ ప్రక్రియలో గిరిజనులకు అన్యాయం జరగకుండా చూడాలని రాష్ట్ర మున్సిపల్ కౌన్సిల్ ఫోరం చైర్మన్ రామ్ నాయక్ విజ్ఞప్తి చేశారు. గిరిజన జనాభా దామాష ప్రకారం రిజర్వేషన్లు పెంచే విధానాన్ని మున్సిపల్ శాఖ ఆలోచించాలని రామ్‌నాయక్ కోరారు. రామగుండం నోటి ఫైడ్ ఏరియా తర్వాత మున్సిపల్ ఎన్నికలు 34 వార్డులుగా ఉన్నప్పుడు గిరిజనులకు ఒకటి మాత్రమే రిజర్వేషన్ కేటాయించారని గుర్తు చేశారు. మళ్లీ పునర్‌నిర్మాణంలో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 50 డివిజన్లుగా ఏర్పడినప్పుడు ఎస్టీలకు ఒకటి మాత్రమే కేటాయిం చారని, ఇప్పుడు 60 డివిజనల్ ఏర్పడినప్పుడు గిరిజనులకు ఒకటి ఇవ్వడం లేదని ఎస్టీల రిజర్వేషన్ పెంచాలని కోరారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో నాలుగు శాతం ఉన్న గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ ప్రకారంగా రెండు డివిజన్లను కేటాయించాలని, ఈ విషయంలో రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి మున్సిపల్ శాఖ ప్రిన్సిపాల్ మున్సిపల్ శాఖ సెక్రటరీ ఎన్నికల కమిషనర్‌కు విజ్ఞప్తి చేస్తూ వినతి పత్రాలు సమర్పిస్తా సమర్పించనున్నామని రామ్ నాయక్ తెలిపారు.

# ఖనిలో ప్రారంభం కానున్న టేబుల్ టెన్నిస్ అకాడమీ




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్ జనవరి 16 : స్థానిక కళ్యాణ్ నగర్‌లోని త్రివేణి కాంప్లెక్స్‌లో గోదావరిఖని టేబుల్ టెన్నిస్ అకాడమీని ఈ నెల 18న ముఖ్య అతిథుల చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు అకాడమీ నిర్వాహకులు, చీఫ్ కోచ్ ఎస్కే సలీమ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలలో గోదావరిఖనికి సరైన ప్రాతినిధ్యం లేకపోవడం బాధాకరమని అన్నారు. మారుమూల ప్రాంతాలైన గర్రెపల్లి, సుల్తానాబాద్ వంటి ప్రాంతాల నుంచి కూడా పలువురు క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్నప్పటికీ, గోదావరిఖని ప్రాంతానికి ఆ అవకాశాలు అందుబాటులో లేకపోవడానికి ప్రధాన కారణం, సరైన క్రీడా వసతులు లేకపోవడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసే లక్ష్యంతోనే ఈ అకాడమీని ప్రారంభిస్తున్నామని, భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనే క్రీడాకారులను గోదావరిఖని నుంచి వెలుగులోకి తీసుకురావడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అకాడమీ ప్రారంభం అనంతరం అదే రోజు ఒక్కరోజు టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో అడ్వాన్స్ సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో మహిళలు, పురుషులకు ప్రత్యేకంగా, అలాగే అండర్-11, అండర్-13, అండర్-15 వయో వర్గాలకు కంబైన్డ్ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ముందస్తు రిజిస్ట్రేషన్ చేసుకున్న క్రీడాకారులు మాత్రమే పోటీలలో పాల్గొనడానికి అర్హులని తెలిపారు. సింగిల్స్ విభాగానికి రూ.500, డబుల్స్ విభాగానికి రూ.1000 ఎంట్రీ ఫీజుగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో సలీమ్‌తో పాటు క్రీడాకారులు మేకల క్రాంతికుమార్, గడ్డం రమేష్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# వార్డుల సమస్యలపై ఎమ్మెల్యే ఆదేశాలు

## అధికారులకు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆదేశం




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, జనవరి16 : భువనగిరి పట్టణంలోని 35వ, 18వ వార్డుల్లో నెలకొన్న ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. 35వ వార్డు కౌన్సిలర్ తంగళ్లపల్లి రవికుమార్, 18వ వార్డు ఇంచార్జ్ ఎడమ ప్రవీణ్ ఎమ్మెల్యేను కలిసి తమ వార్డుల్లోని సమస్యలను వివరించారు. ఆర్‌బీ నగర్ కామన్ రోడ్ అభివృద్ధి, 7,18,35, 19 వార్డులకు నీటిసరఫరా కోసం గుట్టపైన ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం, డ్రైనేజీ సమస్యలు, కరెంటు పోల్స్‌కు సంబంధించిన ఇబ్బందులు ఉన్నట్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత శాఖల అధికారులను వెంటనే పిలిపించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు తీసుకుని సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు.

# ఈ విమానాలు టైమ్‌కు వస్తాయ్..

## ఇండిగో స్థానం తెలుసా..?



గగనతల పరిమితులు, సిబ్బంది కొరత, విమానయాన రంగంలోని సవాళ్లను దాటుకొని ఎయిర్‌లైన్స్ సంస్థలు సమయానికి ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్నాయి . అలా అత్యంత సమయపాలన పాటిస్తోన్న సంస్థల జాబితాను ఏవియేషన్ అనలిటిక్స్ సంస్థ సిరియం వెల్లడించింది. గత ఏడాదికి సంబంధించి ఆన్‌టైమ్ ఫెర్మామెన్స్ రివ్యూను విడుదల చేసింది. ఏరోమెక్సికో వరుసగా రెండోఏడాది అత్యంత సమయ పాలన కలిగిన ఎయిర్‌లైన్స్‌గా అగ్రస్థానంలో నిలిచింది ఖతర్ ఎయిర్‌లైన్స్..84.42 శాతం ఆన్‌టైమ్‌తో ప్లాటినం విన్నర్‌గా నిలిచింది. ఆసియాపసిఫిక్ ప్రాంతంలో ఫిలిప్పీన్ ఎయిర్‌లైన్స్ ప్రథమ స్థానంలో నిలిచింది. 83.12 శాతం ఆన్‌టైమ్ ప్రదర్శన చూపింది. ఇదే ప్రాంతంలో ఇండిగో ఆరో స్థానంలో ఉంది. 78.12 శాతం ఆన్‌టైమ్ ప్రదర్శన నమోదు చేసింది. ఇటీవల ఇండిగో విమానయాన సంస్థ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. సిబ్బంది కొరత వంటి ఆపరేషనల్ సమస్యలతో వందల సంఖ్యలో విమానాలను రద్దు చేసింది. దాంతో భారీ సంఖ్యలో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

# 75%శాతం సంపాదనను ఇచ్చేస్తా

## కుమారుడి మరణం వేళ వేదాంతా ఛైర్మన్ పునరుద్ఘాటన



బిలియనీర్, గనుల రంగ దిగ్గజ సంస్థ వేదాంతా అధిపతి అనిల్ అగర్వాల్ కుమారుడు అగ్నివేశ్ అగర్వాల్ (49) హఠాత్తుగా మృతి చెందిన సంగతి తెలిసిందే . కుమారుడి మరణంతో తన జీవితంలో చీకట్లు కమ్మాయని అనిల్ ఎక్స్ వేదికగా భావోద్వేగపూరిత పోస్ట్ పెట్టారు. అలాగే తమ సంపాదనలో 75 శాతాన్ని సమాజానికి ఇచ్చేస్తానని పునరుద్ఘాటించారు. ''కుమారుడు అగ్నివేశ్ ఎంతో త్వరగా మమ్మల్ని విడిచివెళ్లిపోయాడు. అతడి వయసు 49 ఏళ్లే. భవిష్యత్తు గురించి ఎన్నో కలలుండేవి. అమెరికాలో జరిగిన స్కీయింగ్ ప్రమాదంలో గాయపడిన అగ్నివేశ్, ఆసుపత్రిలో కోలుకుంటున్న సమయంలో కార్డియాక్ అరెస్ట్ కావడంతో మమ్మల్ని విడిచివెళ్లిపోయాడు. జీవితంలో ఎన్ని విజయాలు సాధించినా.. ఎంతో ఒదిగి ఉండేవాడు. ఒక ఫ్రెండ్‌లా నా వెంటే ఉండేవాడు. దేశం స్వావలంబన దిశగా పయనిస్తోందని బలంగా నమ్మేవాడు. మా సంపాదనలో 75 శాతం సమాజానికి తిరిగిస్తానని అగ్నికి వాగ్దానం చేశాను. ఆ వాగ్దానాన్ని మరోసారి పునరుద్ఘాటిస్తున్నాను. అయితే, నువ్వు లేకుండా ఈ దారిలో ఎలా నడవాలో నాకు తెలియడం లేదు. కానీ నీ ఆలోచనల్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తాను'' అని రాసుకొచ్చారు. అనిల్‌కు అగ్నివేశ్‌తో పాటు కుమార్తె ప్రియ ఉన్నారు. ఆమె వేదాంతా లిమిటెడ్ బోర్డు మెంబర్. హిందుస్థాన్ జింక్ లిమిటెడ్‌కు ఛైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. వేదాంతా అనుబంధ సంస్థ తల్వండి సోబో పవర్ లిమిటెడ్‌కు అగ్నివేశ్ ఛైర్మన్. అనిల్ అగర్వాల్ నికర సంపద 330 కోట్ల డాలర్లు.

**ప్రధాని మోదీ సంతాపం..**

అగ్నివేశ్ అకాల మరణంపై ప్రధాని నరేంద్రమోదీ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఈ క్లిష్ట సమయంలో భగవంతుడు మీ కుటుంబానికి ధైర్యమివ్వాలని ప్రార్థిస్తున్నానంటూ అనిల్ అగర్వాల్ పోస్టుపై స్పందించారు.




# ఒప్పో నుంచి రెనో 15 సిరీస్ స్మార్ట్‌ఫోన్లు..

## తొలిసారి మినీ




ఒప్పో తన రెనో సిరీస్‌లో కొత్త ఫోన్లను దేశీయ మార్కెట్‌లో లాంచ్ చేసింది. 2024లో లాంచ్ చేసిన రెనో 14 సిరీస్‌కు కొనసాగింపుగా 15 సిరీస్‌లో నాలుగు ఫోన్లను తీసుకొచ్చింది. ఒప్పో రెనో 15, ఒప్పో రెనో 15 ప్రో, ఒప్పో రెనో 15 ప్రో మినీ, రెనో 15సీ పేరిట వీటిని విడుదల చేసింది. రెనో సిరీస్‌లో కొత్తగా మినీ పేరిట కొత్త మోడల్‌ను ప్రకటించడం ఇదే తొలిసారి. ఈ ఫోన్లు ఆండ్రాయిడ్ 16తో కూడిన కలర్ ఓఎస్ 16తో పనిచేస్తాయి. ఇక పూర్తి వివరాల్లోకి వెళితే..

**15ప్రో మోడళ్ల వివరాలు..**

* ఒప్పో రెనో 15 ప్రోలో 6.78 అంగులాల ఫుల్ హెచ్‌డీ+ ఎల్‌పీటీఓ అమోలెడ్ డిస్‌ప్లే ఇచ్చారు. ఇది 120Hz రిఫ్రెష్ రేటు, 1800 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్‌తో వస్తోంది. కార్నింగ్ గొరిల్లా విక్టస్ 2 ప్రొటెక్షన్ ఆచ్చారు.
* ఒప్పో రెనో 15 ప్రో మినీ 6.32 అంగుళాల 1.5కె ఎల్‌టీపీఎస్ అమోలెడ్ స్క్రీన్‌తో వస్తోంది. 120Hz రిఫ్రెష్ రేటు, 1800 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్‌తో వస్తోంది. కార్నింగ్ గొరిల్లా 7 ప్రొటెక్షన్‌తో తీసుకొచ్చారు. ఈ రెండు ఫోన్లూ మీడియాటెక్ డైమెన్‌సిటీ 8450తో వస్తున్నాయి.
* రెండింట్లోనూ ట్రిపుల్ కెమెరా సెటప్ ఉంది. 200 ఎంపీ ప్రధాన కెమెరా, 50 ఎంపీ అల్ట్రా వైడ్ యాంగిల్ కెమెరా, 50 ఎంపీ టెలిఫొటో లెన్స్ అమర్చారు. ముందువైపు 50 ఎంపీ సెల్ఫీ కెమెరా ఇచ్చారు. ఇన్‌డిస్‌ప్లే ఫింగర్ ప్రింట్ సెన్సర్, ఐపీ 68+ ఐపీ 69 రేటింగ్‌తో వస్తున్నాయి. రెనో 15ప్రోలో 6,500 ఎంఏహెచ్ బ్యాటరీ ఇస్తుండగా.. మినీలో 6,200ఎంఏహెచ్ బ్యాటరీ ఉంది. 80W సూపర్‌వూక్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తాయి. 50W వైర్‌లెస్ ఛార్జింగ్ సదుపాయం కూడా ఉంది.

**ఒప్పో రెనో 15 స్పెసిఫికేషన్లు**

ఒప్పో రెనో 15లో 6.59 అంగుళాల ఎల్‌టీపీఎస్ అమోలెడ్ డిస్‌ప్లే ఇచ్చారు. 120Hz రిఫ్రెష్ రేటు, 1200 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్, కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 7ఐ ప్రొటెక్షన్ ఉన్నాయి. స్నాప్‌డ్రాగన్ 7 జనరేషన్ 4 చిప్‌సెట్ ఇచ్చారు. 50 ఎంపీ ప్రధాన కెమెరా, 50 ఎంపీ పెరిస్కోపిక్ టెలిఫొటో లెన్స్, 8 ఎంపీ అల్ట్రా వైడ్ యాంగిల్ సెన్సర్ ఇచ్చారు. 50 ఎంపీ ఫ్రంట్ ఫేసింగ్ కెమెరా ఇచ్చారు. ఇందులోనూ 6500 ఎంఏహెచ్ బ్యాటరీ, 80W ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయం ఉంది. రెనో 15సీ 7000 ఎంఏహెచ్ బ్యాటరీతో వస్తోంది. ఇందులో స్నాప్‌డ్రాగన్ 6జనరేషన్ 1 చిప్ అమర్చారు.

**ధరల వివరాలు..**

ఒప్పో 15 సిరీస్ ఫోన్లు ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, ఒప్పో ఇండియా ఆన్‌లైన్ స్టోర్లలో లభ్యమవుతాయి. రెనో 15 5జీ ధర రూ.45,999 నుంచి ప్రారంభమవుతుంది. ఒప్పో 15 ప్రో ధర రూ.67,999, మినీ ధర రూ.59,999 నుంచి ప్రారంభమవుతుంది. ఒప్పో రెనో 15సీ బేస్ వేరియంట్ రూ.34,999కి లభ్యమవుతుంది. జనవరి 13 నుంచి విక్రయాలు ప్రారంభం కానున్నాయి. ఒక్క రెనో 15సీ మాత్రం ఫిబ్రవరిలో అందుబాటులోకి రానుంది.




# ఏంటి తమ్ముడు ఇది

## వైభవ్ సూర్యవంశీ బ్యాటింగ్‌కు అశ్విన్ ఫిదా



కొన్ని రోజులుగా దేశవాళీ, అండర్19 క్రికెట్లో శతకాల మోత మోగిస్తూ పరుగుల వరద పారిస్తున్న యువ సంచలనం వైభవ్ సూర్యవంశీని భారత మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ పొగడ్తలతో ముంచెత్తాడు. గత 30 రోజుల్లో వైభవ్ చేసిన భారీ స్కోర్లను పేర్కొంటూ ఏంటి తమ్ముడు ఇది అంటూ ఆశ్చర్యం వ్యక్తంచేశాడు. ఐపీఎల్‌లో వైభవ్ వీరబాదుడు చూసేందుకు ఆత్రుతతో ఉన్నట్లు తెలిపాడు. '171(95), 50(26), 190(84), 68(24), 108*(61), 46(25) & 127(74). గత 30 రోజుల్లో వైభవ్ సూర్యవంశీ దేశవాళీ, అండర్ 19 క్రికెట్‌లో సాధించిన స్కోర్లలో ఇవి కొన్ని మాత్రమే. ఏంటి తమ్ముడు? ఈ శాంపిల్ సరిపోతుందా? లేదా మరింత డోస్ పెంచబోతున్నావా? ఈ చిచ్చర పిడుగు 14 ఏళ్ల వయసులో ఎలా విధ్వంసం సృష్టిస్తున్నాడో మీరు మాటల్లో వివరించలేరు' అంటూ అశ్విన్ ఎక్స్‌లో రాసుకొచ్చాడు. బుధవారం సౌతాఫ్రికా అండర్19 జట్టుతో జరిగిన మూడో యూత్ వన్డేలో వైభవ్ (127; 74 బంతుల్లో 10 సిక్స్‌లు, 9 ఫోర్లు) చెలరేగాడు. దీంతో యూత్ వన్డే క్రికెట్‌లో సెంచరీ చేసిన అతి పిన్నవయస్కుడైన అండర్19 కెప్టెన్‌గా ఘనత సాధించాడు. జనవరి 15 నుంచి ప్రారంభం కానున్న U19 వరల్డ్ కప్, తర్వాత జరిగే ఐపీఎల్‌లో వైభవ్ (Vaibhav Suryavanshi) ఆటను చూడటానికి ఆత్రుతగా ఉన్నానని అశ్విన్ పేర్కొన్నాడు. 'U19 వరల్డ్ కప్‌లో అతను చెలరేగుతాడని అంతా భావిస్తున్నారు. రాజస్థాన్ రాయల్స్ నుంచి సంజు శాంసన్ వెళ్లిపోవడంతో వైభవ్ ఐపీఎల్‌లో ఓపెనర్‌గా తొలిసారి పూర్తి సీజన్ ఆడనున్నాడు. రాబోయే నాలుగు నెలల్లో ఈ కుర్రాడి ఆటను చూడటానికి ఆత్రుతగా ఎదురుచూస్తున్నాను' అని యాష్ వివరించాడు. గతేడాది ఐపీఎల్ సీజన్ ఆఖర్లో అరంగేట్రం చేసిన వైభవ్.. రాజస్థాన్ రాయల్స్ ఇచ్చిన అవకాశాన్ని పూర్తిగా అందిపుచ్చుకున్నాడు. గుజరాత్ టైటాన్స్‌పై సంచలన రీతిలో 35 బంతుల్లోనే మూడంకెల స్కోరును అందుకున్నాడు. ఐపీఎల్ 2026 కోసం ఈ కుర్రాడిని రాజస్థాన్ రూ.1.10 కోట్లకు రిటైన్ చేసుకుంది.


# ఒక్క పరుగు తేడాతో పంజాబ్ సంచలన విజయం..

## సర్ఫరాజ్ మెరుపులు వృథా

జైపూర్: విజయ్ హజారే ట్రోఫీ లో పంజాబ్ సంచలన విజయం సాధించింది. గెలుపు ఆశల్లేని స్థితి నుంచి చివరి వరకు గొప్పగా పోరాడి ఒక్క పరుగు తేడాతో గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ 45.1 ఓవర్లలో 216 పరుగులకు ఆలౌటైంది. లక్ష్యఛేదనలో ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన ముంబయి సునాయసంగా విజయం సాధించేలా కనిపించింది. కానీ, వరుసగా వికెట్లు కోల్పోయి 26.2 ఓవర్లలో 215 పరుగులకు ఆలౌటైంది. సర్ఫరాజ్ ఖాన్ (62; 20 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్స్‌లు) మెరుపులు వృథా అయ్యాయి. పంజాబ్ కెప్టెన్ అభిషేక్ శర్మ వేసిన ఓవర్‌లో సర్ఫరాజ్ వరుసగా 6,4,6,4,6,4 బాదేశాడు. అతను 15 బంతుల్లోనే అర్ధ శతకం అందుకున్నాడు. టోర్నీ చరిత్రలో ఇదే ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ. కెప్టెన్ శ్రేయస్ (45; 34 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు.

# తిలక్ వర్మకు శస్త్రచికిత్స..

## T20 WC ముంగిట భారత్‌కు షాక్



ఐసీసీ టీ20 ప్రపంచ కప్ 2026కు ముందు టీమ్ఇండియాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. బ్యాటర్ తిలక్ వర్మకు పొట్ట కింది భాగంలో గాయమైంది. దీంతో అతనికి శస్త్రచికిత్స చేశారు. తిలక్ కోలుకోవడానికి ఇంకా కొన్ని వారాలు పట్టొచ్చు. ఈ క్రమంలోనే జనవరి 21 నుంచి న్యూజిలాండ్‌తో జరగనున్న ఐదు టీ20ల సిరీస్‌కు ఈ హైదరాబాదీ క్రికెటర్ దూరమయ్యాడు. ప్రస్తుతం జరుగుతున్న విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాద్ మ్యాచ్‌లు రాజ్‌కోట్‌లో జరుగుతున్నాయి. హైదరాబాద్ జట్టుకు తిలక్ వర్మ నాయకత్వం వహిస్తుండగా.. ఇటీవల అతనికి పొట్ట కింది భాగంలో తీవ్రమైన నొప్పి వచ్చింది. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లి స్కానింగ్ చేయించారు. తక్షణమే శస్త్రచికిత్స చేయాలని వైద్యులు సూచించారు. దీంతో తిలక్ కు సర్జరీ చేశారు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉంది. దీంతో మూడు, నాలుగు వారాలు ఆటకు దూరమయ్యే అవకాశం ఉంది. ఫలితంగా కివీస్‌తో టీ20 సిరీస్‌కు ఈ కుర్రాడు అందుబాటులో ఉండడు. అతని స్థానంలో ఇప్పటివరకు మరొకరిని జట్టులోకి తీసుకోలేదు. ఏది ఏమైనా కొంతకాలంగా జట్టులో కీలక సభ్యుడిగా ఉన్న తిలక్ టీ20 ప్రపంచ కప్ ముందు గాయపడటం టీమ్ఇండియాకు భారీ దెబ్బే. ఎందుకంటే అతను వరల్డ్ కప్‌లో ఆడినా ఆరంభంలో కొన్ని మ్యాచ్‌లకు అందుబాటులో ఉండకపోవచ్చు. పాకిస్థాన్‌తో జరిగిన 2025 ఆసియా కప్ ఫైనల్‌లో ఈ హైదరాబాదీ బ్యాటర్ అదరగొట్టాడు. 53 బంతుల్లో 69 పరుగులు చేసి అజేయంగా నిలిచి భారత్‌కు అద్భుతమైన విజయాన్ని అందించాడు.

# మద్యం మత్తులో గొడవ..

## హ్యారీ బ్రూక్‌పై చేయిచేసుకున్న బౌన్సర్



ఇంగ్లాండ్ వన్డే, టీ20 కెప్టెన్ హ్యారీ బ్రూక్ మద్యం మత్తులో ఓ నైట్‌క్లబ్ వద్ద గొడవకు దిగాడు. దీంతో బ్రూక్‌పై బౌన్సర్ చేయిచేసుకున్నాడు. గతేడాది నవంబర్ 1న న్యూజిలాండ్‌తో మూడో వన్డేకు ముందు రోజు ఈ ఘటన జరగ్గా.. ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మ్యాచ్‌కు ముందు రోజు రాత్రి హ్యారీ బ్రూక్ తన సహచర క్రికెటర్లు జాకబ్ బెతెల్, గస్ అట్కిన్సన్‌తో కలిసి వెల్లింగ్‌టన్‌లో ఓ నైట్ క్లబ్‌కు వెళ్లాడు. మద్యం తాగి ఉన్నాడని అనుమానించి బ్రూక్‌ను లోపలికి అనుమతించలేదు. ఈ క్రమంలో తీవ్ర వాగ్వాదం జరగ్గా.. ఇంగ్లాండ్ కెప్టెన్‌పై బౌన్సర్ చేయిచేసుకున్నాడు. ఈ వివాదంపై హ్యారీ బ్రూక్ స్వయంగా టీమ్ మేనేజ్‌మెంట్‌కు వివరణ ఇచ్చాడని సమాచారం. ఘటనపై విచారణ చేపట్టిన ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు బ్రూక్‌కు 'ఫైనల్ వార్నింగ్' ఇచ్చి దాదాపు 30,000 పౌండ్లు జరిమానాగా విధించింది. బ్రూక్ తన ప్రవర్తనకు క్షమాపణలు చెప్పాడు. 'నా చర్యలు తప్పు అని నేను పూర్తిగా అంగీకరిస్తున్నాను. ఇది నాకు, మా జట్టుకు ఇబ్బంది కలిగించింది,. ఇంగ్లాండ్‌కు ప్రాతినిధ్యం వహించడం గొప్ప గౌరవం. జరిగిన దాన్ని నేను తీవ్రంగా పరిగణిస్తాను. సహచరులు, కోచ్‌లు, మద్దతుదారులను నిరాశపరిచినందుకు నేను తీవ్రంగా చింతిస్తున్నాను' అని ఒక ప్రకటన విడుదల చేశాడు. యాషెస్ సిరీస్ కోసం ఆస్ట్రేలియా టూర్‌కు వెళ్లిన ఇంగ్లాండ్ ప్లేయర్లు ఫుల్లుగా మద్యం తాగి ఎంజాయ్ చేసినట్లు వార్తలొచ్చాయి. రెండో, మూడో టెస్టుకు మధ్య లభించిన 9 రోజుల విరామంలో నోసా బీచ్ రిసార్ట్‌లో మద్యం మత్తులో మునిగితేలారని కథనాలు వచ్చాయి.

# ఊపిరికి ఊపిరి

8 ఆహారం, నీరు లేకుండా కొద్దిరోజులు బతకొచ్చేమో! కానీ శ్వాస తీసుకోకుండా క్షణమైనా ఉండలేం. తల్లి కడుపులోంచి బయటపడ్డాక, తొలిసారి కెవ్వున ఏడ్చినప్పటి నుంచీ ఊపిరి తిత్తులు ఈ పనిలోనే నిమగ్నమవుతాయి. ఇంతటి కీలకమైన అవయవాలు కోలుకోలేనంతగా దెబ్బతింటే? చికిత్సలేవీ పనిచేయకపోతే? ఇక్కడే ఊపిరితిత్తుల మార్పిడి (లంగ్ ట్రాన్స్‌ప్లాంటేషన్) ఆదుకుంటోంది. చెడిపోయిన ఊపిరితిత్తులను తొలగించి, వాటి స్థానంలో జీవన్మృతుల (బ్రెయిన్‌డెడ్) నుంచి సేకరించిన ఆరోగ్యకరమైన ఊపిరితిత్తులను అమర్చే ఈ ప్రక్రియ నిజంగా పునర్జన్మనే ప్రసాదిస్తుంది. ఆగిపోతున్న ఊపిరికి తిరిగి ఊపిరి పోస్తుంది.

శరీరంలోని కణాలు, కణజాలాలన్నింటికీ ఆక్సిజన్ అవసరం. దీన్ని శ్వాస ద్వారా రక్తంలోకి చేర్చేవి ఊపిరితిత్తులే. అంతేకాదు.. కణాలు ఆక్సిజన్‌ను వాడుకున్నాక వాటి నుంచి పుట్టుకొచ్చే కార్బన్ డయాక్సైడ్ వంటి వాయువులను బయటకు పోయేలా చేసేవీ ఇవే. సాధారణంగా మనం నిమిషానికి 12 నుంచి 20 సార్లు శ్వాసను లోపలికి తీసుకొని, బయటకు వదులుతుంటాం. ఇదో నిరంతర ప్రక్రియ. ఇది ఏమాత్రం మందగించినా తగినంత ఆక్సిజన్ అందక అవయవాలన్నీ చతికిల పడతాయి. ఒకప్పుడు ఊపిరితిత్తులు మందులకు, చికిత్సలకు లొంగని విధంగా దెబ్బతింటే చేయటానికేమీ ఉండేది కాదు. ఇప్పుడు ఊపిరితిత్తుల మార్పిడి ఒక వరంగా మారింది. మనదేశంలో ఏటా వేలాది మందికి దీని అవసరం ఉంటున్నా 400 మందైనా దీనికి నోచుకోవటం లేదు. సరిపడినన్ని అవయవాలు దొరక్కపోవటం, అవయవదానం మీద అంతగా అవగాహన లేకపోవటం, చికిత్సకు ఎక్కువ ఖర్చు కావటం వంటివన్నీ దీనికి కారణమవుతున్నాయి. అంతేకాదు.. తీవ్ర ఊపిరితిత్తుల జబ్బులతో బాధపడేవారిలో చాలామందికి వీటిని మార్పిడి చేసే అవకాశం ఉందన్న సంగతే తెలియకపోవటం గమనార్హం.

ఎవరికి అవసరం?

క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ (సీవోపీడీ), సిస్టిక్ ఫైబ్రోసిస్, ఇంటర్‌స్టీషియల్ లంగ్ డిసీజ్ (ఐఎల్‌డీ), పల్మనరీ ఫైబ్రోసిస్, పల్మనరీ హైపర్‌టెన్షన్, క్షయ మూలంగా ఊపిరితిత్తులు క్షీణించటం, బ్రాంకీఎక్టసిస్ (ఊపిరితిత్తులు బుడగల్లా మారటం), లింఫాంజియోలియోమయోమాటోసిస్ (ల్యామ్) వంటి సమస్యలు ఊపిరిత్తులను గణనీయంగా దెబ్బతీస్తాయి. రుమటాయిడ్, అనుసంధాన కణజాల సమస్యలతోనూ వీటి సామర్థ్యం క్షీణిస్తుంటుంది. దీంతో శ్వాస తీసుకోవటం కష్టమవుతుంది. ఇవి కొన్నిసార్లు మందులకు, చికిత్సలకు లొంగలేనంత తీవ్రంగా మారొచ్చు. ఫలితంగా కొద్ది దూరం నడిచినా ఆయాసం ముంచుకొస్తుంది. కొందరికి విశ్రాంతి తీసుకుంటున్నా ఆయాసం రావొచ్చు. ఇలాంటివారికి ముక్కు ద్వారా కృత్రిమంగా ఆక్సిజన్ ఇవ్వాల్సిన పరిస్థితి తలెత్తుతుంది. మొదట్లో ఒకట్రెండు లీటర్ల ఆక్సిజన్ అవసరమైతే.. రాన్రానూ పెరుగుతూ వస్తుంటుంది. కొన్నిసార్లు ఇదీ సరిపోకపోవచ్చు. ఆసుపత్రిలో చేర్చి, వెంటిలేటర్ సాయంతో చికిత్స చేయాల్సి రావొచ్చు. ఇలాంటివారికి ఊపిరితిత్తుల మార్పిడి ఎంతగానో ఉపయోగపడుతుంది. మరికొంత కాలం జీవించటానికిది తోడ్పడుతుంది. ముఖ్యంగా హాయిగా జీవించటం సాధ్యమవుతుంది.



మార్పిడి ఎలా చేస్తారు?

జీవన్మృతుల ఊపిరితిత్తులు అందుబాటులో ఉన్నాయని తెలిసినప్పుడు ముందుగా అవి ఆరోగ్యంగా ఉన్నాయో, లేవో పరిశీలిస్తారు. అలాగే జీవన్మృతులు, ఊపిరితిత్తులను గ్రహించేవారి శరీర ఎత్తు, బరువు, వీటి మధ్య నిష్పత్తి (బీఎంఐ), రక్తం గ్రూపులనూ చూస్తారు. ఎత్తు, బరువుల విషయంలో 10% అటూఇటైనా ఇబ్బందేమీ ఉండదు గానీ రక్తం గ్రూపు సరిపోవటం ముఖ్యం. అవయవం అన్నివిధాలా సరిపోతుందని నిర్ణయించాక మార్పిడికి ఏర్పాట్లు చేస్తారు.

రక్త సరఫరా లేకపోతే ఊపిరితిత్తి కొన్ని గంటల్లోనే కుళ్లిపోవటం మొదలెడుతుంది. అందువల్ల దాతల శరీరం నుంచి తీసిన తర్వాత ప్రత్యేక ద్రావణంతో చల్లబరుస్తారు. అవి ముడుచుకుపోకుండా 100% ఆక్సిజన్‌తో నిండిన గాలిని నింపి, వాయునాళాన్ని మూసేస్తారు. తర్వాత ప్రత్యేకమైన ఐస్‌బ్యాగ్‌లో భద్రపరచి తరలిస్తారు. మార్పిడి శస్త్రచికిత్సకు ఎంత లేదన్నా నాలుగు గంటలైనా పడుతుంది. దీన్ని కూడా దృష్టిలో పెట్టుకొని ఊపిరితిత్తులను తరలించే సమయాన్ని అంచనా వేసుకోవాలి. మొత్తమ్మీద 7-9 గంటల్లోపు మార్పిడి ప్రక్రియ పూర్తయ్యేలా చూడటం ముఖ్యం.

ముక్కు ద్వారా గాలిని లోపలికి చేర్చే శ్వాసనాళం, గుండె నుంచి చెడు రక్తాన్ని తీసుకొచ్చే ధమని, ఊపిరితిత్తుల నుంచి ఆక్సిజన్‌తో నిండిన రక్తాన్ని మోసుకెళ్లే సిర.. ఈ మూడు చోట్ల కత్తిరించి దాత నుంచి ఊపిరితిత్తిని తీస్తారు. అలాగే దీన్ని అమర్చే వారిలోనూ ఈ మూడు భాగాల్లో కత్తిరించి చెడిపోయిన ఊపిరితిత్తిని తొలగించి.. దాని స్థానంలో దాత అవయవాన్ని అమరుస్తారు.

ఊపిరితిత్తుల మార్పిడి ఏ వయసులోనైనా చేయొచ్చు గానీ కొన్ని పరిమితులు లేకపోలేదు. శారీరకంగా ఫిట్‌గా ఉండి, ఇతర అవయవాలన్నీ బాగుండి ఒక్క ఊపిరితిత్తులే దెబ్బతింటే 80 ఏళ్ల వారికీ మార్పిడి చేయొచ్చు. 15 ఏళ్లలోపు వారికైతే లోబ్ మార్పిడి చేస్తారు.

జాగ్రత్తలు తప్పనిసరి

ఊపిరితిత్తుల మార్పిడి చేయించుకున్నవారు 5-10 ఏళ్ల వరకూ హాయిగా జీవించే అవకాశముంటుంది. సుమారు 30% మంది పదేళ్ల వరకూ జీవిస్తారు. మరికొందరు 10-15 ఏళ్ల వరకూ జీవించొచ్చు. అయితే వీళ్లు కొన్ని జాగ్రత్తలు తీసుకోవటం తప్పనిసరి.

క్రమం తప్పకుండా మందులు వాడుకోవాలి. లేకపోతే ఎప్పుడైనా శరీరం అవయవాన్ని తిరస్కరించే ప్రమాదముందని గుర్తించాలి.

రోగనిరోధకశక్తిని అణచిపెట్టే మందుల మూలంగా బ్యాక్టీరియా, ఫంగల్, వైరల్ ఇన్‌ఫెక్షన్లు సోకే ముప్పు ఎక్కువగా ఉంటుంది. కాబట్టి వీటి బారినపడకుండా చూసుకోవాలి.

వీలైనంత వరకూ సినిమా హాళ్లు, జాతరల వంటి జనం గుమిగూడే చోట్లకు వెళ్లొద్దు. ఒకవేళ వెళ్తే ఎన్95 మాస్క్ ధరించాలి.

ఇంట్లోనైనా, బయటైనా ఇన్‌ఫెక్షన్ లక్షణాలు గలవారికి దూరంగా ఉండాలి.

స్విమింగ్ పూల్స్‌లో ఈత కొట్టొద్దు.

ఆరోగ్యకరమైన, అప్పుడే వండిన ఆహారం తినాలి.

మానసిక ప్రశాంతత కోసం ధ్యానం, ప్రాణాయామం వంటివి చేయాలి.

మరీ తీవ్రం కానప్పుడే..

సరైన సమయంలో ఊపిరితిత్తుల మార్పిడి చేయటమూ ముఖ్యమే. లేకపోతే క్రమంగా కృశిస్తూ వస్తుంటారు. రక్తంలో ఆక్సిజన్ మోతాదులు తగినంత లేకపోవటం వల్ల కాలేయం, మూత్రపిండాలు, గుండె, మెదడు వంటి కీలక అవయవాల సామర్థ్యమూ తగ్గుతూ వస్తుంది. కాబట్టి ఊపిరితిత్తులు కోలుకోలేని స్థితికి చేరుకుంటున్నాయని గుర్తించిన సమయంలోనే మార్పిడి చేయటం ఉత్తమం. దీంతో కీలక అవయవాలను కాపాడుకోవచ్చు. చివరిదశలో మార్పిడి చేస్తే అంత ఎక్కువ ప్రయోజనం ఉండకపోవచ్చు.

ఒకటా? రెండా?

దాదాపు 95% మందికి రెండు ఊపిరితిత్తులనూ మార్పిడి చేస్తారు. ఒక ఊపిరితిత్తినే మార్పిడి చేస్తే దీర్ఘకాలంలో తగినంత ఆక్సిజన్ లభించదు. అయితే సీవోపీడీ వంటి సమస్యలు గలవారికి ఒక తిత్తిని మార్పిడి చేసినా సరిపోతుంది. కొన్ని కారణాల వల్ల కొందరికి అప్పటికే ఒక ఊపిరితిత్తిని తీసేసి ఉండొచ్చు. ఇలాంటివారికీ ఒక తిత్తినే మార్పిడి చేస్తారు.

జీవన్మృతులు పొడవుగా, బరువుగా ఉండి.. గ్రహీతలు పొట్టిగా, తక్కువ బరువుతో ఉన్నట్టయితే పై భాగాన్ని ఒకరికి, కింది భాగాన్ని మరొకరికి మార్పిడి (లోబో ట్రాన్స్‌ప్లాంటేషన్) చేసే అవకాశముంది. అప్పుడు ఇద్దరికి ప్రయోజనం కలుగుతుంది.

తిరస్కరించకుండా..

అవయవ మార్పిడిలో ఎదురయ్యే ప్రధాన సమస్య గ్రహీత శరీరం దాన్ని తిరస్కరించటం. అందుకే మార్పిడి చేసే సమయంలోనే పెద్దమొత్తంలో రోగనిరోధకశక్తిని అణచిపెట్టే మందులు ఇస్తారు (ఇండక్షన్ థెరపీ). వీరికి ముందుగా ప్యానెల్ రియాక్టివ్ యాంటీబాడీస్ పరీక్ష చేసి.. దాత నుంచి గ్రహించిన అవయవ యాంటీజెన్ల మీద దాడిచేసే యాంటీబాడీల శాతాన్ని గుర్తిస్తారు. ఇది 0-10 ఉంటే ఒక మాదిరి రోగనిరోధకశక్తిని అణచిపెట్టే మందులే సరిపోతాయి. అదే 25 కన్నా మించితే యాంటీథైమోగ్లోబులిన్ (ఏటీజీ) అవసరమవుతుంది. మరీ అధికంగా ఉంటే ఆల్టెజుమాబ్ ఇవ్వాల్సి ఉంటుంది. కొందరికి 40, 50% కూడా మించి పోవచ్చు. ఇలాంటివారికి ప్లాస్మా ఫెరెసిస్ చేసి.. రక్తనాళం ద్వారానూ ఇమ్యునోగ్లోబులిన్లు ఇస్తారు. తక్షణం అవయవం తిరస్కరణకు గురికాకుండా చూడటానికిది కీలకం. మార్పిడి అనంతరమూ టాక్రోలిమస్, ఎంఎంఎఫ్, స్టెరాయిడ్ మందులను క్రమం తప్పకుండా వేసుకోవాల్సి ఉంటుంది.



# పర్‌ఫెక్షన్‌తో ఇదేం పరేషాన్?

ఆయా పనులను ఒక పద్ధతిలో చేయటం, ఎప్పుడు చేసినా వాటిని సరిగ్గా అలాగే చేయటం పర్‌ఫెక్షన్ గుణం గలవారి స్వభావం. ఏమాత్రం మార్పులనూ సహించకపోవటం వీరి నైజం. తమవరకైతే ఏమో అనుకోవచ్చు, ఇతరులూ అలాగే చేయాలని భావించటమే సమస్య. మీరు దీంతోనే సతమత మవుతున్నారు. మంచి విషయం ఏంటంటే- మీరు సమస్యని గుర్తించటం. మీ వ్యక్తిత్వ గుణం కారణంగా ఇతరులతో గొడవ పడటం, మీలో మీరు ఘర్షణ పడటం, భార్య బాధపడుతున్నారని తెలుసుకోవటం మంచి పరిణామమే. కాకపోతే అదుపులో పెట్టుకోక పోవటమే ఇబ్బందిగా పరిణమిస్తోందని గుర్తించండి. ముందుగా మీరు సమస్యను క్షుణ్నంగా అర్థం చేసుకోవటానికి ప్రయత్నించండి. వ్యక్తిత్వ గుణం వల్ల అలా చేయటం, చేయాలని అనిపించటం మీకు సబబుగానే అనిపించొచ్చు. కానీ ఇతరులకు చాలా కష్టం కలిగిస్తుంది. మీ భార్య కూడా బాధ పడుతున్నారంటే మీ వ్యక్తిత్వంలోనే ఏదో లోపముందనే సంగతిని అంగీకరించండి. అన్నీ ఒక పద్ధతిలో, సవ్యంగా జరగాలని కోరుకునేవారికి లక్ష్యాలు పెద్దగా ఉంటాయి. అయితే ఇది అన్నిసార్లూ, అందరికీ సాధ్యం కాదు కదా. దీంతో తాము ఆనందంగా ఉండలేరు, ఇతరులనూ సంతోషంగా ఉండనీయరు. పెట్టుకున్న లక్ష్యాలను తామే సాధించకపోవటం వల్ల రాన్రానూ ఆందోళన లక్షణాలూ పొడసూపుతాయి. తమ మీద తాము శ్రద్ధ తీసుకోకపోవటం, సరిగా నిద్ర పట్టకపోవటం, కుటుంబాన్ని నిర్లక్ష్యం చేయటం వంటి వాటికీ దారితీయొచ్చు. కాబట్టి పరిస్థితి చేజారక ముందే మీరు మానసిక నిపుణులను సంప్రదించండి. ఒత్తిడి, ఆందోళన స్థాయులను బట్టి మందులు సూచిస్తారు. అవసరమైతే ఆలోచన తీరును మార్చే చికిత్స చేస్తారు. ఇందులో మీ వ్యక్తిత్వ గుణం వల్ల మీకు, ఇతరులకు ఎంత హాని కలుగుతోందో.. దీంతో జరుగుతున్న లాభనష్టాలేంటో అవగతం చేయిస్తారు. పర్‌ఫెక్షనిజాన్ని ప్రయోజనకరంగా మార్చుకునేదెలాగో కూడా నేర్పిస్తారు.

# నీరు తాగండి.. రక్తపోటు తగ్గించుకోండి


అధిక రక్తపోటును తగ్గించుకోవాలని అనుకుంటున్నారా? అయితే తగినంత నీరు తాగటం అలవాటు చేసుకోండి. రక్తంలో సోడియం మోతాదులు నార్మల్‌లో గరిష్ఠ స్థాయికి దగ్గరలో ఉండటానికీ అధిక రక్తపోటు, గుండె వైఫల్యం ముప్పులు పెరగటానికీ సంబంధం ఉంటున్నట్టు ఇజ్రాయెల్‌లోని బార్-ఇలాన్ యూనివర్సిటీ హెచ్చరిస్తోంది. పరిశోధకులు నాలుగు లక్షలకు పైగా మంది ఆరోగ్య వివరాలను సమీక్షించి ఈ విషయాన్ని గుర్తించారు. తగినంత నీరు తాగితే సహజంగానే సోడియం సాంద్రత తగ్గుతుంది. దీన్ని చిన్న విషయంగా భావించటం తగదని, ఇది దీర్ఘకాల గుండెజబ్బుల నివారణకు సమర్థమైన మార్గమని చెబుతున్నారు. రక్తంలో సోడియం మోతాదులు 135-146 ఎంఎంఓఎల్/ఎల్ ఉండటం



నార్మల్‌గా భావిస్తారు. ఇవి పైస్థాయికి చేరుకోకముందే ముప్పులు పెరుగుతుండటం గమనించదగ్గ విషయం. సోడియం మోతాదులు 140 నుంచి 146 ఎంఎంఓఎల్/ఎల్ ఉన్నవారికి అధిక రక్తపోటు, గుండె వైఫల్యం తలెత్తే అవకాశం పెరుగుతున్నట్టు పరిశోధకులు గుర్తించారు. వయసు, లింగ భేదం, శరీర ఎత్తు బరువు నిష్పత్తి, పొగ తాగే అలవాటు, పొటాషియం మోతాదుల వంటి వాటిని పక్కనపెట్టి చూసినా వీటి మధ్య సంబంధం కనిపిస్తుండటం విశేషం. సోడియం మోతాదులు 143 ఎంఎంఓఎల్/ఎల్ కన్నా మించగానే అధిక రక్తపోటు ముప్పు 29%, గుండె వైఫల్యం ముప్పు 20% పెరుగుతున్నట్టు తేలింది. ఒంట్లో నీటిశాతం తగ్గకుండా చూసుకోవటం చాలా కీలకమని ఇది తెలియజేస్తోందని పరిశోధకులు చెబుతున్నారు. దీర్ఘకాల జబ్బుల నివారణకిది తేలికైన, సమర్థ మార్గమని వివరిస్తున్నారు. ఎందుకంటే ఒంట్లో నీటిశాతం తగ్గితే రక్తంలో సోడియం మోతాదులూ పెరుగుతాయి. అందుకే అధిక రక్తపోటు, గుండెజబ్బుల ముప్పును అంచనా వేయటానికి రక్తంలో సోడియం మోతాదులను తెలిపే పరీక్ష చవకైన, తేలికైన మార్గంగానూ ఉపయోగపడగలదని పరిశోధకులు సూచిస్తున్నారు. మగవారు రోజుకు సుమారు 3.7 లీటర్లు, ఆడవారు 2.7 లీటర్ల నీరు తాగాలని ఆరోగ్య సంస్థలు సూచిస్తున్నాయి. అయితే ఆయా వ్యక్తుల ఆరోగ్యం, చేసే పనులు, వాతావరణాన్ని బట్టి నీటి అవసరం మారుతూ వస్తుంది.

# క్యాన్సర్ బాధితులకు వ్యాయామ తోడు

క్యాన్సర్ తీవ్ర సమస్య. దీని ఉధృతి, తీసుకునే చికిత్సలు శరీరంలోని శక్తిని బాగా



హరించి వేస్తాయి. అందుకే చాలామంది వ్యాయామం అనగానే భయపడిపోతుంటారు. మరింత అలసిపోతామని భావిస్తుంటారు. కానీ క్రమం తప్పకుండా వ్యాయామం చేయటం ఎంతో ముఖ్యమని తాజా అధ్యయనం సూచిస్తోంది. నిర్ణీత స్థాయిలో శారీరక శ్రమ చేయటం వల్ల పలురకాల క్యాన్సర్లతో సంభవించే మరణం ముప్పు తగ్గుతున్నట్టు అమెరికన్ క్యాన్సర్ సొసైటీ పరిశోధకులు గుర్తించారు. ఎంత ఎక్కువగా వ్యాయామం చేస్తే అంత ఎక్కువ ప్రయోజనం చేకూరుతుండటం విశేషం. రోజూ వ్యాయామం చేయటం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందన్న విషయం తెలిసిందే. క్యాన్సర్ నిర్ధారణ అయిన తర్వాతా శారీరక శ్రమ చేస్తే జీవనకాలం మీద మంచి ప్రభావం చూపుతున్నట్టు అధ్యయన ఫలితాలు బలంగా సూచిస్తున్నాయని పరిశోధకులు చెబుతున్నారు. గతంలో సుమారు 91వేల మందిపై నిర్వహించిన ఆరు అధ్యయనాల సమాచారాన్ని ఇందులో విశ్లేషించారు. మొత్తం 11 ఏళ్ల కాలంలో 45,500 మంది మరణించారు. జీవించి ఉన్నవారిలో ఎవరెంత వ్యాయామం చేస్తున్నారో పరిశీలించారు. క్యాన్సర్ బయటపడిన తర్వాత ఎంతో కొంత శారీరక శ్రమ చేసినవారిలో మరణించే ముప్పు సగటున 29% వరకూ తగ్గుతున్నట్టు గుర్తించారు. నిర్ణీత కాలం వ్యాయామం చేస్తే 42%, దీని కన్నా మరింత ఎక్కువ వ్యాయామం చేస్తే 57% వరకూ మరణించే అవకాశం తగ్గుతుండటం గమనార్హం. క్యాన్సర్ చికిత్సలు శారీరకంగా, మానసికంగా కుంగదీయటం వల్ల వ్యాయామం చేయటం కష్టంగా అనిపిస్తుండొచ్చు. కానీ ఆనందం కలిగించేవి, స్నేహితులతో కలిసి చేసే వ్యాయామాలు ఎంచుకుంటే కొనసాగించటానికి వీలుంటుంది. చురుగ్గా నడటం, తేలికపాటి తోట పనులు, యోగా వంటివి ఒక మాదిరి వ్యాయామం.. పరుగెత్తటం, ఈత కొట్టడం, వేగంగా సైకిల్ తొక్కటం వంటివి తీవ్ర వ్యాయామం కిందికి వస్తాయి. వారానికి కనీసం రెండున్నర గంటల సేపు ఒక మాదిరి వ్యాయామం లేదా 75 నిమిషాలు తీవ్ర వ్యాయామం చేయాలని మార్గదర్శకాలు సిఫార్సు చేస్తున్నాయి. వీటిని వీలును బట్టి ఆచరించటం మంచిది.

# సినిమా

## ఎన్టీఆర్ డైలాగ్.. బాలయ్య చప్పట్లు





నందమూరి కుటుంబం అనగానే తెలుగు ప్రేక్షకులకు ముందుగా గుర్తొచ్చే పేరు సీనియర్ ఎన్టీఆర్. ఆయన తర్వాత బాలకృష్ణ. ఇక ఆ కుటుంబం నుంచి ఎంతోమంది హీరోలుగా వచ్చినా బాలయ్య తర్వాత అంతటి స్థాయిలో గుర్తింపు సంపాదించుకున్న నటుడు జూనియర్ ఎన్టీఆర్ మాత్రమేనని అభిమానులు భావిస్తారు. అందుకే బాలకృష్ణ, జూనియర్ ఎన్టీఆర్ ఇద్దరూ కలిసి కనిపిస్తే చూడాలని ఎదురు చూస్తుంటారు. వారిని సంతోషపెట్టే వీడియో ఒకటి ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళితే.. కొన్నేళ్ల క్రితం సినీ ఇండస్ట్రీకి సంబంధించిన ఓ గ్రాండ్ ఈవెంట్ జరగ్గా.. ఆ కార్యక్రమానికి బాలకృష్ణ, జూనియర్ ఎన్టీఆర్ సహా అనేక మంది ప్రముఖులు హాజరయ్యారు. ఆ సమయంలో జూనియర్ ఎన్టీఆర్ తన బ్లాక్ బస్టర్ సినిమా యమదొంగలోని యముడి గెటప్ తో స్టేజ్ పైకి వచ్చి తన ట్రేడ్ మార్క్ 'ఏమంటివి ఏమంటివి..' డైలాగ్ చెప్పడంతో హాల్ మొత్తం చప్పట్లు, ఈలలతో మార్మోగిపోయింది. ఆ సమయంలో బాలకృష్ణ, ఎన్టీఆర్ ప్రదర్శనను ఎంతో ఎంజాయ్ చేసినట్లు వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. తారక్ డైలాగ్ చెబుతున్నంతసేపు బాలయ్య చిరునవ్వుతో చూస్తూ, చివర్లో చప్పట్లు కొడుతూ ఆయనను ప్రోత్సహించాడు. ప్రస్తుతం వైరల్‌గా మారిన ఈ వీడియోను ఫ్యాన్స్ సోషల్ మీడియాలో ఫుల్ గా ట్రెండ్ చేస్తున్నారు.

## పర్పుల్ శారీలో..



కన్నడ బ్యూటీ శ్రీ లీల గురించి పరిచయం ప్రత్యేకంగా అవసరం లేదు. తన అద్భుతమైన నటన, అందంతో అలరిస్తూ భారీ పాపులారిటీ సొంతం చేసుకుంది. ఆమె కార్తీక్ ఆర్యన్ సరసన ఆషికీ3 చిత్రంలో నటిస్తోంది. తమిళ్ లో తొలిసారి శివ కార్తికేయన్ సరసన నటించిన పరాశక్తి ఈ నెల 10న రిలీజైంది. దీని తెలుగు డబ్బింగ్ వెర్షన్ విడుదల కావాల్సి ఉంది. తమ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా మొన్నటి వరకు పలు ఈవెంట్లలో పాల్గొంటూ సందడి చేసిన ఈ భామ.. తాజాగా మరో కొన్ని ఫోటోలను ఇన్ స్టాగ్రామ్ వేదికగా పంచుకుంది. ఆ ఫోటోలలో బీచ్ సైడ్ కోమలమైన మోముతో ప్రశాంత వాతావరణంలో ఆనందంగా విహరిస్తోంది. పర్పుల్ కలర్ శారీ అందుకు కాంబినేషన్లో పర్ఫెక్ట్ బ్లౌజ్ ధరించి తన అద్భుతమైన స్మైల్ తో ఆకట్టుకుంటుంది. చాలా రోజుల తర్వాత ఇలాంటి ఫోటోలు షేర్ చేయడంతో అభిమానులు ఆమె అందానికి ఫిదా అవుతున్నారు. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి.



## థ్రిల్లింగ్ యాక్షన్




యంగ్‌హీరో నిఖిల్ సిద్ధార్థ్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ'స్వయంభు'. ఇప్పటికే ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. భరత్ కృష్ణమాచారి తెరకెక్కిస్తున్న ఈ మూవీలో సంయుక్త మీనన్, నభా నటేష్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భువన్, శ్రీకర్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఠాగూర్ మధు సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. . కాగా ఈ చిత్రం ఫిబ్రవరి 13, 2026న ప్రపంచవ్యాప్తంగా పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. అయితే తాజాగా ఈ మూవీ గురించి ఇంట్రెస్టింగ్ న్యూస్ వైరల్ అవుతుంది. పూర్తి పీరియాడికల్ మైథలాజికల్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో ఇంటర్వల్ సీక్వెన్స్ హైలైట్ కాబోతోందట. ఈ సీన్‌లో నిఖిల్ ఇతర ప్రధాన పాత్రల మధ్య వచ్చే యాక్షన్ విజువల్స్ చాలా వైల్డ్ గా ఉంటాయని సమాచారం. ముఖ్యంగా నిఖిల్ గెటప్, యుద్ధ సన్నివేశాల సెటప్ ప్రేక్షకులను థ్రిల్ కి గురిచేస్తాయని ఇన్సైడ్ టాక్. 'కేజీఎఫ్' ఫేమ్ రవి బస్రూర్ మ్యూజిక్, సెంథిల్ కుమార్ సినిమాటోగ్రఫీ ఈ సీన్స్‌ను మరో లెవల్‌కు తీసుకెళ్లనున్నాయట. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్ సినిమాపై భారీ హైప్‌ను క్రియేట్ చేయగా, ఈ లేటెస్ట్ యాక్షన్ అప్‌డేట్ నిఖిల్ అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతోంది.

## ఆ సినిమా వెంకటేష్‌కైతే బాగుండేదన్న చిరంజీవి



హీరో ఇమేజ్‌ను బట్టి సినిమా కథ, యాక్షన్, భావోద్వేగాలు ఉండాలి. అలా లేనప్పుడు ఎంత పెద్ద హీరో సినిమా అయినా సరే ప్రేక్షకులు అక్కున చేర్చుకోరు. తన సినిమా కథల విషయంలో ఒకటికి రెండుసార్లు ఆలోచించి నిర్ణయం తీసుకుంటారు అగ్ర కథానాయకుడు చిరంజీవి . కొన్నిసార్లు ఫలితం వేరేలా ఉన్నా, ఎక్కువశాతం అభిమానులను అలరించేందుకే ప్రయత్నిస్తారు. కొన్ని కథలు తనకన్నా తోటి హీరోలకు బాగుంటుందని సలహాలు కూడా ఇస్తారు. అలాంటి చిత్రాల్లో 'డాడీ' ఒకటి. సురేశ్‌కృష్ణ దర్శకత్వంలో 2001లో వచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద పర్వాలేదనిపించింది. అయితే, చిరంజీవి మార్కు సూపర్‌హిట్‌ను మాత్రం సొంతం చేసుకోలేకపోయింది. ఈ సినిమా కథ చెప్పగానే మరొక ఆలోచన లేకుండా వెంకటేష్ కైతే బాగుంటుందని చిరంజీవి సలహా ఇచ్చారట. ఆనాటి సంగతులను ఓ సందర్భంలో చిరు పంచుకున్నారిలా..! ''డాడీ' కథను నాకు వినిపించారు. వినగానే ఇది నాకంటే వెంకటేష్‌కు బాగుంటుందనిపించింది. ఈ కథకు తను న్యాయం చేయగలడనుకున్నా. రచయిత భూపతి రాజాకు ఇదే విషయం చెప్పా. 'ఇది ఆయనకు మామూలుగా ఉంటుంది. మీకైతే ఫ్యామిలీమ్యాన్‌గా కాస్త వెరైటీగా ఉంటుంది' అని భూపతిరాజా నన్ను ఒప్పించే ప్రయత్నం చేశారు. అయినా నేను కాస్త తటపటాయించా. ఈ కథ విన్న వారందరూ 'చిన్న పిల్లతో ఈ సినిమా మీకు బాగుంటుంది' అని సలహా ఇచ్చారు. చివరకు నేను కూడా బలవంతంగా ఒప్పుకొన్నా. రిజల్ట్ కూడా అలాగే ఉంది. కథ విన్నప్పుడు ఏమనుకున్నానో అదే జరిగింది. సినిమా విడుదలైన తర్వాత వెంకటేష్ నాకు ఫోన్ చేసి 'భలే సినిమా అండీ. నా మీద అయితే ఇంకా బాగా ఆడేదండీ' అనేశాడు. 'నీకైతే బాగుండేదని నేను చెప్పాను వెంకటేష్. కానీ వినలేదు' అని అన్నాను. అలాంటి కొన్ని ఫెయిల్యూర్స్ నా సినీ జీవితంలో ఉన్నాయి'' అని చిరంజీవి చెప్పుకొన్నారు.



## రిమోట్ కంట్రోల్ మా ఆయనదే

**: ప్రియాంకా చోప్రా**

అంతర్జాతీయ వేదికపై ప్రియాంక అందరి దృష్టిని ఆకర్షించారు. గోల్డెన్ గ్లోబ్స్ అవార్డుల వేడుకకు ఆమె వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ వేడుక ప్రారంభానికి ముందు తన భర్త నిక్ జొనాస్‌తో కలిసి రెడ్ కార్పెట్‌పై ఫొటోలకు పోజులిచ్చారు. ఇక వేదికపై ఒక ఆసక్తికర ప్రశ్నకు ఆమె సరదాగా బదులిచ్చారు. ఇంట్లో రిమోట్ ఎవరి చేతిలో ఉంటుందని అడగ్గా.. నిక్ చేతిలోనే ఉంటుందని చెప్పారు. ''గతేడాది మాకు చాలా గొప్పగా గడిచింది. టీవీలో ఏం చూడాలి అనే విషయంలో మా ఇంట్లో ఒకరితో ఒకరం గొడవపడం. ఎవరికి నచ్చింది వాళ్లు చూస్తాం'' అని నిక్ తెలిపారు. దీనికి ప్రియాంక స్పందిస్తూ.. 'నిక్‌కు నచ్చిన సినిమానే చూడమని చెబుతాను. నేను నా ఐప్యాడ్‌లో చూస్తాను' అని చెప్పారు. 2018లో పెళ్లి చేసుకున్న ప్రియాంక నిక్ జొనాస్‌లు 2022లో తల్లిదండ్రులయ్యారు. వారి కుమార్తెకు మాల్తీ మారీ చోప్రా జోనాస్ అనే పేరు పెట్టిన విషయం తెలిసిందే. ఇక సినిమాల విషయానికొస్తే.. ప్రియాంక వరుస ప్రాజెక్టులతో అలరిస్తున్నారు. ప్రస్తుతం రాజమౌళి మహేశ్ బాబు కాంబినేషన్‌లో రానున్న 'వారణాసి'లో నటిస్తున్నారు. ఇందులో ఆమె మందాకిని పాత్రలో కనిపించనున్నారు. ఇటీవల జరిగిన ఈ సినిమా ఈవెంట్‌లోనూ ఆమె తళుక్కున మెరిశారు. దీంతో పాటు 'ది బ్లఫ్'లోనూ నటిస్తున్నారు. అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా ఫిబ్రవరి 25 నుంచి ఈ సినిమా స్ట్రీమింగ్ కానుంది.

## గోల్డెన్ గ్లోబ్స్ 2026.. 'అడాల్‌సెన్స్'కు అవార్డు

ఇప్పటికే పలు అవార్డులు సొంతం చేసుకున్న 'అడాల్‌సెన్స్' మరోసారి అందరి దృష్టిని ఆకర్షించింది.




'గోల్డెన్ గ్లోబ్స్ 2026' అవార్డుల్లో ఉత్తమ నటుడు, సహాయనటుడి జాబితాల్లో అవార్డును తన ఖాతాలో వేసుకుంది. ఈ సిరీస్‌లో తన నటనతో మెప్పించిన ఓవెన్ కూపర్ ఉత్తమ సహాయనటుడిగా అతి చిన్న వయసులోనే ఈ అవార్డును సొంతం చేసుకొని రికార్డు సృష్టించాడు. అలాగే ఉత్తమ నటుడి కేటగిరీలో స్టీఫెన్ గ్రాహం అవార్డు అందుకున్నారు. వేదిక పైకి వచ్చిన ఓవెన్ కూపర్ ఆనందం వ్యక్తంచేశాడు. తనను ఆదరించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపాడు. తన చుట్టూ ఉన్న గొప్ప నటీనటుల నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నట్లు చెప్పాడు. ఇక ఈ అవార్డు వేడుకలకు నిక్కీ గ్లేజర్‌తో పాటు ప్రియాంక చోప్రా కూడా వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు.

**విజేతలు వీరే..**

- >> ఉత్తమ నటుడు (టీవీ సిరీస్) : స్టీఫెన్ గ్రాహం (అడాల్‌సెన్స్)
- >> ఉత్తమ నటి : రోజీ బెర్నీ (ఇఫ్ ఐ హేడ్ లెగ్స్ ఐడిడ్ కిక్ యూ)
- >> ఉత్తమ స్క్రీన్‌ప్లే: పాల్ థామస్ (వన్ బ్యాటిల్ ఆనథర్)
- >> ఉత్తమ సహాయనటుడు (టీవీ సిరీస్): ఓవెన్ కూపర్ (అడాల్‌సెన్స్)
- >> ఉత్తమ సహాయ నటుడు (సినిమా): స్టెలన్ (సెంటిమెంట్ వాల్యూ)
- >> ఉత్తమ సహాయ నటి (సినిమా): టెయానా టేలర్ (వన్ బ్యాటిల్ ఆనథర్)

## రేటింగ్స్ నిలిపివేతతో ఉపశమనం

**: విజయ్ దేవరకొండ**

న్యాయస్థానం ఆదేశాల మేరకు 'మన శంకరవరప్రసాద్ గారు' సినిమాకి ఆన్‌లైన్ టికెటింగ్ వేదిక బుక్ మై షో తన వెబ్‌సైట్‌లో సమీక్షల్ని, రేటింగ్స్‌ని నిలిపివేయడంపై యువ కథానాయకుడు విజయ్ దేవరకొండ స్పందించారు. ఈ చర్యతో ఎంతోమంది కష్టాన్ని, కలల్ని, డబ్బుని కాపాడుకునేందుకు దారి చూపించినట్లయిందని తన అభిప్రాయాన్ని ఎక్స్ వేదికగా పంచుకున్నారు. ఈ వేదికల్లో ఇదివరకు ఉన్న సమీక్షలు రాసే వెసులుబాటుని ఉపయోగించుకుంటూ, కొంతమంది పనిగట్టుకుని సినిమాలకి వ్యతిరేక సమీక్షలు, రేటింగ్స్ ఇస్తూ వాటిని సామాజిక మాధ్యమాల్లో ట్రెండింగ్ చేస్తుండడంపై సినీ పరిశ్రమ వర్గాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. 'మన శంకరవరప్రసాద్‌గారు' బృందం ఇటీవల న్యాయస్థానాన్ని ఆశ్రయించి సమీక్షల్ని నిలిపివేయాలని కోరడంతో, అనుకూలంగా తీర్పు వచ్చింది.



# పైరవీలు చేయను...పర్సనల్ ఎజెండా లేదు...

(మొదటి పేజీ తరువాయి...)

మోదీని పదే పదే కలుస్తున్నానని కొంత మంది విమర్శిస్తున్నారు. రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టులు ఎవరు ఇస్తారు.. ప్రధాని కాదా? ప్రధానిని కలవకపోతే నిధులు, ప్రాజెక్టులు ఎలా వస్తాయి. పదేళ్ల పాటు కేంద్ర ప్రభుత్వాన్ని గత ప్రభుత్వం అడగలేదు. అడగకపోతే రాష్ట్రానికి ఏం కావాలో కేంద్రానికి ఎలా తెలుస్తుంది. పైరవీలు చేయను... పర్సనల్ ఎంజెడా లేదు.రాష్ట్ర అభివృద్ధి కోసం, నిధుల కోసం.. ప్రధాని మోదీ, అమిత్ షా సహా ఎవరినైనా కలుస్తానని అన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయాలు..ఆ తర్వాత అభివృద్ధే అందరి లక్ష్యం. పదేళ్లు అధికారంలో ఉన్న వారు ఈ ఆలోచన చేయకపోవడం వల్లే.. తెలంగాణకు తీరని నష్టం జరిగిందని పరోక్షంగా కెసిఆర్ తీరుపై మండిపడ్డారు.. రాష్ట్ర భాజపా నేతలు కూడా ప్రధాని మోదీని కలిసి రాష్ట్రానికి ప్రాజెక్టులు, నిధులు తేవాలి. నిర్మల్ జిల్లాకు అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ మంజూరు చేస్తున్నాం. నాగోబా జాతరకు రూ.22కోట్లు మంజూరు చేసి అభివృద్ధి చేస్తాం. సమ్మక్క-సారలమ్మ జాతరకు రూ.300 కోట్లు కేటాయించి పునర్నిర్మాణం చేశాం. ప్రపంచ పెట్టుబడులకు హైదరాబాద్ స్వర్గధామంగా మారిందన్నారు. పెట్టుబడుల కోసం మేం ప్రయత్నిస్తుంటే.. స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నామని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. పదేళ్లు అధికారాన్ని అనుభవించి రూ.8లక్షల కోట్లు అప్పు చేశారు.. రూ. వేల కోట్లు దోపిడీ చేశారని కెసిఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు గుప్పించారు. భూసేకరణ కు నిధులు మంజూరు చేసి ప్రాజెక్టులు పూర్తి చేసుకున్నామని తెలిపారు. ఉమ్మడి జిల్లాకు వర్శిటీ లేదని.. ఈ ప్రాంతానికి వర్సిటీ మంజూరు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. త్వరలో వర్సిటీ మంజూరు అవుతుందన్నారు. బాసర వర్సిటీ ఏర్పాటు చేసుకుంటున్నామని.. దానికి ఏర్పాట్లు చేయాలన్నారు. ఆదిలాబాద్ వర్సిటీ బాసరలో ఏర్పాటు చేస్తున్నామని.. ఉమ్మడి జిల్లా కు కావాల్సిన నిధులను బ్జడెట్ లో ప్రవేశ పెట్టుతామన్నారు.. తుమ్మడి హెట్టీ వద్ద ప్రాణహిత చేవెళ్ల పై నివేదిక తయారు చేస్తున్నామని.. తుమ్మడి హెట్టీ వద్ద ప్రాజెక్టు కట్టి తీరుతామని స్పష్టం చేశారు. ప్రతి నీటి చుక్కని ఓడి పట్టుతామన్నారు.. ఆదిలాబాద్‌కు ఎయిర్ పోర్ట్ తీసుకొచ్చే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. మోడీ చేతుల మీదుగా ఆదిలాబాద్ ఎయిర్ పోర్టు శిలాఫలకం వేయిస్తా మని స్పష్టం చేశారు. ఎన్నికలు వచ్చాక రాజకీయం.. ఎన్నికల తర్వాత అభివృద్ధికి కలిసి నడుద్దామన్నారు. ప్రతి మూడు నెలలకు సారి కేంద్రాన్ని కలుస్తాం.. మీరు సైతం నా దగ్గరకు రండి.. సాధ్యం అయినంత పనులు చేస్తామని ప్రతిపక్ష నేతలకు సీఎం తెలిపారు. మోడీ నాకు చుట్టం కాదు దేశానికి ప్రధాని కాబట్టి మన ప్రాంతం అభివృద్ధి కావాలి కాబట్టి మోడీని కలుస్తున్నానని చెప్పారు. ప్రాంత అభివృద్ధి కోసం ఎవ్వేర్నినా కలుస్తా. పైరవీలు లేవు, పర్సనల్ పనులు నాకు లేవని సీఎం స్పష్టం చేశారు. కేంద్రం వరంగల్ ఎయిర్ పోర్టు వచ్చింది. ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్ ఇస్తాం అని చెప్పినట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. 'ఇవ్వన్నీ అడిగనిదే ఇవ్వరు. గత పాలకులు అడగకపోవడంతో ఈ పరిస్థితి వచ్చింది. వాళ్ల తప్పులకు ఇప్పుడు అప్పులు మిగిలాయి. ఆ ప్రభుత్వంలో ఇచ్చిన బియ్యం ఎవ్వరైనా తిన్నారా..? కాని మేము ఇచ్చే సన్న బియ్యం తింటున్నారు. నాడు పావలా వడ్డీ లేదు సున్నా వడ్డీ లేదు.. గుండు సున్నా మిగిల్చారు. వెయ్యికోట్ల భూమి మహిళలకు కేటాయించాం..రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక స్థితి వల్ల క్రమక్రమంగా అభివృద్ధి చేసుకుందాం.. రాష్ట్ర ప్రజలు అండగా నిలవండి, దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రాన్ని తీర్చి దిద్దుతా.. త్వరలో మున్సిపల్ ఎన్నికలు రాబోతున్నాయి? ప్రజా ప్రభుత్వంతో కలిసి పని చేసే వారిని గెలిపించండి.. కేవలం ఎన్నికల అప్పుడే రాజకీయాలు, అభివృద్ధికి అందరం ఒకటే..అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

### పదేళ్ల పాలనలో

## అప్పులు తప్ప అభివృద్ధి లేదు

(మొదటి పేజీ తరువాయి...)

ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన పక్రియ ప్రారంభమైందని పేర్కొన్నారు. ఒక్కొక్కటిగా సమస్యలు పరిష్కరించుకుంటూ ముందుకెళ్తున్నామని తెలిపారు. తెలంగాణ అభివృద్ధి విషయంలో రాజకీయాలు చేయొద్దని హితవు పలికారు. నాటి పాలకులు చేసిన అప్పులే ఇప్పుడు ఉరి తాడు అయ్యాయి. మేం ఫ్యూచర్ సిటీ అంటే మమ్మల్ని రియల్ ఎస్టేట్ బ్రోకర్స్ అంటున్నారు' అని ప్రతిపక్షాలనుద్దేశించి అన్నారు ముఖ్యమంత్రి.'పదేళ్ల పాలనలో ఏమిచేయని వ్యక్తి ప్రజాపాలనను భరించలేక పోతున్నారు. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఉన్న వ్యక్తి ఇలాగేనా మాట్లాడేది. చేతనైతే మమ్మల్ని ఆశీర్వదించండి.. లేకుంటే ఫామ్‌హౌస్‌లోనే ఉండండి. మారీచుడు, సుగ్రీవుడు తరహాలో రాక్షసుల్లా..అభివృద్ధికి అడ్డు పడుతున్నారు. శుక్రాచార్యుడిలా ఫామ్‌హౌస్‌లో ఉన్న వ్యక్తి ప్రోత్సహిస్తున్నారు.పదేళ్లు అధికారంలో ఉండి రూ.8 లక్షల కోట్ల అప్పులు చేశారు. బీఆర్‌ఎస్ నేతలకు అభివృద్ధి అంటే ఇష్టం లేకపోతే ఫామ్‌హౌస్‌లో విశ్రాంతి తీసుకోవచ్చు. బావాబామ్మర్దులు అభివృద్ధిని అడ్డుకుంటున్నారు. మొన్న పంచాయతీ ఎన్నికల్లో 66శాతం కాంగ్రెస్ సర్పంచ్‌లను గెలిపించారు ప్రజలు. వారి నమ్మకాన్ని వమ్ము చేయం. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లోనూ మంచి వాళ్లను ఎన్నుకోండి. సమస్యలను పరిష్కరించే వాళ్లను, ప్రజా ప్రభుత్వంతో కలిసి పనిచేసిన వాళ్లనే గెలిపించుకోండి. నేను ఓడిపోయిన వాళ్ల గురించి మాట్లాడను. మేం పాలకులం కాదు.. సేవకులం. మీ మనసు గెలుస్తాం.. రాబోయే ఎన్నికల్లో విజయం సాధిస్తాం. 2038 వరకు అధికారంలో ఉంటాం' అని సీఎం రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

### బెంగాల్లో నేటి నుంచి

## మోడీ రెండ్రోజుల పర్యటన

(మొదటి పేజీ తరువాయి...)

టీఎంసీ రాజకీయ కన్సెల్టెన్సీ ఐ-ప్యాక్ పై ఇటీవల జరిగిన ఈడీ దాడులతో బెంగాల్‌లో రాజకీయ వాతావరణం వేడెక్కిన నేపథ్యంలో మోదీ పర్యటన ప్రాధాన్యం సంతరించుకోనుంది. షెడ్యూల్ ప్రకారం.. మైనారిటీల ఆధిపత్యం ఉన్న మాల్దాలో ఈనెల 17న జరిగే బహిరంగ ర్యాలీలో మోదీ పాల్గొంటారు. సింగూర్‌లో జరిగే మరో ర్యాలీకి కూడా హాజరవుతారు. శనివారం సాయంత్రం మాల్దాకు ప్రధాని చేరుకుంటారని, తొలుత ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొని ఆ తర్వాత సమీప గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసే పబ్లిక్ ర్యాలీలో పాల్గొంటారని బీజేపీ రాష్ట్ర నేత ఒకరు తెలిపారు. ఆదివారం నాడు మరలా బెంగాల్ వచ్చి హుగ్లీలోని సింగూర్‌లో ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొని, ఆ వెంటనే పబ్లిక్ ర్యాలీకి హాజరవుతారని చెప్పారు. ఆ రాత్రి కోల్‌కతాలోనే బస చేస్తారా అనేది మాత్రం వెల్లడించలేదు. పీఐబీ ప్రకటన ప్రకారం.. ప్రధాని జనవరి 17వ తేదీ మధ్యాహ్నం 12:45 గంటలకు మాల్దా చేరుకుంటారు. హౌరా-గౌహతి మధ్య నడిచే తొలి వందేభారత్ స్లీపర్ ట్రైన్‌ను పచ్చజెండా ఊపి ప్రారంభిస్తారు. ఆదివారం నాడు హుగ్లీ జిల్లాలో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభం, శంకుస్థాపనలు చేస్తారు. ఎస్ఐఆర్ పేరుతో సాధారణ పౌరులను బీజేపీ, ఎన్నికల కమిషన్ వేధిస్తోందని.. దీనికి బ్యాలెట్ బాక్స్ వద్దే ప్రజలు గట్టి గుణపాఠం చెప్పాలని అధికార టీఎంసీ కొద్దిరోజులుగా విమర్శలు గుప్పిస్తోంది. అయితే.. ఈ వాదనలను బీజేపీ తోసిపుచ్చుతోంది. అక్రమ వలసదారులు, రోహింగ్యాలను ఓటర్ల జాబితా నుంచి తొలగించేందుకు ఎస్ఐఆర్ తప్పనిసరని, గణనీయంగా తమ ఓటు బ్యాంకు కోల్పోతోందనే అక్కసుతోనే టీఎంసీ తప్పుడు ఆరోపణలను చేస్తోందని చెబుతోంది.

## రైతుల పంటలకు గిట్టుబాటు ధరల

(మొదటి పేజీ తరువాయి...)

ప్రారంభమయ్యాయని వెల్లడించారు. శుక్రవారం.. ఖమ్మం జిల్లాలో మంత్రి తుమ్మల పర్యటించిన ఆయన..పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రైతులకు లాభదాయక ధర కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం, టీజీ మార్క్‌ఫెడ్ సమన్వయంతో కొనుగోళ్లు ప్రారంభించిందని చెప్పుకొచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 4,99,393 ఎకరాల్లో కందులు సాగవుతున్నాయని పేర్కొన్నారు మంత్రి తుమ్మల. వాస్తవానికి సుమారు 2,99,635 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వస్తుందని అంచనా వేశామని తుమ్మల తెలిపారు. ఈ లెక్కన క్వింటాల్‌కు రూ. 8,000 ఓ÷ూఖ నిర్ణయించామన్నారు. అయితే.. ప్రస్తుతం మార్కెట్ ధర రూ. 7,200 వరకు మాత్రమే ఉందని ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి 1,71,310 మెట్రిక్ టన్నుల కొనుగోలుకు అనుమతి ఇచ్చిందని వివరించారు. 2025 డిసెంబర్ 27 నుంచి 2026 మార్చి 26 వరకు కొనుగోళ్లు జరుగుతాయని వెల్లడించారు. రాష్ట్రంలో మొత్తం 82 కొనుగోలు కేంద్రాలను ప్రతిపాదించామని తెలిపారు. ఇప్పటికే 13 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు వివరించారు. జనవరి 16 నాటికి 32 మంది రైతుల నుంచి 30.25 మెట్రిక్ టన్నుల కొనుగోళు జరుగుతాయనే అంచనా వేశామని వెల్లడించారాయన. వీటి మొత్తం విలువ రూ. 0.24 కోట్లు ఉంటుందని అంచనా వేశామని పేర్కొన్నారు మంత్రి. నారాయణపేట జిల్లాలో కొనుగోళ్లు సజావుగా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. ఆయా పంటల రాకల ఆధారంగా ఇతర జిల్లాల్లోనూ దశలవారీగా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అన్నదాతలు మధ్యవర్తులకు పంటను అమ్మొద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు. టీజీ మార్క్‌ఫెడ్ కేంద్రాలకు మాత్రమే పంటను తీసుకు రావాలని సూచించారు. కొనుగోలు మొత్తాన్ని డీబీటీ ద్వారా నేరుగా రైతుల ఖాతాల్లో జమచేయాలని అధికారులను ఆదేశించారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని తుమ్మల నాగేశ్వరరావు భరోసానిచ్చారు.

# లక్ష్యం మేరకు ఉద్యోగాల కల్పన



(మొదటి పేజీ తరువాయి...)

గత ప్రభుత్వ పెద్దల ఉద్యోగాలు ఊడగొట్టి.. తమకు ఉద్యోగాలు ఇచ్చే ప్రజా ప్రభుత్వాన్ని యువత తెచ్చుకున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. వివిధ శాఖల్లో గ్రూప్-3 ఉద్యోగాలకు ఎంపికైన 1,370 మందికి నియామక పత్రాలను సీఎం చేతుల మీదుగా అందజేశారు. గత ప్రభుత్వం గ్రూప్-1 పరీక్ష నిర్వహించలేదని, పోటీ పరీక్షలు నిర్వహించకపోవడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. పేపర్లు లీకవ్వడం, మళ్లీ పరీక్షలు నిర్వహించడం మరో బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ విశ్వసనీయతను దెబ్బతీశారు. యూపీఎస్సీ తరహాలోనే టీజీపీఎస్సీని సంస్కరించాం. గ్రూప్-1 నియామకపత్రాలు ఇచ్చే సమయంలో కూడా కోర్టుకు వెళ్లి కుట్రలు చేశారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 60వేల ఉద్యోగ నియామకపత్రాలు అందించాం. ఉద్యోగాలు ఇవ్వడం మాకు బాధ్యత.. మీకు జీవితం. ప్రభుత్వ ఉద్యోగం అంటే జీతం తీసుకోవడం కాదు.. ఒక భావోద్వేగం. అందరికీ విద్య అందుతుంది.. కానీ, నాణ్యమైన విద్య అందడం లేదు. ప్రైవేటు పాఠశాలల మీద ప్రజలకు ఎందుకు విశ్వాసం పెరిగింది? లక్షల మంది ఇంజినీరింగ్ చేసి బయటకు వస్తున్నా.. అందరికీ ఎందుకు ఉద్యోగాలు రావట్లేదు? జాబ్ మార్కెట్‌లో అవకాశాలు ఉన్నా స్కిల్ లేక అందుకోలేకపోతున్నాం. నైపుణ్యాభివృద్ధి కోసం మీరు ప్రయత్నించాలి. ఒకప్పుడు పేదరికం పోగొట్టడానికి భూములు ఇచ్చే వాళ్లం. ఇప్పుడు ఇవ్వడానికి భూములు లేవు.. నాణ్యమైన విద్యను మాత్రమే అందించగలం. విద్య ఒక్కటే పేదరికాన్ని పోగొడుతుంది. కులం, డబ్బు, అధికారంతో కాదు.. విద్యతోనే గౌరవం వస్తుంది. 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మార్చాలి. రాబోయే రోజుల్లో అన్ని ఉద్యోగ నియామకాలు పూర్తి చేస్తా.. రాజకీయపార్టీల చేతుల్లో ఆయుధాలుగా మారొద్దు. ఎవరూ మనకు చెప్పాల్సిన అవసరం లేదు.. నాకు సంపూర్ణ అవగాహన ఉంది. ప్రభుత్వంలోనే కాదు.. ప్రవేటు రంగంలో కూడా రూ.లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చి ప్రపంచంతోనే పోటీ పడే విధంగా యువతను తీర్చి దిద్దే బాధ్యత నాదని సీఎం హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మంత్రులు జూపల్లి తదిరులు పాల్గొన్నారు.

## మెట్రో రెండోదశకు కేంద్ర సుముఖం

(మొదటి పేజీ తరువాయి...)

రాష్ట్ర ప్రభుత్వం టేకోవర్ చేసుకోవాలని, అందుకు అన్ని ఒప్పందాలు, నిర్ణయాలు, లావాదేవీలు పూర్తి చేయాలని సూచించారు. ఈ మేరకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి శుక్రవారం లేఖ రాశారు. ఈ లేఖలో హైదరాబాద్ మెట్రో రెండో దశ పనుల పురోగతి గురించి ప్రస్తావించారు. అలాగే హైదరాబాద్ నగరంలో ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి, రవాణా సౌకర్యాలను మెరుగుపరచడంలో భాగంగా నగరంలో మెట్రో రెండో దశ పనులు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ అనుమతి కోరిందని గుర్తుచేశారు. ఇప్పటికే అమలు జరుగుతున్న మొదటి దశ మెట్రోను ఎల్ అండ్ టీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, తామే నిర్వహిస్తామని ప్రకటించిందని ప్రస్తావించారు. లావాదేవీలు పూర్తయిన తర్వాత రెండో దశ నిర్మాణంపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే హైదరాబాద్ మెట్రో రెండో దశ నిర్మాణానికి అంగీకరించిందని కూడా కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ గుర్తు చేశారని అన్నారు. మెట్రో మొదటి దశను రాష్ట్ర ప్రభుత్వం ఎల్ అండ్ టీ నుంచి తీసుకోవడం, రెండో దశకు సన్నాహాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సంయుక్తంగా కమిటీ ఏర్పాటు చేయడంపై సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి నిర్ణయించారని కూడా కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ తనకు తెలిపారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇద్దరు, కేంద్ర ప్రభుత్వం తరఫున మరో ఇద్దరు అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇద్దరు అధికారుల పేర్లను పంపాలని కోరినట్లు కూడా వివరించారు. కానీ, ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారుల పేర్లను ఎందుకు ప్రతిపాదించలేదని ప్రశ్నించారు. కావున సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే ఇద్దరు అధికారుల పేర్లను పంపి సమావేశ నిర్వహణకు ప్రయత్నం చేయాలని సూచించారు. అదేవిధంగా, వేగవంతంగా ఎల్ అండ్ టీ నుంచి మెట్రో నెట్‌వర్క్‌ను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, ఆ తర్వాత మెట్రో రెండో దశ నిర్మాణానికి కావాల్సిన ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వానికి పంపాలని విజ్ఞప్తి చేశారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని కిషన్‌రెడ్డి కోరారు.

## వేములవాడ అభివృద్ధికి శ్రీకారం

(మొదటి పేజీ తరువాయి...)

కేసీఆర్ హయాంలో వేములవాడ రాజన్న ఆలయాన్ని పట్టించుకోలేదని ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఆలయాన్ని ఎంతగానో అభివృద్ధి చేస్తోందని వ్యాఖ్యానించారామె. వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ జంక్షన్ అభివృద్ధికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆమె.. బీఆర్ఎస్ హయాంలో వేములవాడ రాజన్న ఆలయాన్ని ఎందుకు అభివృద్ధి చేయలేదని ప్రశ్నించారు. మేడారం సమ్మక్క - సారక్క, వేములవాడ ఆలయాల అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ఏకకాలంలోనే నిధులు కేటాయించారని ప్రస్తావించారు మంత్రి. సమ్మక్క - సారలమ్మ చరిత్ర, ప్రత్యేకతను శిలలపై రాయిస్తున్నామని పేర్కొన్నారు. గతంలో రాజన్నను దర్శించుకుంటే నష్టం అంటూ దుష్ప్రచారాలు చేశారని అన్నారు. వేములవాడ రాజన్నను ఎంతోమంది భక్తులు తమ ఇంటి ఇలవేల్పుగా కొలుస్తారని తెలిపారు సీతక్క. ప్రస్తుతం.. వేములవాడకు భారీగా భక్తులు తరలివచ్చి రాజన్నకు మొక్కులు సమర్పిస్తుంటారని పేర్కొన్నారు. రాజన్నపై నమ్మకంతోనే ఇంతమంది భక్తులు ఆలయానికి వస్తున్నారని వెల్లడించారు. కోరిన కోరికలు తీర్చే కొంగుబంగారంగా స్వామివారిని భక్తులు కొలుస్తుంటారని తెలిపారు. తెలంగాణ సార్వత్రిక ఎన్నికల ముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తాను వేములవాడ రాజన్నను దర్శించుకున్నామని గుర్తుచేశారు. అలాగే, మేడారం సమ్మక్క - సారక్క అమ్మవార్ల నుంచి పాదయాత్ర ప్రారంభించామని తెలిపారు. ఏ దేవాలయాల ప్రత్యేకత వాటికి ఉంటుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

## తల్లి అంత్యక్రియల్లో పాల్గొననున్న ఇన్నయ్య

(మొదటి పేజీ తరువాయి...)

అంత్యక్రియలు జరగను న్నాయి. అందులో గాదె ఇన్నయ్య పాల్గొనున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో వరుసగా ఎన్‌కౌంటర్లు చోటు చేసుకుంటున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత కాటా రామచంద్రారెడ్డి అలియాస్ వికల్ప్ మరణించారు. ఆయన అంత్యక్రియలకు మావోయిస్టు మాజీ నేత గాదె ఇన్నయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా మావోయిస్టులకు అనుకూలంగా ఆయన వ్యాఖ్యలు చేయడం ద్వారా ప్రజలను.. ప్రేరేపించారే ఆరోపణలు వచ్చాయి.దీంతో ఉపా చట్టం కింద ఆయనపైఎన్‌ఐఏ కేసు నమోదు చేసింది. ఆ క్రమంలో డిసెంబర్ 21న ఇన్నయ్యను ఎన్‌ఐఏ అధికారులు అరెస్ట్ చేశారు. అనంతరం ఆయనను హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలుకు తరలించారు. ప్రస్తుతం ఆయన అక్కడే ఉన్నారు. మంగళవారం జనగామ జిల్లా జాఫర్‌గఢ్ మండల కేంద్రంలో గాదె ఇన్నయ్య నిర్వహిస్తున్న అనాథాశ్రమంలో ఎన్‌ఐఏ అధికారులు సోదాలు నిర్వహించిన విషయం విదితమే.

### ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారం

## స్పీకర్‌కు మరో రెండు వారాల గడువు

మొదటి పేజీ తరువాయి...)

కోర్టుకు తెలిపారు. గతంలో మూడు నెలల్లోనే ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించినా పట్టించుకోలేదని పాడి కౌశిక్ రెడ్డి తరపు న్యాయవాది శేషాద్రి నాయుడు న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. ఏడుగురు ఎమ్మెల్యేల అనర్హతపై స్పీకర్ నిర్ణయం తీసుకున్నారని, మిగిలిన ముగ్గురిపై నిర్ణయం తీసుకునేందుకు సమయం కావాలని స్పీకర్ తరపు న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ కోర్టును కోరారు. అయితే రెండు వారాలు సమయం ఇస్తున్నామని.. రెండు వారాల్లో స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకున్నారో కోర్టుకు చెప్పాలని ధర్మాసనం ఆదేశించింది. ఆ తరువాత అవసరం అయితే మరో రెండు వారాలు సమయం ఇస్తామని సుప్రీం కోర్టు ధర్మాసనం చెబుతూ.. తదుపరి విచారణను వాయిదా వేసింది. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై విచారణ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ తరఫున అభిషేక్ సింఘ్వి వాదనలు వినిపించారు. ఇప్పటికే ఏడుగురు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌లపై స్పీకర్ నిర్ణయం ప్రకటించారని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యేల అనర్హత వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ మసీహ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. స్పీకర్ తీసుకున్న చర్యలపై ఆయన తరపు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ నివేదిక అందించారు. అనంతరం తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

## 18న పాలేరుకు సీఎం రేవంత్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి...)

శుక్రవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని మద్దులపల్లిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పర్యటనలో భాగంగా మొత్తం రూ.362 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని తెలిపారు. మద్దులపల్లిలో జేఎన్టీయూ కళాశాలకు శంకుస్థాపన, నర్సింగ్ కళాశాల ప్రారంభోత్సవం చేయడంతో పాటు.. మున్నేరు-పాలేరు లింక్ కెనాల్ నిర్మాణ పనులను సీఎం ప్రారంభిస్తారు. అదేవిధంగా మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్‌ను ప్రారంభిస్తారు. అలాగే కూసుమంచిలో నిర్మించిన 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ పాల్గొంటారని తెలిపారు.

# వైభవంగా కొత్తకొండ వీరభద్రస్వామి ఉత్సవాలు




## భారీగా తరలివచ్చిన భక్తజనం
## బండ్లు కట్టి స్వామిని దర్శించుకున్న ప్రజలు
## పలువురు మంత్రులు రాక... భారీ బందోబస్తు ఏర్పాటు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హన్మకొండ, జనవరి 16 : హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని గురు, శుక్రవారాల్లో లక్షలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కోనేరులో పవిత్ర స్నానాలు ఆచరించారు. కోరిన కోరికలు తీర్చాలని స్వామివారికి కోర మీసాలు సమర్పించుకున్నారు. తమ గండాలు తొలగిపోవాలని గండా దీపంలో నూనె పోశారు. వీరభద్రుని సన్నిధిలో కోడె ప్రదక్షిణ చేశారు. గుమ్మడికాయ మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి దర్శనం కోసం భక్తులు గంటల తరబడి క్యూ కట్టారు. భక్తులు అధికం కావడంతో శీఘ్ర దర్శనం, విఐపి క్యూలైన్లు సైతం కిక్కిరిసిపోయాయి. జాతరలోని దుకాణాలు, రంగులరాట్నం, సర్కస్ తదితర షాపులన్నీ రద్దీగా మారాయి. జాతరలో భక్తుల సౌకర్యార్థం వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బందులు వాటిల్లకుండా ఆలయ చైర్మన్ అశోక్ ముఖర్జీ, ఈవో కిషన్ రావు పూర్తి సదుపాయాలు కల్పించారు. మకర సంక్రాంతి పర్వదినం గురువారం అర్ధరాత్రి ఆనవాయితీ ప్రకారం వరంగల్ జిల్లా వేలేరు కు చెందిన యాదవులు డబ్బు చప్పుళ్ళు, శివసత్తులు నృత్యాల మధ్య మేకల బండితో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం ఎడ్లబండ్లతో వచ్చిన భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి గుట్టపైన కొలువుదీరిన వీరభద్ర స్వామి ఆత్మలింగం ఆలయంలో దివ్యాలంకరణ పూజలు జరిగాయి. గుట్టపైకి వెళ్ళిన భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గుట్టపైకి వెళ్లి ప్రకృతి రమణీయతను వీక్షించేందుకు యువత పోటీపడ్డారు. మాజీ ప్రధాని దివంగత పీవీ నరసింహారావు స్వగ్రామం వంగర లోని అతని ఇంటి నుంచి కొత్త కొండకు ఎడ్ల బండి రథం మకర సంక్రాంతి రోజున వెళ్లడం అనవాయతీగా వస్తుంది. ఈ ఏడాది సైతం ఎడ్ల బండి రథాన్ని అందంగా అలంకరించారు. శివ సత్తుల నృత్యాలు, మహిళల కోలాటాల నడుమ ఎడ్ల బండి రథాన్ని కొత్తకొండకు గ్రామస్తులు అంగరంగ వైభవంగా సాగనంపారు. బండెనుక బండి కట్టి పదహారు బండ్లు కట్టి అనే చందంగా కొత్తపల్లి నుంచి కొత్తకొండకు వెళ్లిన ఎడ్లబండ్లు రథాలను తలపించాయి. ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది సైతం సుమారు 72 వరకు ఎడ్లబండ్లను బంతిపూలతో వివిధ రంగులతో అందంగా అలంకరించి రథాలుగాతీర్చిదిద్దారు. కొత్తకొండ వరకు సాగిన ఎడ్ల బండి రథాలను తిలకించేందుకు ప్రజలు దారి వెంట బారులు తీరారు. హిందూ, ముస్లిం అనే భేదం లేకుండా ఎడ్ల బండ్లతో వచ్చి ఆలయ ప్రదక్షిణలు చేసి మత సామరస్యానికి ప్రతీకగా నిలిచారు. మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మకర సంక్రాంతి పర్వదినాన దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారిని పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు ఆశీర్వచనం చేయగా, ఆలయ చైర్మన్ అశోక్ ముఖర్జీ, ఈవో కిషన్ రావు వారికి శేష వస్త్రాలు సమర్పించి స్వామి వారి మెమొంటోను ప్రధానం చేశారు. అంతకుముందు త్రిశూల చౌరస్తాను ప్రారంభించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కొత్తకొండ ఆలయ అభివృద్ధిలో భాగంగా మాడ వీధులు, ఇతరత్ర అభివృద్ధి పనులకోసం రూ. 70 కోట్లు నిధులు మంజూరు చేసిన దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు కృతజ్ఞతలు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భక్తుల సౌకర్యార్థం ముల్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. భక్తులకు అందుబాటులో వైద్య సిబ్బంది ఉండి మందులు పంపిణీ చేశారు. అత్యవసర పరిస్థితి దృష్ట్యా అంబులెన్స్ ను అందుబాటులో ఉంచారు. దీంతోపాటు జాతరలో అగ్నిమాపక సిబ్బంది సైతం అందుబాటులో ఉన్నారు. జాతర లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. జూదం, మట్కా, గుట్కా, నాటుసారా లేకుండా పూర్తిస్థాయిలో పోలీసులు నియంత్రించారు. కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్ రెడ్డి తో పాటు మరో ఇద్దరు ఏసీపీలు పదిమంది సీఐలు, 25 మంది ఎస్సైలు, 350 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొని సేవలందించారు.

# ధరణి, భూభారతి కుంభకోణంలో 15మంది అరెస్ట్

## నిందితుల నుంచి రూ.63.19 లక్షల నగదు స్వాధీనం
## మరో 9 మంది పరారీలో ఉన్నట్టు పోలీసుల వెల్లడి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వరంగల్, జనవరి16 : తెలంగాణలో సంచలనం సృష్టించిన ధరణి, భూ భారతి కుంభకోణంలో 15 మందిని అరెస్టు చేసినట్టు వరంగల్ కమిషనర్ సన్ ప్రీత్‌సింగ్ తెలిపారు. మరో 9 మంది పరారీలో ఉన్నట్టు చెప్పారు. ప్రధాన నిందితులుగా బసవరాజు, జెల్లా పాండుగా గుర్తించాం. జనగామ, యాదాద్రి జిల్లాల్లో గతంలో అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగాయి. యాదగిరిగుట్టలోని ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్ల ద్వారా మోసాలు జరిగాయన్నారు. రూ.3.90 కోట్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడింది. వెబ్‌సైట్‌లో సాంకేతిక లోపాల ఆధారంగా లూటీ చేశారు. నిందితుల నుంచి రూ.63.19లక్షల నగదు స్వాధీనం చేసుకున్నాం. నిందితుల బ్యాంక్ ఖాతాల్లోని రూ.లక్ష సీజ్ చేశాం. రూ.కోటి విలువైన ఆస్తి పత్రాలు, కారు, ల్యాప్ టాప్‌లు, డెస్క్ టాప్‌లు, సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నాం. పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. ధరణి- భూ భారతి కేసులో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశముందని సీపీ తెలిపారు. మొత్తం మూడు కోట్ల 72 లక్షల రూపాయల కుంభకోణం జరిగినట్టు పోలీసులు వెల్లడించారు. జనగామ, యాదాద్రి జిల్లాల్లో సంచలనం సృష్టించిన ధరణి, భూ భారతి కుంభకోణం కేసులో కీలక ఆధారాలు సేకరించారు పోలీసులు.

# బీజేపీ అధ్యక్ష ఎన్నికకకు రంగం సిద్ధం

## 19న నామినేషన్.. 20 ఎన్నికల ప్రక్రియ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

న్యూఢిల్లీ, జనవరి16 : భారతీయ జనతా పార్టీకి మరికొన్ని రోజుల్లో కొత్త సారథి రానున్నారు. పార్టీ నూతన అధ్యక్షుడి కోసం ఎన్నిక తేదీని భాజపా శుక్రవారం ప్రకటించింది. ఈ పదవికి జనవరి 19న నామినేషన్లు దాఖలు కానున్నట్లు తెలిపింది. ఆ మరుసటి రోజు జనవరి 20న కొత్త అధ్యక్షుడి పేరును ప్రకటించనున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు భాజపా ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.లక్ష్మణ్ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. 19వ తేదీ మధ్యాహ్నం 2-4 గంటల మధ్య అభ్యర్థులు తమ నామినేషన్లను సమర్పించ వచ్చని లక్ష్మణ్ తెలిపారు. ఆ తర్వాత నామినేషన్ల పరిశీలన చేపడతామన్నారు. అదేరోజు సాయంత్రం 5-6 గంటల మధ్య నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నిక అవసరమైతే జనవరి 20న పోలింగ్ నిర్వహించి విజేతను ప్రకటిస్తామన్నారు. ఈ పక్రియంతా భాజపా ప్రధాన కార్యాలయంలో జరగనుంది. కాగా.. ఇటీవల కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమితులైన 45 ఏళ్ల నితిన్ నబీన్ నే పార్టీ నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని అధిష్ఠానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. యువనాయకత్వాన్ని తయారుచేసుకోవడడంలో భాగంగా నబీన్‌కు పార్టీ సారథ్య పగ్గాలు అప్పగించే అవకాశాలు కన్పిస్తున్నాయి. బిహార్‌కు చెందిన నితిన్ నబీన్ సిన్హాను భాజపా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమిస్తూ గతేడాది డిసెంబరులో పార్టీ అనూహ్య ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. కాయస్థ సామాజికవర్గానికి చెందిన నబీన్ సిన్హాకు ఆరెస్సెస్ నేపథ్యం ఉంది. గతేడాది జరిగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బాంకీపుర్ నుంచి నాలుగోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. బిహార్ నుంచి పార్టీలో ఆ స్థాయికి చేరిన తొలినేతగా నబీన్ గుర్తింపు సాధించారు.

# ఇందూరును నిజామాబాద్‌గా మార్చారు

## మళ్లీ తిరిగి ఇందూరుగా మార్చి తీరుతాం
## ఇక్కడ కాషాయ జెండా ఎగరేసి తీర్మానిస్తాం
## ఎంపి అరవింద్ వ్యాఖ్య

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిజామాబాద్, జనవరి 16 : నిజామాబాద్‌ని ఇందూర్‌గా పేర్కొన్న ఎంపీ ధర్మపురి అరవింద్ ఆ పేరు ఎలా వచ్చిందో చారిత్రిక ఆధారాలు ఉన్నాయన్నారు. మీడియాలో మాట్లాడిన ఎంపీ ధర్మపురి అరవింద్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నిజాం ఒక హంతకుడు.. నిజామాబాద్‌కి ఆయన పేరు ఎందుకు పెట్టుకుంటారన్నారు. ఇందూర్‌గా పేరు మార్చి ఆ తీర్మానాన్ని ఏబీవీపీ నుంచి వచ్చిన రేవంత్‌రెడ్డికి పంపిస్తామన్నారు. శ్రీరాముడికి బీజేపీ మెంబర్ షిప్ ఉందని అనుమానం ఉంటే వెళ్లి చూసుకోవాలని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్‌కు తెలిపారు. ముస్లిం అంటే కాంగ్రెస్ అంటున్నారు.. మీ పార్టీకి సున్తీ అయిందా పోయి చూసుకోవాలని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పహల్గాంలో హిందువులా? ముస్లింలా? అని చూసి కాల్చి చంపారని గుర్తు చేశారు. శ్రీరాముడికి బీజేపీ మెంబర్ షిప్ ఉందని అన్నారు. కొంత మంది హిందువుల్లో చెడ పుట్టారన్నారు. తెలంగాణ మొత్తం కాషాయమయం కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ ఎక్కడుందో కవితను అడిగితే చెబుతుందన్నారు.. రేపు సిరిసిల్లలో కూడా చూపిస్తామన్నారు. ఇందూర్‌కి దమ్ముంటే రా అని కేటీఆర్‌కి సవాల్ విసిరారు. చెన్నారెడ్డి సీఎంగా రాజీనామా చేసే వరకు రాష్ట్రంలో మత ఘర్షణలు జరిగాయని ఎంపీ అరవింద్ తెలిపారు. గొడవలకు కారణం కాంగ్రెస్.. అప్పట్లో సత్తయ్య ఏసీపీని చంపితే ఆ నిందితులను బయటకు తెచ్చింది మజ్లిస్.. తిన్న తిండి అరగక హిందూ దేవాలయాల మీద పడుతున్నారు.. దీనికి కారణం రేవంత్ రెడ్డి.. ఇచ్చేది దొంగ వాగ్దానాలు.. హిందూ దేవుళ్ళ మీద ఓట్లు.. గులాంలుగా మారి పోయి హిందువులను తాకట్టు పెడుతున్నారు.. నూటికి నూరు శాతం ఇందూర్ కార్పొరేషన్‌పై బీజేపీ జెండా ఎగురవేస్తాం.. నిజామాబాద్ పేరును ఇందూర్‌గా మారుస్తాం? తీర్మానం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తాం.. నిజాంను ఒకే సారి నేను గాడిద అని ఒక్కసారి అంటే దానిపై రాద్ధాంతం చేస్తున్నారు.. నిజాం చరిత్రలో దుర్మార్గమైన రాజు గానే మిగిలి పోతారు.. ఆయన పేరు చెబితే హిందువులకు గుర్తుకు వచ్చేది అయన చేసిన మారణకాండనే.. ముస్లింలకు అవాస్ యోజన కింద ఇల్లు, ఫ్రీ రేషన్, ఫ్రీ వాక్సినేషన్ మోడీ ఇస్తున్నారు.. ముస్లిం దేశాలకు కూడా వ్యాక్సిన్ పంపించారు.. మీ పిల్లలకు విద్యా, వైద్యం ఇస్తుంది.. నిజాం అంత వెనుకోసుకొస్తున్నా.. రేవంత్ రెడ్డి ఏం చేశారని ఓట్లు వేస్తున్నారు.. ఇన్ని చేసినా మోడీకి ఎందుకు వేయడం లేదు.. ఇదేనా మీ ఇమాందారీ..అని ఎంపీ వ్యాఖ్యానించారు.



# సంక్రాంతి వేళ అర్ధరాత్రి దొంగల హల్‌చల్

## చెంగిచెర్లలో పలు ఇళ్లల్లో భారీ చోరీ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, జనవరి16 :హైదరాబాద్ నగర శివారులోని మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగల ముఠా హల్‌చల్ చేసింది. సంక్రాంతి పండుగ సమయంలో చెంగిచెర్ల కాలనీలో గుర్తు తెలియని దొంగల ముఠా పలు ఇళ్లలోకి చొరబడి భారీ చోరీలకు పాల్పడింది. తెల్లవారుజామున 2:30 గంటల సమయంలో దొంగల ముఠా చేతిలో కత్తులు, ఇతర ఆయుధాలతో చెంగిచెర్ల కాలనీలో సంచరించింది. ముందుగానే రెక్కీ చేసుకుని, కారులో వచ్చిన ఈ ముఠా దాదాపు 12 ఇళ్లలోకి చొరబడి నగదు, బంగారం, వెండి ఆభరణాలు, విలువైన వస్తువులను దోచుకుంది. వరుసగా ఇళ్లల్లో చోరీకి తెగబడ్డ దుండగులు ఆపై అక్కడి నుంచి పరారయ్యారు. తమ ఇళ్లలో దొంగతనం జరిగినట్లు గుర్తించిన బాధితులు వెంటనే మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీంతో కలిసి ఆధారాలను సేకరించే పనిలో పడ్డారు. కేసు నమోదు చేసిన పోలీసులు.. చోరీ జరిగిన ప్రాంతాల్లో సీసీటీవీ ఫుటేజ్, ఇతర ఆధారాల ఆధారంగా దొంగలను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. పండుగ సమయంలో చాలా మంది స్వస్థలాలకు వెళ్లిపోవడంతో ఇళ్లు ఖాళీగా ఉండటాన్ని అదునుగా భావించి దొంగలు ఈ చర్యకు పాల్పడినట్లు పోలీసులు అంచనా వేస్తున్నారు. కాగా.. సంక్రాంతి సమయంలో స్వగ్రామలకు వెళ్లేవారు జాగ్రత్తలు పాటించాలని, పొరుగువారికి సమాచారం ఇవ్వాలని, సీసీటీవీలు, అలారం సిస్టమ్స్ ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు సూచనలు చేశారు. త్వరలోనే దొంగల ముఠాను పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

# సుప్రీం ఆదేశాలను ధిక్కరించిన స్పీకర్

## స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై ధిక్కరణ కేసు
## అనర్హత ఎమ్మెల్యేల చర్యలపై కాలయాపన
## కేసు దాఖలు చేసిన తెలంగాణ బిజెపి నేత

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, జనవరి 16 : తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారిన ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల కేసు మరో కీలక దశకు చేరుకుంది. పార్టీ మారిన ఎమ్మెల్యేల వ్యవహారంపై నిర్ణయం తీసుకోవడంలో జాప్యం జరుగుతోందని ఆరోపిస్తూ తెలంగాణ బీజేపీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుప్రీం న్యాయ స్థానం ఇచ్చిన ఆదేశాలను అమలు చేయలేదని పేర్కొంటూ.. తెలంగాణ శాసనసభ స్పీకర్‌పై కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను తెలంగాణ బీజేపీ శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేశారు. ఈ విషయం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. ఈ క్రమంలో ఎమ్మెల్యేల అనర్హత వ్యవహారంలో తెలంగాణ భాజపా నేతలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ అంశంలో పలువురు ఎమ్మెల్యే లకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ క్లీన్‌చిట్ ఇచ్చిన విషయం తెలిసిం దే. మరికొందరిపై నిర్ణయాన్ని పెండింగ్‌లో పెట్టారు. దీంతో స్పీకర్ పై భాజపా శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి.. కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల విషయం లో 3 నెలల్లో నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు చెప్పినా.. ఆ సూచనను స్పీకర్ పాటించలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ చేసిన వ్యాఖ్యలను కూడా పిటిషన్‌లో పొందు పరిచారు. పార్టీ ఫిరాయింపుల అంశంపై గతంలో విచారణ జరిపిన సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై మూడు నెలల్లో సరైన నిర్ణయం తీసుకోవాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఆదేశించింది. అయితే.. నిర్ణీత గడువు ముగిసినా ఇప్పటివరకు ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని ఇది న్యాయ స్థానం ఆదేశాల ఉల్లంఘన కిందకు వస్తుందని బీజేపీ తన పిటిషన్‌లో స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించకపోవడమే కాకుండా.. కావాలనే తన నిర్ణయాన్ని ఆలస్యం చేస్తున్నారని ఆరోపిస్తూ స్పీకర్‌పై కోర్టు ధిక్కరణ కింద చర్యలు తీసుకోవాలని బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పిటిషన్‌లో కోరారు. కోర్టు ఆదేశాలు అమలు జరగలేదని... ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే ప్రయత్నం, పార్టీ ఫిరాయింపులను చట్టబద్ధం చేసే పరిస్థితి వంటివి ఉన్నాయని పిటీషన్‌లో ప్రస్తావించింది బీజేపీ. పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో స్పష్టత లేకపోవడాన్ని స్పీకర్ నిర్ణయం ఎందుకు ఆలస్యమవుతోందో చూపిస్తున్నాయని బీజేపీ వాదిస్తోంది. అధికార పార్టీకి అనుకూలంగా ఉండేలా నిర్ణయాన్ని స్పీకర్ ఆలస్యం చేస్తున్నారని, పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వ స్థిరత్వంపై ప్రభావం పడుతుందని అందుకే స్పీకర్ ఉద్దేశపూర్వకంగా నిర్ణయం తీసుకోవడం లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు ఏలేటి. ఎమ్మెల్యేలు పార్టీ మారినా ఎలాంటి పరిణామాలు ఉండవనే భావన పెరుగుతుందని బీజేపీ తన పిటిషన్‌లో రాసుకొచ్చింది. ఇప్పుడీ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరడంతో మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. స్పీకర్‌పై కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలుతో ఈ కేసు ఎలాంటి మలుపులు తిరుగుతుందో.. న్యాయస్థానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో అన్నది ఇప్పుడు చర్చనీయాంశమైంది.



# సిఎం రేవంత్ ఆదిలాబాద్ జిల్లా పర్యటన

## ముందస్తుగా మాజీ మంత్రి జోగు రామన్న అరెస్ట్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆదిలాబాద్, జనవరి16 : ఆదిలాబాద్ జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్నను హౌస్ అరెస్టు చేశారు. జోగు రామన్నతో పాటు పలువురు బీఆర్ఎస్ నేతలను హౌస్ అరెస్టు చేశారు. ఇలా బీఆర్ఎస్ నేతల అరెస్టుతో జిల్లాలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ.. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని చనాకా కొరాటా ప్రాజెక్టు ట్రయల్ రన్‌కు రావడం సిగ్గుమాలిన చర్య అని విమర్శించారు. ఆదిలాబాద్ జిల్లా రైతాంగానికి 50 వేల ఎకరాలకు నీరు అందించాలన్న సంకల్పంతో బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ పూర్తిస్థాయిలో ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టి రైతులకు సంకల్పంతో కృషి చేశారని తెలిపారు. కానీ బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఒక్క ఎకరాకు కూడా అందించకుండా ట్రయల్ రన్ చేయడం, దాన్ని ప్రారంభించడం సిగ్గుమాలిన చర్య అని విమర్శించారు. సీఎం పర్యటన నేపథ్యంలో శనివారం అర్ధరాత్రి నుంచే పోలీసులు ముందస్తు అరెస్టులు చేయడం అప్రజాస్వామికం అని జోగురామన్న మండిపడ్డారు. భేలా, జైనత్, ఆదిలాబాద్ మండల నాయకులను ఎక్కడికక్కడ అరెస్టులు చేయడం సమంజసం కాదని సూచించారు. ఒక్క ఎకరానికి కూడా నీరు అందించలేని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనను రైతులు వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. రైతు సమస్యలు పరిష్కరించడంపై ధ్యాసలేని ఈ ముఖ్యమంత్రి కేవలం ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ట్రయల్ రన్ అంటూ మోసం చేస్తున్నారని మండిపడ్డారు.

Printed, Published and Owned by **KORUKANTI MANIDEEP PATEL,** Printed at SRI BALAJI PRINTING PRESS, H.No. 4-4-/85, Thilak Road, Karimnagar, Telangana - 505001 and Published at H.No.2-6-242, Ist Floor, Bus stand to Wesly Church Road, Mukarampura, Karimnagar, Karimnagar (Dist.), Telangana-505001, Editor: **GOLI SAMMI REDDY.** RNI.No.TELTEL/2010/35941. Cell: 9394322782, email: prajalakshyam@gmail.com